అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 23-2-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 56 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

కార్పొరేట్ ఆత్మహత్యలపై..

విద్యార్థులపై ఒత్తిళ్లే కారణమని ఫిర్యాదు

- తెలుగురాష్ట్రాలకు ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు

న్యూఢిల్లీ : విద్యార్థుల ఆత్మహత్యలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్సీ) నోటీసులు జారీ చేసింది. రెండు రాష్ట్రాల్లో ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థులపై ఒత్తిళ్లే ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయంటూ సుప్రీం కోర్టు న్యాయవాది శ్రవణ్ కుమార్ ఎన్‌హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా విద్యార్థులపై యాజమాన్యాలు ఒత్తిడి చేసి, తల్లిదండ్రులకు దూరంగా ఉంచుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాలేజీ యాజమాన్యాల వైఖరి కారణంగా 9లో

జగన్ కేసులో మోడీకి చిక్కులు!

అంతర్జాతీయన్యాయస్థానాన్ని ఆశ్రయించిన మారిషస్


(ఫైల్)

న్యూఢిల్లీ: ఏపీ వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసు మోడీ సర్కారును కోర్టుకు లాగేలా చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఇందూ టెక్ జోన్‌లో పెట్టుబ డులు పెట్టి తాము నష్టపోయామని పేర్కొంటూ మారిషస్ ప్రభుత్వం నెదర్లాండ్స్‌లోని ఆర్బిట్రేషన్ అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఇందు టెక్ జోన్ కుంభకోణం కేసులో గుత్తేదారు శ్యాంప్రసాద్ రెడ్డి, వైఎస్ జగన్ తదితరులపై సీబీఐ 9లో

ఆగని అవినీతి..!

భారత్‌లో పాలకులు మారినా మార్పు లేదు



- అవినీతి దేశాల చిట్టాలో 81వ స్థానం వివరాలు 10లో
- రెండేండ్ల కిందటి కంటే పెరిగిన కరప్షన్
- కరప్షన్ లెస్ దేశాల్లో న్యూజిలాండ్ బెస్ట్
- అవినీతి పోరాటాలపై పెరిగిన దాడులు
- సగటున రోజుకో జర్నలిస్టు హత్య: టీఐ

101మంది కుబేరుల చేతుల్లో 15 శాతం జాతి సంపద

- ఐదేండ్లలో 5 శాతం వృద్ధి
- ఐదేండ్లలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలతో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు: ఆక్స్‌ఫామ్

2



మిర్చి మంటలు

వ్యాపారుల మాయాజాలం.. ధర పతనం

- క్వింటాలుకు రూ.3 వేలే..
- యార్డులో రైతుల కన్నెర్ర వివరాలు 9లో
- ఖమ్మం మార్కెట్‌కు ఒక్కరోజే 70వేల బస్తాలు




ఖమ్మంలో..

వర్సిటీగా కోఠి ఉమెన్స్ కళాశాల

- వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం : కడియం

వివరాలు 3లో

ఐసా అధ్యక్షురాలిపై ఏబీవీపీ దాడి..

- చంపుతామని బెదిరింపులు
- ఢిల్లీలో ఘటన

వివరాలు 2లో

ఎకరా పొలం ఎండనివ్వం

ఆర్థిక మంత్రి ఈటల



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తున్నదని మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. వారికే తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. ఎస్ఆర్ఎస్పి కింద పంటలకు నీళ్లు అందించేందుకు ప్రణాళిక తయారుచేయడం కోసం గురువారం మంత్రి ఈటల సచివాలయంలోని తన ఛాంబర్‌లో జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశమయ్యారు. గోదావరి నదిపై నిర్మిస్తున్న ప్రాజెక్ట్‌తో కరీంనగర్ జిల్లాను సస్యశ్యామలం చేయబోతున్నామని మంత్రి తెలిపారు. గోదావరిమీద నిర్మిస్తున్న ప్రాజెక్టులతో కరీంనగర్ జిల్లాను సస్యశ్యామలం చేయబోతున్నామని, అలాగే ఇప్పుడు వేసుకున్న పంట కూడా ఎండిపోకుండా ఉండేందుకు పకడ్బందీ ప్రణాళికతో ముందుకు పోతున్నామని తెలిపారు. వానాకాలం పంట దోమకాటు వచ్చి తీవ్రంగా నష్ట పోయిందని, యాసంగికి నీళ్లు ఇవ్వండి అని కరీంనగర్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరం సీఎంకు విన్నవించుకుంటే మంజీరా మీద ఉన్న సింగూరు నుండి ఎస్ఆర్‌పిఎస్‌కు నీళ్లు ఇచ్చారని తెలిపారు. 24 గంటల కరెంటు వల్ల కాలువల మీద ఉన్న మోటార్లు నీటిని మొత్తం లాగివేస్తున్నాయని, వాటిని 9 గంటలకు తగ్గించుకోవాలని కోరామన్నారు.. ఒక్క ఎకరం కూడా ఎండిపోకూడదు అనేదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంతగా తాము కష్టపడుతుంటే ప్రతిపక్షాలు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తూ.. రైతుల కండ్లల్లో మట్టి కొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.



నీకు రూ.60 లక్షలు ఇస్తాం.. ఆత్మహత్య చేసుకుంటావా?

- నాయినికి (రిటైర్డ్) జస్టిస్ చంద్రకుమార్ సవాల్

వివరాలు 9లో

ఉన్మాది ఘాతుకం...

- ప్రేమను నిరాకరించినందుకు కత్తితో దాడి
- బాధితురాలి పరిస్థితి విషమం
- ఖమ్మంలో ఘటన వివరాలు 9లో



రాజధాని చుట్టూ అమానుషం

- బాలిక, వికలాంగురాలిపై లైంగికదాడులు
- వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఘటనలు

నవతెలంగాణ-పరిగిరూరల్/కందుకూరు

రాష్ట్ర రాజధాని చుట్టూ ఉన్న వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అమానుష ఘటనలు జరిగాయి. మైనర్‌పై ఇద్దరు యువకులు, వికలాంగురాలిపై మరో యువకుడు లైంగికదాడికి ఒడిగట్టారు. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పరిగి మండలం ఇబ్రహీంపూర్ తండాకు చెందిన బాలిక మూడురోజుల కిందట పొలం దగ్గర బట్టలు ఉతకడానికి వెళ్లింది. అదే తండాకు చెందిన నేనావత్ శ్రీను, నేనావత్ సునీల్ బాలికను సమీపంలోని వాగులోకి ఎత్తుకెళ్లి లైంగికదాడి చేశారు. బాలిక భయంతో మూడ్రోజుల పాటు ఎవరికీ చెప్పలేదు. బుధవారం రాత్రి తల్లికి విషయం చెప్పింది. దీంతో బాలిక తల్లి పరిగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. బాలికను 9లో

రైతు కార్పొరేషన్ చైర్మెన్‌గా గుత్తా !

- ఉగాది రోజున నియమించే అవకాశం
- మద్దతు ధర నిర్ణయంలో రాష్ట్ర రైతు సమన్వయ సమితిదే కీలకం
- ప్రతి ఐదువేల ఎకరాలకు ఒక రైతువేదిక : ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి


ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను పరామర్శిస్తున్న గవర్నర్ నరసింహన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి' పేరిట రాష్ట్రంలో కొత్త కార్పొరేషన్ ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. వ్యవసాయాభివద్ధి - రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను క్షేత్రస్థాయికి తీసుకుపోవడంలో ఈ కార్పొరేషన్ కషి చేస్తుందని ఆయన తెలిపారు. లాభాపేక్ష లేని సంస్థ (నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్)లాగా ఈ కార్పొరేషన్ ఉంటుందని, ఈ సంస్థకు సమకూరిన నిధులను ఈ సంస్థ ఏర్పాటు చేసిన లక్ష్యాల సాధన కోసమే వినియోగిస్తారని ప్రకటించారు. గ్రామ, మండల రైతు సమన్వయ 9లో

చిన్నారిని ప్లాట్‌ఫాంపై వదిలేసి...

రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య

- చావుకు కారణం నలుగురని సీఎంకు ఫేస్‌బుక్‌లో పోస్టు
- తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి పరిధిలో
- మృతులు కామారెడ్డి వాసులు

వివరాలు 3లో






(ఫైల్)



శత్రు శేషం నుంచి వచ్చినవి కావు సార్..
పాలన సరిగ్గా లేకపోతే.........!!

పని చేయని ఏజెన్సీలను తొలగించండి

- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- పాలమూరు ప్రాజెక్టుల ద్వారా ఖరీఫ్‌లో ఆయకట్టుకు నీరు : మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు ప్రాజెక్టులను పూర్తి చేసి వచ్చే ఖరీఫ్‌లో సాగునీరందించాలని నీటిపారు దల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. గురువారం జలసౌధలో జరిగిన సమీక్షా సమావేశంలో వివిధ ప్రాజెక్టుల పనులను ప్యాకేజీల వారీగా సమీక్షించారు. కల్వకుర్తి నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న భూసేకరణ సమస్య గురించి 9లో

ఆభరణాలతో రావొద్దు

ఆలస్యమైతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు

- ఉదయం 9.15, మధ్యాహ్నం 1.45 గంటలకు చేరుకోవాలి
- హాల్‌టికెట్‌తోపాటు గుర్తింపు కార్డు తప్పనిసరి
- రేపటినుంచి టీఆర్టీ రాతపరీక్షలు
- సర్వంసిద్ధం చేసిన టీఎస్‌పీఎస్సీ


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాతపరీక్షల నిర్వహణకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) సర్వంసిద్ధం చేసింది. టీఆర్టీ రాతపరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షా కేంద్రాలకు సకాలంలో హాజరుకావాలని అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ సూచించింది. ఆలస్యమైతే పరీక్షా కేంద్రాల్లోని అనుమతి ఉండబోదని స్పష్టం చేసింది. ఉదయం పరీక్షకు 8.30 నుంచి 9.15 గంటల వరకే కచ్చితంగా 9లో

ఐసా అధ్యక్షురాలిపై ఏబీవీపీ దాడి

చేయిచేసుకున్న కార్యకర్తలు

చంపుతామని బెదిరింపులు



న్యూఢిల్లీ: 'మహిళలు - భద్రత' అనే అంశంపై ప్రసంగిస్తున్న ఐసా (ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్) ఢిల్లీ యూనివర్సిటీ అధ్యక్షురాలు కవల్ ప్రీత్‌కౌర్‌పై ఏబీవీపీ గుండాలు చేయిచేసుకున్నారు. తన ప్రసంగాన్ని అడ్డుకుంటూ వీరంగం సృష్టించడమేకాక... చంపుతామంటూ ఆమెపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఢిల్లీలోని సత్యవతి కళాశాలలో గురువారం జరిగిన ఈ సదస్సుకు ఆమె హాజరుకాగా ఏబీవీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. కౌర్ తెలిపిన వివరాల ప్రకారం... సదస్సులో ఆమె ప్రసంగిస్తుండగా... అక్కడే ఉన్న 40 మంది ఏబీవీపీ కార్యకర్తలు బిగ్గరగా అరుస్తూ ప్రసంగానికి పదేపదే అడ్డు తగిలారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఘటనను కౌర్ తన ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా.. ఆమె ఫోన్ లాక్కుని విసిరేశారు. ఆమెపై చేయి చేసుకున్నారు. చివరకు సదస్సు నుంచి వెళ్లిపోతుండగా చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. కాగా, ఈ ఘటనను విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. సదస్సుని నిర్వహించిన 'షీ.. ద పీపుల్' టీవీ నిర్వాహకురాలు శైలీ చోప్రా ఏబీవీపీ కార్యకర్తల వీరంగాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు.

మెరుగైన రవాణాతో ఈశాన్య ప్రాంత అభివృద్ధి

ఎన్నికల సభల్లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : రవాణాను మెరుగుపరచడం ద్వారా ఈశాన్య ప్రాంతాన్ని అభివృద్ధిపరచాలని తమ ప్రభుత్వం భావిస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. నాగాలాండ్ జిల్లాలోని ట్యున్సెంగ్‌లో జరిగిన ఎన్నికల సభలో మోడీ ప్రసంగించారు. బీజేపీ-ఎన్‌డీపీపీ కూటమిని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ప్రజా ధనం వృదా అవడానికి కారణమవుతున్న లొసుగులు, లోపాలను సరిదిద్దడానికి, నాగాలాండ్‌లో రహదారుల అనుసంధానతను మరింత మెరుగుపరిచే దిశగా కృషి చేస్తామని చెప్పారు. ఎన్నికలు జరగనున్న మేఘాలయ, నాగాలాండ్‌ల్లో పలు బహిరంగ సభల్లో ప్రధాని ప్రసంగించారు. తాము అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ళలోనే 500కిలోమీటర్లు అదనంగా జాతీయ రహదారులను విస్తరించామని చెప్పారు. నాగాలాండ్‌లో రోడ్ల అభివృద్ధికి 10వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని మారుస్తామని చెప్పారు. కోహిమాను స్మార్ట్ సిటిగా తీర్చిదిద్దడానికి రు.1800కోట్లు ఖర్చు పెడతామన్నారు.

వయోజన జంట వివాహాన్ని రద్దు చేయలేం


సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : ఇద్దరు వయోజనులైన స్త్రీ, పురుషులు సమ్మతితో చేసుకున్న వివాహ బంధాన్నీ న్యాయస్థానాలు రద్దు చేయలేవని సుప్రీం కోర్టు గురువారం పేర్కొంది. హదియా కేసును విచారిస్తున్న ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. ఆ వివాహం సరైనదా కాదా, వారి సంబంధం నిజమైనదేనా అనే విషయం కోర్టు చెప్పగలదా అని ధర్మాసనం ప్రశ్నించింది. అలాగే ఆమె(హదియా) సరైన వ్యక్తిని వివాహం చేసుకుందా లేదా అన్నా విషయం కూడా న్యాయస్థానం చెప్పలేదని, తన ఇష్టపూర్వకంగానే అతనిని వివాహం చేసుకున్నట్టు హదియా తెలిపిందని జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. హోమియోపతి విద్యార్థి అయిన హదియా ముస్లిం మతంలోకి మారి అనంతరం ముస్లిం యువకుడిని వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో తదుపరి విచారణ మార్చి 8న జరుగుతుంది.

యోగిపై సీబీఐ విచారణకు హైకోర్టు 'నో'

న్యూఢిల్లీ : 2007 గోరఖ్‌పూర్ అల్లర్ల సందర్భంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలపై సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు గురువారం తిరస్కరించింది. జస్టిస్ కృష్ణ మురారి, ఎసి శర్మ కూడిన డివిజనల్ బెంచ్ ఈ పిటిషన్‌ను తిరస్కరిస్తూ పోలీసుల దర్యాప్తులో కానీ, యోగి ఆదిత్యనాథ్‌పై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించడంలో ఎటువంటి వివక్ష చోటుచేసుకున్నట్లు తమ దృష్టికి రాలేదని పేర్కొంది. 2008లో సీఎం చేసిన ద్వేషపూరిత ప్రసంగమే ఈ అల్లర్లకు కారణమంటూ మహ్మద్ అసద్ హయాత్, పర్వేజ్‌లు పిటిషన్‌ను దాఖలు చేశారు.

యుద్ధ విమానాన్ని నడిపి.. చరిత్ర సృష్టించి..



న్యూఢిల్లీ: యుద్ధ విమానాన్ని నడిపిన మొదటి భారత మహిళగా వైమానిక అధికారి అవనీ చతుర్వేది చరిత్ర సృష్టించారు. భారత వైమానిక దళానికి(ఐఎఎఫ్) చెందిన జాంనగర్ ఎయిర్ బేస్ నుంచి దాదాపు 30 నిమిషాల పాటు ఆమె ఒక్కరే మిగ్-21 యుద్ధ విమానాన్ని నడిపి విజయవంతంగా ప్రయాణాన్ని పూర్తి చేశారని అధికారులు తెలిపారు. మొదటి బ్యాచ్‌కు చెందిన చతుర్వేదితో పాటు భావనాకాంత్, మోహనా సింగ్‌లు యుద్ధ విమానాలు నడపడంలో శిక్షణ తీసుకున్నారు. 2016లో వారిని వైమానిక అధికారులుగా నియమించిన కొన్ని నెలలకే యుద్ధ పైలట్లుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 'శిక్షణలో ఉన్న ఓ యుద్ధ పైలట్ ఈ ఘనతను సొంతం చేసుకోవడం ఓ మైలు రాయి. దీంతో 'నారీ శక్తి' లో ఐఎఎఫ్ నిబద్ధతను తెలియజేస్తున్నది' అని ఐఎఎఫ్ వింగ్ కమాండర్ అనుపమ్ బెనర్జీ అన్నారు. కాగా యుద్ధ పైలట్ల శిక్షణలో భాగంగా తర్వాతి బ్యాచ్ కోసం ముగ్గురు మహిళా ట్రైనీ పైలట్‌లను ఐఎఎఫ్ ఎంపిక చేసింది.

ఆప్ ఎమ్మెల్యేలకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రదాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై దాడి కేసులో అరెస్టయిన ఆప్ ఎమ్మెలేలకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. బుధవారం ఢిల్లీ హైకోర్టులో ప్రవేశ పెట్టిన అనంతరం వారిని తీహార్ జైలుకు తరలించారు. సీఎస్‌పై దాడి నేపథ్యంలో ఆ రాష్ట్ర ఐఎఎస్ అధికారుల సంఘం నిరసనలు రెండో రోజు కూడా కొనసాగుతున్నాయి. ఢిల్లీ ప్రభుత్వం సమావేశాలను బహిష్కరించాలని ఐఎఎస్ అధికారులు నిర్ణయించినట్టు సమాచారం. కార్పొరేట్ బ్యాంకుల మోసపూరిత రుణాలకు సంబంధించిన ప్రత్యేక కమిటీ సమావేశానికి అన్షు ప్రకాశ్ సహా ముగ్గురు అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో ఈ సమావేశం వచ్చేవారంలో జరగనుంది. మరోవైపు అరెస్టయిన నాయకులు ప్రాతినిథ్యం వహించే కమ్యూనిటీల కారణంగానే వారిని టార్గెట్ చేశారని ఆప్ ఆరోపించింది.

షూ, సాక్సులు వేసుకున్నారో...

బీహార్ విద్యాశాఖ వింత నిర్ణయం

పాట్నా: బీహార్‌లో బుధవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు.. బూట్లు, సాక్సులు వేసుకురావద్దని ఆ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే... బీహార్‌లో పదో తరగతి పరీక్షలలో మాస్ కాపీయింగ్‌ను అరికట్టడానికి విద్యార్థులందరూ సాక్సులు, బూట్లు ధరించరాదని ఆదేశాలు జారీ చేసింది. వీటి స్థానంలో చెప్పులు వేసుకోవాలని సూచించింది. పరీక్షకు బూట్లు వేసుకుని హాజరైతే, పరీక్షకు అనుమతివ్వబోమని తెలిపింది. బీహార్‌లో 17 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తోన్నారు. ఇటీవల జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షల్లో దాదాపు 1000 మంది విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడ్డారు. దీంతో విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుందని అధికారులు తెలిపారు. అయితే ఈ నిర్ణయంపై ఆర్‌జేడీ విమర్శలు గుప్పించింది. 'నితీశ్‌కుమార్ ప్రభుత్వం విద్యార్థుల షూలు విప్పించింది. భవిష్యత్‌లో దుస్తులూ విప్పించే అవకాశం ఉంది..కానీ, విద్యా వ్యవస్థను మెరుగుపరిచే చర్యలు చేపట్టడం లేదు' అని తేజస్వి యాదవ్ ట్విట్టర్ ద్వారా విమర్శించారు.

101 మంది కుబేరుల చేతుల్లో

15 శాతం జాతి సంపద

ఐదేండ్లలో 5 శాతం వృద్ధి

- ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలతో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు : ఆక్స్‌ఫామ్ ఇండియా నివేదిక స్పష్టీకరణ



న్యూఢిల్లీ: గత మూడు దశాబ్దాలుగా దేశం సాధిస్తున్న అభివృద్ధిలో సమతుల్యత లోపించిందని పలు అధ్యయనాల్లో ఇప్పటికే వెల్లడైంది. దేశ జీడీపీ(దేశ స్థూల జాతీయోత్పత్తి లేదా సంపద)లో 15 శాతం వాటా 101మంది కుబేరుల చేతుల్లో పోగుపడిందని స్వచ్ఛంద అధ్యయన సంస్థ ఆక్స్‌ఫామ్ ఇండియా తన తాజా నివేదికలో తెలిపింది. ఐదేండ్ల క్రితం దేశ సంపదలో కుబేరుల వాటా 10 శాతం ఉండగా ఇప్పుడు మరో 5 శాతం పెరిగింది. గత మూడు దశాబ్దాలుగా అసమాన అభివృద్ధి విధానాలను ప్రభుత్వాలు అనుసరిస్తుండటం వల్లే ధనవంతులు మరింత ధనవంతులుగా బలపడటానికి కారణమైందని ఆక్స్‌ఫామ్ తన నివేదికలో స్పష్టం చేసింది. ఏటేటా దేశంలో సృష్టి అవుతున్న సంపదలో సింహ భాగాన్ని కోటీశ్వరులు తమ ఖాతాల్లో వేసుకుంటూ విపరీతంగా ఆస్తులు పెంచుకుంటున్నారని ఆక్స్‌ఫామ్ తెలిపింది. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ ఉదార ఆర్థిక విధానాలు, వారసత్వంగా సంపద బదలాయింపు అందుకు దోహదపడ్డాయని ఆక్స్‌ఫామ్ నివేదిక వివరించింది. 1991లో పెద్దఎత్తున చేపట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితంగానే ఈ అసమానతలని ఆక్స్‌ఫామ్ ఇండియా సీఈవో నిషా అగర్వాల్ అన్నారు.

పెరుగుతున్న అంతరాలు పేరుతో పలు అంశాలను ఆక్స్‌ఫామ్ నివేదిక-2018 పేర్కొన్నది. ఆదాయం, వస్తువులు-సేవల వినియోగాలకు సంబంధించిన అంశాల్లో అత్యధిక అసమానతలున్న దేశాల్లో భారత్ ఒకటి అని నివేదిక తెలిపింది. ప్రభుత్వాలు అనుసరించిన అభివృద్ధి నమూనా-విధానాలు పెట్టుబడిదారులు, నైపుణ్య కార్మికులకు అనుకూలంగా.. శ్రామికులకు వ్యతిరేకంగా ఉండటం వల్లే అసమానతలు అధికమయ్యాయని తెలిపింది.

నివేదిక కోసం పలు వివరాలను ఆక్స్‌ఫామ్ సేకరించింది. 1991 నుంచి అసమానతలు బాగా పెరిగాయని ఆక్స్‌ఫామ్ తెలిపింది. భారత్‌లోని అసమానతల్లో కులం, మతం, ప్రాంతం, లింగ వివక్షవంటివి కూడా కలగలిసి ఉండటం ఆందోళన కలిగించే అంశమని ఆక్స్‌ఫామ్ తన నివేదికలో పేర్కొన్నది. అసమానతలు తగ్గించడానికి ప్రాధాన్యత ఇవ్వడం ప్రజాస్వామిక ప్రభుత్వాల నైతిక బాధ్యత అని నివేదికను రూపొందించినవారిలో ఒకరైన ప్రొఫెసర్ హిమాన్షు అన్నారు. ఇప్పుడు అనుసరిస్తున్న ట్రెండ్‌ను రివర్స్ చేయాలంటే ప్రత్యక్ష పన్నుల్లో పురోగతి సాధించాలని, వారసత్వ సంపదపై పన్ను విధించాలని నిషా అగర్వాల్ సూచించారు. సంపన్నుల నుంచి వసూలు చేసిన పన్నులను పేదలకు విద్య, ఆరోగ్య వసతులను మెరుగు పరచడం కోసం వినియోగించాలని తెలిపారు. 'పేద చిన్నారుల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. దేశం సాధించే వృద్ధిని అందరికీ విస్తరించడం కోసం ఈ చర్యలు చేపట్టక తప్పదని అగర్వాల్ స్పష్టం చేశారు.

ఇటీవల స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు ముందు ఆక్స్‌ఫామ్ వెల్లడించిన నివేదిక కూడా దేశ సంపద కొందరి చేతుల్లోనే పోగు పడటాన్ని గుర్తు చేసింది. ఆ సందర్భంగా వెల్లడించిన నివేదిక దేశ సంపదలోని 73 శాతం ఒక్క శాతం మంది కుబేరుల చేతుల్లో పోగు పడిందని తెలిపింది. 2017లో దేశంలోని ఒక్కశాతం ధనవంతుల చేతిలో రూ.20 లక్షల 90 వేల కోట్ల సంపద పోగుపడిందని ఆ నివేదిక తెలిపింది. 1980 తర్వాత భారత్‌లోని 0.1 శాతంమంది కుబేరుల సంపద 3000 శాతం వృద్ధి చెందగా, సగం జనాభా సంపద 107 శాతం మాత్రమే పెరిగిందని గతేడాది డిసెంబర్‌లో విడుదలైన వరల్డ్ ఇన్ ఈక్వాలిటీ ల్యాబ్ నివేదికలోనూ వెల్లడైంది.

గత మూడు దశాబ్దాల (ఆశ్రిత) పెట్టుబడిదారీ అనుకూల, ఉదార ఆర్థిక విధానాల వల్ల దేశంలో అసమానతలు పెరిగిపోయినట్టు ఆక్స్‌ఫామ్ తాజా నివేదికలో వెల్లడైంది. కాంగ్రెస్ నేత పివి నర్సింహారావు 1991లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్‌లో పెట్టుబడిదారీ అనుకూల ఆర్థిక సంస్కరణలు పెద్దఎత్తున చేపట్టిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కేంద్రంలో అధికారం చేపట్టిన ఏ ప్రభుత్వమైనా(బీజేపీ లేదా కాంగ్రెస్) స్వల్ప మార్పులతో అవే విధానాలను కొనసాగించాయి. పెట్టుబడిదారుల్లో ఓ ఆశ్రిత వర్గానికి కాంగ్రెస్ చేయూతనివ్వగా, మరో వర్గానికి బీజేపీ అండదండలందిస్తోంది. విధానపరమైన మార్పులేమీలేనందునే ఆశ్రిత పెట్టుబడిదారులు అంతకంతకూ తమ సంపదను పోగేసుకోవడంతో ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగాయని ఆక్స్‌ఫామ్ నివేదిక స్పష్టం చేసింది.

టాయిలెట్ లేదన్న సాకుతో...

- ఇల్లులేని మహిళకు రేషన్ నిరాకరణ
- బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఘటన

భోపాల్ : రేషన్‌కార్డును ఆధార్‌కు లింకు చేయలేదని.. రేషన్ నిరాకరించడంతో బీజేపీ పాలిత జార్ఖండ్ రాష్ట్రంలో ఆకలిచావుల విషాద ఘటనలను చూశాం... ఇప్పుడు తాజాగా అదే పార్టీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో రేషన్‌కు సంబంధించి మరో విచిత్ర ఘటన వెలుగులోకి వచ్చింది. ఈసారి ఆధార్‌కార్డు ప్లేస్‌లో టాయిలెట్ వచ్చి చేరింది. బద్వానీ జిల్లా సజ్వానీ గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి ఇంట్లో టాయిలెట్ లేదన్న సాకుతో నాలుగు నెలలుగా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఇచ్చే రేషన్‌ను నిరాకరించారు. ఇక్కడ విచిత్రమేమంటే.. ఆ కుటుంబానికి ఇల్లే లేదు. ఇక టాయిలెట్ ఎక్కడి నుంచి వస్తుంది? ఆ గ్రామ పెద్ద ఒకరు ఇచ్చిన ఒక చిన్న గుడిసెలో ఆ మహిళ తన ముగ్గురు మైనరు పిల్లలతో కలసి ఉంటున్నది. 'పేదకుటుంబాలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు కట్టిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. నాకు ముందు ఇల్లు ఇస్తే.. టాయిలెట్‌ను నిర్మించుకోగలను. టాయిలెట్ నిర్మాణానికి సబ్సిడీ ఇస్తామని చెప్పిన మాట నిజమే... కానీ, అసలు ఇల్లే లేదు.. ఆ సబ్సిడీ తీసుకొని టాయిలెట్‌ను ఎక్కడ నిర్మించుకోను? టాయిలెట్ లేదని నాలుగు నెలల నుంచి రేషన్ నిలిపివేశారు. నాకు ముగ్గురు పిల్లలు.. నాకు ఆసరా ఏమీ లేదు... ఆ ఇచ్చే రేషన్ కూడా నిలిపివేస్తే.. మేం ఆకలితో చావాల్సిందే..' అని ఆ మహిళ వాపోయింది. ఓ గ్రామ పెద్ద ఇచ్చిన ఆ చిన్న గుడెసెలో నివాసముంటున్నాను. గ్రామాన్ని శుభ్రం చేసినందుకు వచ్చే రూ. వెయ్యితో జీవనం సాగిస్తున్నానని ఆ మహిళ చెప్పింది. ఇప్పుడు ఆ రేషన్ నిలిపివేస్తే.. నా పిల్లలను పస్తులుంచాలని, మా కుటుంబం ఆకలితో మృతిచెందాలనరి ఆ మహిళ కన్నీటిపర్యంతమయ్యింది.

బనారస్ వర్సిటీ కల్చర్ ఫెస్టివల్‌లో

గాడ్సేను ప్రశంసిస్తూ సాంస్కృతిక ప్రదర్శన

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బనారస్ హిందూ యూనివర్సిటీ(బీహెచ్‌యూ)లో హిందూత్వ వాదులు మరో వివాదానికి తెరలేపారు. జాతిపిత మహాత్మా గాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేను ప్రశంసిస్తూ.. సాంస్కృతి ప్రదర్శన నిర్వహించారు. గాంధీ నినాదాలు 'సత్యం, అహింస'లను పరిహసిస్తూ ఆ ప్రదర్శన జరగడం గమనార్హం. జాతి ఆదర్శాలనే కించపరిచేలా ఈ కార్యక్రమం జరిగిందని కొందరు విదార్థులు పోలీసులకు ఫిర్యాదుచేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ విద్యార్థులు వారణాసిలోని లంకా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బీహెచ్‌యూలోని ఆర్ట్స్ విభాగ సిబ్బంది నిర్వహిస్తున్న మూడురోజుల కల్చరల్ ఫెస్టివల్‌లో ఈ ప్రదర్శన నిర్వహించినట్టు పేర్కొన్నారు. 1947 దేశ విభజన సహా దేశంలోని అనేక సమస్యలకు మహాత్మా గాంధీ కారణమని ప్రదర్శనలో నిందించారని పేర్కొన్నారు. గాంధీని హత్యచేసిన నాథూరామ్ గాడ్సేను ప్రశంసించారని వివరించారు. స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగం, బీహెచ్‌యూల ఆదర్శాలను కించపరిచేవిధంగా వారి సాంస్కృతిక ప్రదర్శనసాగిందని తెలిపారు. కొంతమంది ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఈ కుట్రపన్నారని, ఇందులో భాగమైన అందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో కోరారు. చీఫ్ ప్రోక్టర్ రోయనా సింగ్ ఈ ఘటనను ధృవీకరించారు. ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ దీనికి కారణమని, ఆయనను కలిసి నిజాలను వెలికి తీస్తామని హామీనిచ్చారు.

25న వడోదరలో మరో కార్యక్రమం

గుజరాత్‌లోని వడోదరలో ఇదే తరహాలో ఈ నెల 25న 'హే రామ్ నాథూరామ్' పేరిట నాటకాన్ని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ విభాగం మండిపడుతోంది. ఈ నాటకానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరుతూ పోలీసు కమీషనర్, మునిసిపల్ కమిషనర్ కార్యాలయాల ముందు గురువారం ధర్నా చేశారు. అనంతరం ఆ నాటకాని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఇది యావత్ దేశానికే అవమానమని, ఈ నాటకం పట్టణంలో అశాంతిని రేపే ప్రమాదముందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

రాజస్థాన్‌లో అరెస్టు చేసిన


రైతు నేతలను వెంటనే విడుదల చేయాలి : సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ: ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నిరసన తెలియచేస్తున్న రైతాంగంపై రాజస్థాన్‌లోని వసుంధరా రాజే సర్కారు అనుసరిస్తున్న అణచివేత చర్యలను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. అఖిల భారత కిసాన్‌సభకు చెందిన వందలాది మంది రైతు నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేసి వారిపై తప్పుడు కేసులు బనాయించారని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో విమర్శించింది. అరెస్టయిన వారిలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు అమ్రారామ్, మాజీ ఎమ్మెల్యేలు పేమారామ్, పవన్ దుగ్గల్ వంటి వారున్నారని వివరించింది. 2017 ఎన్నికల్లో వ్యవసాయ రుణాల మాఫీ, గిట్టుబాటు ధర వంటి వాటిపై ఇచ్చిన హామీలను బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కటాన్ని నిరసిస్తూ రాష్ట్ర రాజధాని జైపూర్ వైపు ప్రదర్శన కొనసాగిస్తున్న సమయంలో వీరిని అరెస్ట్ చేశారని పొలిట్ బ్యూరో తన ప్రకటనలో పేర్కొంది. నిరసన వ్యక్తం చేయటం కనీస ప్రజాతంత్ర హక్కు అన్న విషయాన్ని విస్మరించిన వసుంధర సర్కారు కిసాన్ ఉద్యమ నేతలపై పోలీసు బలగాన్ని ఉపయోగించటం ద్వారా తన నియంతృత్వ వైఖరిని ప్రదర్శించిందని దుయ్యబట్టింది. అరెస్టయిన వారందరినీ వెంటనే విడుదల చేసి వారిపై నమోదు చేసిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని, చట్టబద్ధమైన కిసాన్‌సభ డిమాండ్లను ఆమోదించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

ఢిల్లీలో ప్రజాపంపిణీ, కనీస వేతనాలపై సీపీఐ(ఎం) ఆందోళన

న్యూఢిల్లీ: దేశ రాజధాని హస్తినలో ప్రజాపంపిణీ వ్యవస్థను సక్రమంగా అమలు చేయాలని, అసంఘటిత రంగంలోని ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీ సచివాలయం ఎదుట గురువారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్, సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కెఎం తివారీ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు,కార్యకర్తలు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. అంతకు ముందు నిరసన ప్రదర్శన కొనసాగిస్తున్న వారిని పోలీసులు అడ్డుకోవటంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.

జాతీయ జెండా కాషాయీకరణ కాకూడదు



చెన్నై: మదురైలో బుధవారం అభిమానుల సమక్షంలో పార్టీ పేరును ప్రకటించిన విలక్షణ నటుడు కమల్ హాసన్.. తాజాగా బీజేపీ పై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. జాతీయ జెండా కాషాయీకరణ కాకూడదని బీజేపీని ఉద్దేశిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళ పత్రిక ఆనంద్ వికటన్‌కు రాసిన ఓ వ్యాసంలో ఆయన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. త్యాగానికి చిహ్నమైన జాతీయ జెండాలోని కాషాయరంగును తాను గౌరవించడంలేదన్నది తప్పని ఆయన అన్నారు. అందరికి స్థానం కల్పించి గౌరవించాలని ద్రవిడ సిద్ధాంతం ఉట్టిపడే తన పార్టీ జెండాను ఉదహరిస్తూ ఆయన వివరించారు. ఓట్లు పొందడానికి రాజ్యాంగం నుంచి సెక్యులర్ పదాన్ని తొలగించేలాంటి చర్యలకు సిద్ధపడాలా? అని కేంద్రమంత్రి అనంత్ కుమార్ హెగ్డె వ్యాఖ్యలను ఉటంకిస్తూ అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అడుగు పెట్టడానికి ప్రయత్నిస్తుందన్నారు. అధికార ఏఐఏడీఎంకే పార్టీకి దగ్గరవడం, ప్రతిపక్ష డీఎంకే నేత కరుణానిధిని ప్రధాని మోడీ కలవడం అందులో భాగమన్నారు. నీతి లేని రాజకీయాలను మార్చడానికి తన జీవితాన్ని సైతం లెక్కచేయనని ఆయన అన్నారు. తన పార్టీ ద్రవిడ సిద్ధాంతం నుంచి తన పార్టీ పుట్టుకొచ్చిందని స్పష్టం చేశారు.

4 విగ్రహాలు.. 6,939 కోట్లు

ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు.. వారి బాగోగులు గురించి పట్టించుకోవాలి. అమలు చేసే సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించాలి. కానీ, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని పాలకులు ఇప్పుడు విగ్రహాల ఎత్తుల్లో పోటీపడుతున్నారు. ఎంత ఎత్తులో విగ్రహాన్ని స్థాపిస్తే.. అంత పేరు వస్తుందనేలా ఉంది వారి వ్యవహారశైలి. అధికారంలో ఉన్న పార్టీ.. మరోవైపు ఈ విగ్రహాలకు ఇచ్చే విరాళాలకు పన్ను మినహాయింపు ఉండటంతో కోట్లు ఇవ్వడానికి బడా సంస్థలు రెడీ అయిపోతున్నాయి. కేవలం నాలుగు అతిపెద్ద విగ్రహాలను ఈ ఏడాదిలోపు పూర్తిచేసేలా అక్కడి బీజేపీ ప్రభుత్వాలు తలమునకలయ్యాయి.





ఖజానా నిధులను గుమ్మరిస్తున్న ప్రభుత్వాలు

- ప్రజా సంక్షేమం కన్నా... ప్రతిమల స్థాపనే మిన్నగా..
- బీజేపీ పాలిత రాష్ట్రాల తీరిది

నవతెలంగాణ జనరల్ డెస్క్

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో నాలుగు పెద్ద ప్రాజెక్టుల కోసం కోట్లు గుమ్మరిస్తున్నారు. ఈ నాలుగు అతిపెద్ద నిర్మాణాలకు అక్షరాల రూ. 6,939 కోట్లు ఖర్చుపెడుతున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ సర్కారు ఖజానాను నీటి ప్రవాహంలా వెచ్చిస్తున్నారు. అయితే ఇంత భారీగా నిధులు ఖర్చుపెడుతున్నది జనం కోసం కాదు. భారీ విగ్రహాల స్థాపనకు వినియోగిస్తుండటం గమనార్హం. మహారాష్ట్రలో 3,600కోట్లతో శివాజీ స్మారక స్థూపాన్ని కడుతున్నారు. సముద్రంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దేలా డిజైన్ చేశారు. ఇక్కడ తలపెట్టే ఇలాంటి విగ్రహ స్థాపనలకు కాసులపరంగా ఎలాంటి ఆటంకం ఏర్పడటంలేదు. ఎందుకంటే దేశానికి ఆర్థిక రాజధాని ముంబయికావటంతో.. అక్కడి బీజేపీ పాలకులు నిధుల పరంగా ఎలాంటి ఇబ్బందీ ఉండదనే వాదన వినిపిస్తున్నది. ప్రభుత్వాలతో పోటీగా ట్రస్టులు, ఇతర సంస్థలు కూడా కోట్లు వెచ్చించటానికి ఏమాత్రం వెనకాడటంలేదు.

రాజస్థాన్‌లో ఓ ప్రయివేట్ సంస్థ నాథ్‌ద్వారాలో శివుని ప్రతిమను రూపొందిస్తున్నది. ఈ విగ్రహం ఎత్తు 351 అడుగులు. ఈ విధంగా మొత్తం ఆరు అతిపెద్ద విగ్రహాలు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తెలంగాణలోనూ 216 అడుగుల ఎత్తులో ఉండే విగ్రహాన్ని తయారుచేస్తున్నారు. ఈ నిర్మాణానికి అవసరమైనవన్నింటినీ మందిర ట్రస్టు సమకూరుస్తున్నది. తెరముందు సంస్థలు, ట్రస్టులు ఉన్నా వీటి వెనుక అక్కడి ప్రభుత్వాలు పూర్తిగా సహకరిస్తున్నాయనటంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు.

1. గుజరాత్ : స్టాట్యూ ఆఫ్ యూనిటీ - రూ. 2989 కోట్లతో విగ్రహం

గుజరాత్‌లోని నిర్మించనున్న స్టాట్యూ ఆఫ్ యూనిటీ విగ్రహానికి రూ. 2989 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహం 182 మీటర్ల ఎత్తులో ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటివరకు రూ. 1,100 కోట్లు ఖర్చుచేశారు. ఈ ఏడాది జూన్‌లో ప్రారంభోత్సవం చేసేలా అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

నీళ్లకోసం అవసరమైన నిధులు 4,800 కోట్లు

గుజరాత్ ప్రభుత్వం అభివృద్ధిపనుల నిమిత్తం ఇంటర్నేషనల్ ఏజెన్సీలవద్ద నుంచి రూ. 17,620 కోట్ల మేర అప్పులు తీసుకునేందుకు అనుమతించాలని కేంద్రానికి విన్న వించింది. సౌరాష్ట్రలోని నర్మదానదీలో నీటి చుక్కలేదు. ఎన్నికల్లో పూర్తిగా నీటివదిలేశారు. ఇప్పటికీ ఇక్కడి నీటి సమస్యను తీర్చటానికి రూ. 4,600కోట్లు అవసరమున్నది. జపాన్ జైకా లాంటి రుణసంస్థలకు ఫండింగ్ కోసం మెట్రో రైలుతో సహా పలు ప్రాజెక్టులు ఎదురుచూస్తున్నాయి.

2. ఉత్తరప్రదేశ్ : అయోధ్యలో 108 మీటర్ల ఎత్తులో విగ్రహం

అయోధ్యలో రామమందిరానికి 108 మీటర్ల ఎత్తులో నిర్మించాలని యోగి సర్కారు ఆరాటపడుతున్నది. దీనికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్లు వెచ్చించైనా ఆ విగ్రహాన్ని నిర్మించాలనుకుంటున్నది. అవసరమైన నిధుల కోసం విరాళాలు సేకరించాలనుకుంటున్నది.

వైద్యానికి అవసరమైన నిధులు రూ. 473 కోట్లు - ఆస్పత్రుల్లో ఎమర్జన్సీ వార్డులేక అవస్థలు

లక్నో పీజీఐలో 250 పడకల ఆస్పత్రి, లివర్, కిడ్ని ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ నిర్మాణాలు ఇంకా షురూ కాలేదు. దీనికోసం రూ. 473 కోట్లు నిధులు కావాలి. ట్రోమా సెంటర్ కట్టడానికి నిధులలేమితో అవస్థలు పడుతున్నది. యూపీలో కోన్నౌజ్ ప్రాంతంలో సైన్స్ లాబోరేటరీ బిల్డింగ్‌కు నిధులు లేక గత ఎనిమిదినెలలనుంచి పనులు ఆగిపోయాయి.

3. మధ్యప్రదేశ్ : 108 అడుగుల ఎత్తు విగ్రహం

మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆది శంకరాచార్య విగ్రహాన్ని 108 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నది. దీనికి సుమారు రూ. 200కోట్లు వెచ్చించనున్నట్టు సమాచారం. దీనికోసం ఏకాత్మయాత్రల పేరిట ప్రచారంతోపాటు ఎన్నికల్లో లబ్దికి రథాలను సిద్ధం చేసింది.

4. రాజస్థాన్ : 351 అడుగుల ఎత్తులో శివుని విగ్రహం

రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారాలో 351 అడుగుల ఎత్తు ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో సుమారు 600మంది కార్మికులు, మరో 200 శిల్పకళాకారులు పనిచేస్తున్నారు.

5. తెలంగాణలో వెయ్యికోట్లతో స్టాట్యూ ఆఫ్ ఈక్వలిటీ

హైదరాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలోని శంషాబాద్‌లో సంత్ రామానుజాచార్య విగ్రహాన్ని 216 అడుగుల ఎత్తుల నిర్మించటానికి సన్నద్ధమవుతున్నది. దీన్ని మందిర్ ట్రస్ట్ తయారుచేస్తున్నది.

బీజేపీ పాలితరాష్ట్రాల్లో నిర్మిస్తున్న ఈ విగ్రహాలతో మూఢ నమ్మకాలు పెరగటానికి ప్రతీక అని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. జనం ఆరోగ్యాలను గాలికొదిలి... ఇలాంటి కట్టడాల వల్ల జరిగే మేలు ఏమిటో తెలియదుకానీ... నీరసించిన సమాజం ఏర్పడటం మాత్రం ఖాయమని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నారిని ప్లాట్‌ఫాంపై వదిలేసి..

రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య

- చావుకు కారణం నలుగురని సీఎంకు ఫేస్‌బుక్‌లో పోస్టు
- తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి పరిధిలో ఘటన
- మృతులు కామారెడ్డి వాసులు



నవతెలంగాణ-తూప్రాన్

రైలు కింద పడి ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. తమ చావుకు నలుగురు కారణమని ఫేస్‌బుక్‌లో సీఎం కేసీఆర్‌కు పోస్టు చేసి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. నిజామాబాద్ జిల్లా పద్మాజీగూడకు చెందిన ఒంటెద్దు కాశీరాం(30), దేవేంద్ర(28) బంధువులు. కాశీరాంకు వరుసకు తమ్ముడైన వ్యక్తి భార్య దేవేంద్ర. ఈమె భర్త కొన్నేండ్లుగా బతుకుదెరువు నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఈ క్రమంలో కాశీరాం, దేవేంద్ర మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఇటీవలే ఇద్దరి మధ్య మనస్పర్థలొచ్చి గొడవలు పడుతున్నారు. అయితే వీరిద్దరు బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తూప్రాన్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని పట్టాల వద్ద దేవేంద్ర కూతురు(1)తో వచ్చి స్థానికులకు కనిపించారు. 'ఏమైంది? పట్టాల వద్ద ఉన్నారు' అని స్థానికులు వారిని ప్రశ్నించారు. 'మేడ్చల్‌లో బంధువుల పెండ్లి ఉంది. తెలీక ఇక్కడ దిగాం. పక్క గ్రామంలో తెలిసినవారు ఉన్నారు. అక్కడికి వెళ్తున్నాం' అని చెప్పారు. తెల్లవారే సరికి ఇద్దరి శవాలు రైలు పట్టాలపై పడి ఉన్నాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. చిన్నారి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై ఉండడాన్ని గుర్తించారు. కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతులు కామారెడ్డికి చెందినవారుగా గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఫేస్‌బుక్‌లో సీఎంకు సూసైడ్ నోట్ పోస్టు...

'మా ఆత్మహత్యకు నలుగురు కారణం. నన్ను, నా భార్యను విడదీయాలని చూస్తున్నారు. ఆ నలుగురిని విచారిస్తే మా చావుకు కారణమేంటో తెలుస్తుంది. వారిని కఠినంగా శిక్షించాలి' అని మృతుడు కాశీరాం చనిపోయే ముందు సీఎంకు 'ఫేస్‌బుక్' ద్వారా పోస్టు చేసినట్టు పోలీసులు గుర్తించారు. మృతుడి పోస్టు ప్రకారం విచారణ చేపడుతామని వారు తెలిపారు.

25 నుంచి దళితుల ఆత్మగౌరవ సభలు

కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు



నవతెలంగాణ-సూర్యాపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన నాలుగేండ్ల కాలంలో దళితులపై దాడులు మరింత పెరిగాయని, ఈ దాడులను నిరసనగా ఈనెల 25 నుంచి 15 రోజుల పాటు దళిత ఆత్మగౌరవ సభలు నిర్వహించనున్నట్టు కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు తెలిపారు. గురువారం సూర్యాపేటలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని సవరించడానికి, రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని రద్దు చేసి బడ్జెట్‌లో వాటా దక్కనీయకుండా చేసిందన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ గూండాల దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా చందూరు, యాదాద్రి జిల్లా చిన్న కందుకూరు దళితవాడలపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడులు చేశాయని గుర్తు చేశారు. ఈ ఘటన కారకులను నేటికీ అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో 14 కుల దూరహంకార హత్యలు జరిగాయని తెలిపారు. దాడులు, దౌర్జన్యాలు, సాంఘిక బహిష్కరణలు రోజురోజుకూ మితిమీరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డీజీపీ నివేదిక ప్రకారం 2014లో 1,204 ఘటనలు, 2017లో 1904 ఘటనలు జరిగాయని తెలిపారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మర్రి నాగేశ్వర్‌రావు, కోట గోపి, బోయిండ్ల అర్జున్, పేరం బాలస్వామి, టేకుల సుధాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐఎంసీఐ ఆధ్వర్యంలో...
ఎంబీఏ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కౌన్సిలింగ్

హైదరాబాద్: ప్లేస్‌మెంట్‌కు హాజరయ్యే అభ్యర్థులు రాణిస్తేనే ఉద్యోగాలకు అర్హులవుతారని వక్తలు అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు ఎంబీఏ తర్వాత ఉద్యోగావకాశాలు, ఇంటర్వ్యూలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హైదరాబాద్‌లోని శ్రీ ఇందు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో గురువారం ప్లేస్‌మెంట్ కౌన్సిలింగ్‌పై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పలు ప్రయివేటు సంస్థల అధ్యక్షులు, ఎండీలూ హాజరయ్యారు. ఐఎంసీఐ మాజీ అధ్యక్షుడు ఎం. వినయ్‌కుమార్ అధ్యక్షత వహించారు.

కళాశాల ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐఎంసీఐ అధ్యక్షుడు విజయసారథి కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంబీఏ విద్యపై బాగా పోటీ పెరిగుతున్నదని, మంచి మార్కులతో పాటు నైపుణ్యత కీలకమని తెలిపారు. ఎంబీఏ తర్వాత ఉద్యోగావకాశాలు ఏ విధంగా ఉంటాయో వివరించారు. ఇంటర్వ్యూలలో తీసుకోవాల్సిన సూచనలను విశదీకరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. ఎంబీఏ తర్వాత బహుళ జాతి కంపెనీలలో చాలా అవకాశాలున్నాయని తెలిపారు. విద్యార్థులకు ఇంటర్వ్యూలలో అడిగే ప్రశ్నలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు మాక్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఇందులో శ్రీ ఇందు కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర స్కూళ్లనుంచి వచ్చిన విద్యార్థులూ హాజరయ్యారు.

వసతి గృహంలో గంజాయి

విద్యార్థి సంఘాల జోక్యంతో వెలుగులోకి

- వంద కిలోల గంజాయి స్వాధీనం
- పరారీలో వార్డెన్
- కలెక్టర్‌కు నివేదిక : డీఐఈఓ రవికుమార్



నవతెలంగాణ-సూర్యాపేట

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ వసతి గృహంలో గంజాయి నిల్వలు ఉండటం కలకలం రేపింది. విద్యార్థులు స్టడీ అవర్ నిమిత్తం భవనంపైకి వెళ్తున్న సమయంలో వాసన రావడంతో వారు విద్యార్థి సంఘాల నాయకులకు తెలిపారు. దీంతో విషయం బయటకు పొక్కింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బుధవారం అర్ధరాత్రి పట్టణంలోని విద్యానగర్ సమీపంలోని గాయత్రి బాలుర వసతి గృహంలో గంజాయి నిల్వలు ఉన్నట్టు విద్యార్థి సంఘాల నాయకులకు తెలిసింది. హాస్టల్‌కు వెళ్లి బల్లపీట కింద ఉన్న గంజాయి ప్యాకెట్లను గుర్తించి బయటకు తీసుకొచ్చారు. వార్డెన్ లింగానాయక్ సోదరుడు మహబూబ్‌నగర్ జిల్లా తానంచర్ల పరిధిలోని కోట్యాతండాకు చెందిన రంగన్న ఆటోలో రాత్రి వసతి గృహానికి వచ్చాడు. గంజాయిని వేరే ప్రాంతానికి తరలించడానికి వసతి గృహాన్ని షెల్టర్‌గా ఎంపిక చేసి ఇక్కడికి తీసుకొచ్చాడు. విద్యార్థి సంఘాల నాయకుల జోక్యంతో రాత్రి పోలీసులు అక్కడికి చేరుకొని గంజాయితో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. హాస్టల్ వార్డెన్ లింగానాయక్, రంగన్నతో పాటు మరో ఇద్దరు పరారీ అయ్యారు. గురువారం డీఐఈఓ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయత్రీ కళాశాల యాజమాన్యం నిర్వహిస్తున్న హాస్టల్‌కు పర్మీషన్ లేదని తెలిపారు. గంజాయిని హాస్టల్‌లో నిల్వ ఉంచి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారన్నారు. కలెక్టర్ సురేంద్రమోహన్ ఆదేశాల మేరకు ఈ ఘటనపై పూర్తి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, డీఎస్ఓ, పీడీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్, టీజీవీపీ, టీవీవీ, పీవైఎల్, ఎన్‌టీవీఎస్ నాయకులు వసతి గృహం వద్ద ఆందోళన చేశారు. కళాశాల ఫర్నీచర్ ధ్వంసం చేశారు. అనుమతి లేకుండా హాస్టల్ నడుపుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. ఈ సందర్భంగా డీఐఈఓ రవికుమార్‌తో వాగ్వాదానికి దిగారు. వెంటనే కళాశాల గుర్తింపును రద్దు చేయాలని, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ శివశంకర్ ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను చెదరగొట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నామని త్వరలోనే పట్టుకుంటామని సీఐ అన్నారు.

విశ్వవిద్యాలయంగా కోఠి ఉమెన్స్ కళాశాల

ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

- వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం
- బోధన తీరు, విద్యావిధానంపై విద్యార్థులను అడిగిన మంత్రి
- విశ్వవిద్యాలయానికి అన్ని వసతులు ఇక్కడున్నాయి



నవతెలంగా - సుల్తాన్‌బజార్

హైదరాబాద్ కోఠి ఉమెన్స్ కళాశాలను తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా మార్చేందుకు అన్ని వసతులు ఉన్నాయని ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. గురువారం కోఠి ఉమెన్స్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. కళాశాలలో హెరిటేజ్ కట్టేందుకు చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. బోధన తీరు, విద్యావిధానంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఉమెన్స్ కళాశాల భవనాలను తిరిగి చూశారు. కళాశాలలో భోజన, వాతావరణం విద్యార్థులకు అనుగుణంగా ఉందని అన్నారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ కళాశాలలో ఇక్కడి, వివిధ దేశాల విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఒక్కటి ఉండగా.. విభజన అనంతరం తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం లేకుండాపోయిందన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ దృష్టికి తీసుకొచ్చామన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వాన్ని ఇందుకు సహాయం కోరినట్టు వివరించారు. ప్రస్తుతం కోఠి ఉమెన్స్ కళాశాల చూసిన తర్వాత విశ్వవిద్యాలయానికి అన్ని వసతులు ఇక్కడున్నాయని గుర్తించామన్నారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన అనుమతితో వచ్చే విద్యాసంవత్సరం నుంచి విశ్వవిద్యాలయంగా మార్చే ప్రయత్నం చేస్తామన్నారు. ఇక్కడ మహిళా విశ్వవిద్యాలయం ప్రారంభించేందుకు కావాల్సిన మౌలిక వసతులు, సదుపాయాలపై నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. కోఠి ఉమెన్స్ కళాశాలలో 42 యూజీ, పీజీ కోర్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఇక్కడ ఒక పరిశోధన మాత్రమే లేదని, విశ్వవిద్యాలయంగా మారితే పరిశోధన కూడా ప్రారంభమవుతుందని చెప్పారు. ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల సందర్భంగా సీఎం కేసీఆర్ రూ.200 కోట్లు కేటాయించారన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలగా ఉన్న కోఠి ఉమెన్స్ కాలేజీకి రూ.37 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. దీంతో ఆయా భవనాల మరమ్మతులు కొనసాగుతున్నాయన్నారు. అధికారులు నివేదిక ఇచ్చిన తర్వాత కావాల్సిన ఇతర వసతులు కల్పిస్తామని చెప్పారు. మంత్రి వెంట ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ రామచంద్రం, రిజిస్ట్రార్ గోపాల్‌రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ ప్రశాంత ఆత్మ, ప్రొఫెసర్లు, పోలీస్ అధికారులు ఉన్నారు.

టీజేఎస్ పేరుతో కోదండరామ్ దరఖాస్తు

- బాణం గుర్తు కేటాయించాలని ఎన్నికల కమిషన్‌కు వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజకీయపార్టీ నమోదుకు కేంద్ర ఎన్నికల కమిషన్‌లో టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్ దరఖాస్తు చేశారు. దీనికి సంబంధించి టీజేఏసీ సభ్యులు ఢిల్లీలోని ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు పెట్టుకున్నారు. పార్టీ పేరును తెలంగాణ జన సమితి (టీజేఎస్)గా చేర్చారు. పార్టీ ఎన్నికల గుర్తుగా బాణం ఇవ్వాలని కోరారు. ఇది ప్రస్తుతం ఎన్నికల పరిశీలనలో ఉంది. పార్టీ పేరుకు ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది.

మార్చి 1 నుంచి రేషన్ పోర్టబులిటీ



రేషన్‌షాపుల్లో 'ఈపాస్' సక్సెస్

- ఈపాస్‌తో రూ.578కోట్ల ఆదా: పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీఆనంద్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

జిల్లాలో ఎక్కడి నుంచైనా లబ్ధిదారులు రేషన్‌షాపుల ద్వారా సరుకులు తీసుకునే విధానాన్ని (రేషన్ పోర్టబులిటీ) మార్చి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. డీలర్ల మధ్య పోటీతత్వాన్ని పెంచి లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఈ విధానం అమలు చేస్తున్నట్టు చెప్పారు. డీలర్లు, రాజకీయ నాయకులు, లబ్ధిదారుల నుంచి ఎదురైన సవాళ్లను అధిగమించి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ఈపాస్' ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు. గురువారం సివిల్ సప్లైభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన ఏడాదిన్నర కాలంలో సివిల్‌సప్లై శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్టు తెలిపారు. అక్రమరవాణాను అరికట్టేందుకు 171కార్పొరేషన్ గోదాముల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 17,024 రేషన్‌షాపులుంటే, వాటిలో 16,812 దుకాణాల్లో ఈపాస్ అకౌంట్లు ఓపెన్ చేశామన్నారు. కేవలం 212 షాపుల్లోనే సిగ్నల్‌లేక ఆఫ్‌లైన్ విధానంలో ప్రజలకు సరుకులు అందిస్తున్నట్టు చెప్పారు. 2017లో మహబూబ్‌నగర్ జిల్లాలోని 800 రేషన్‌షాపుల్లో ప్రయోగాత్మకంగా ఈపాస్ యంత్రాలను ఏర్పాటు చేశామనీ, ఇది విజయవంతం కావడంతో దశలవారీగా అన్ని షాపుల్లో ఏర్పాటు చేశామని అన్నారు. ఈ విధానంతో బోగస్‌కార్డులు, బినామీ డీలర్లకు చెక్ పడిందన్నారు. ఈ విధానం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రభుత్వానికి 2,15,759 మెట్రిక్ టన్నుల బియ్యం మిగులు కాగా, రూ.578 కోట్ల ఆదా జరిగిందని చెప్పారు. ఈపాస్ విధానం అమలులో ప్రతి ఏడాది రూ.800కోట్ల నుంచి రూ.850కోట్ల వరకూ ప్రభుత్వానికి ఆదా కానుందని అన్నారు. 2,3 నెలల్లో ఐరీస్ వ్యవస్థను అందుబాటులోకి తీసు కొస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 1200 షాపులకు డీలర్లు లేరనీ, భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. డీలర్ల కమి షన్ అంశం ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలనలో ఉందన్నారు. రేషన్‌కార్డు గుర్తింపుకార్డు కాదనీ, రేషన్ తీసుకోని వారు కార్డులు తిరిగి ఇవ్వాలని ప్రజలను సీవీ ఆనంద్ కోరారు.

ఎన్నికల అధికారిగా రజత్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర తొలి ఎన్నికల ప్రధానాధికారిగా 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రజత్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల రజత్‌కుమార్ నియామకంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే.

సంపాదకీయం

అమెరికా ద్వంద్వ ప్రమాణాలు

అదో అగ్రరాజ్యం. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా యుద్ధ క్షేత్రంలో ఉపయోగించే స్థాయి ఆయుధాలను కూడా చాక్లెట్లు కొనుక్కున్నంత తేలిగ్గా చిన్న పిల్లలు సైతం కొనుక్కోవచ్చు. అటువంటి పరిస్థితుల్లో మతిభ్రమించిన వ్యక్తులు ఆయుధాలను ఉపయోగించి మారణకాండకు పాల్పడటం అమెరికాలో సర్వసాధారణమైంది. సరిగ్గా అటువంటి సంఘటన ఫ్లోరిడా రాష్ట్రంలోని పార్క్‌లాండ్ పాఠశాలలో జరిగింది. ఆ పాఠశాలకే చెందిన విద్యార్థి ఒకడు తనతోపాటు తెచ్చుకున్న మెషిన్‌గన్‌తో విచక్షణా రహితంగా 17మంది విద్యార్థులను కాల్చేశాడు. అనేకమంది విద్యార్థులను గాయపరిచాడు. అమెరికాకు అదొక విషాదం.

వామపక్షం, యుద్ధ వ్యతిరేక శక్తులు, ప్రగతిశీల వెబ్‌సైట్స్, రాజకీయ సంస్థలు-ఒక్కమాటలో చెప్పాలంటే యావత్ అమెరికా ప్రజల అభిప్రాయ వ్యక్తీకరణ లక్ష్యంగా ఈ ప్రచారం సాగుతున్నది. రాజకీయ విమర్శను నేరంగా భావించే పరిస్థితులను సృష్టించి దానిని నిషేధించే ప్రయత్నంలో భాగమే ఈ విష ప్రచారం. ఈ ప్రచారాన్ని తమ పోరాటాలతో తిప్పికొట్టటంలోనే అమెరికా ప్రజల భవిత నిక్షిప్తమై ఉన్నది.

పార్క్‌లాండ్ పాఠశాలలో ఈ సంఘటన జరిగిన నాలుగు రోజులకు అమెరికన్ మీడియా ముఖ్యంగా న్యూయార్క్ టైమ్స్ ఈ జాతీయ విషాదాన్ని రష్యా వ్యతిరేక ప్రచారంగా మార్చటమే కాకుండా యుద్ధోన్మాదాన్ని రెచ్చగొడుతున్నది. గత వారాంతంలో అమెరికా న్యాయశాఖ కొందరు రష్యన్ వ్యక్తులు అమెరికాకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించింది. ఈ విషయాన్ని సాకుగా తీసుకుని అమెరికా, రష్యా మధ్య ఘర్షణ వాతావరణాన్ని మరింతగా వేడెక్కించే ప్రయత్నం అమెరికా మీడియా చేస్తున్నది. ఈ ఆరోపణను మరింతగా విస్తృతపరిచి ఫ్లోరిడా పాఠశాలలో కాల్పులకు రష్యానే కారణమన్నట్టుగా మీడియా ప్రచారం చేస్తున్నది. అంతేకాకుండా అమెరికా సమాజంలో సామాజిక చీలికలు ఏర్పడటానికి రష్యా బాధ్యత వహించవలసి ఉంటుందనే వాదనను అమెరికా మీడియా ముందుకు తెచ్చింది.



అమెరికాలోని సామాజిక చీలికలకు రష్యా బాధ్యతవహించాలనే వాదనలో ఏమాత్రం హేతువు లేదు. అది పూర్తిగా మూర్ఖమైనదనే విషయాన్ని దారుణంగా జరిగిన కాల్పులే తెలియజేస్తున్నాయి. అమెరికా సమాజంలో తీవ్రమౌతున్న అనేక వైరుధ్యాలకు ప్రగతిశీలంగా వ్యక్తీకరించే వీలు లేకపోవటంతో అవి హింసాత్మకంగా బహిర్గతమవుతున్నాయి. సమాజంలో నెలకొన్న హింసాత్మక ధోరణులు, మానసిక ఆరోగ్య కేంద్రాలు లేకపోవటం, కనీసం మనోవిజ్ఞాన శాస్త్రం కూడ అందుబాటులో లేకపోవటం వంటి సామాజిక కారణాలు ఈ కాల్పుల ఘటన వెనుక ఉన్నాయని ఎవరైనా విశ్లేషించే ప్రయత్నం చేస్తే వారిని అమెరికా సమాజంలో చీలికలు తీసుకురావటానికి ప్రయత్నించే 'రష్యా ఏజెంట్లు' అని ముద్ర వేస్తున్నారు.


నిజానికి ఇతర దేశాల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకున్న చరిత్ర అమెరికాకు ఉన్నంతగా ప్రపంచంలో మరే దేశానికీ లేదు. లాటిన్ అమెరికా దేశాలలోను, మధ్య ప్రాచ్యంలోను ప్రభుత్వాలను హింసాత్మకంగా కూలదోసిన చరిత్ర అమెరికాది. అటువంటి హింస ఇంకా సిరియా, అఫ్ఘనిస్థాన్, లిబియా దేశాలలో కొనసాగుతున్నది. విదేశాలలో పనిచేస్తున్న అమెరికా జర్నలిస్టులలో చాలామంది వృత్తితోపాటు అమెరికా గూఢచారులుగా కూడా పనిచేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ మధ్యకాలంలో ముఖ్యంగా ఇరాక్ యుద్ధ కాలం నుంచి అమెరికా ప్రచార సాధనాలు అమెరికా గూఢచార సంస్థలతో మమేకమై పనిచేస్తున్నాయి. అంతేకాకుండా తమ శత్రుదేశాలపై అసత్య ప్రచారం చేయటానికి అమెరికా విదేశాంగ శాఖ సాధనంగా అమెరికా మీడియా పనిచేస్తున్నది.

ఇందుకు ఉదాహరణగా న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్ థామస్ ఫ్రీడ్‌మన్‌ని తీసుకోవచ్చు. అమెరికా గూఢచార ఏజన్సీలకు ప్రతినిధి అన్నట్టుగా ఈయన మాట్లాడుతుంటాడు. ఈయన జీవిత చరిత్రకు పెట్టిన పేరు 'ఇంపీరియల్ మెస్సెంజెర్.' ఈ పేరు ఈయన పోషిస్తున్న పాత్రకు సరిగ్గా సరిపోతుంది. అమెరికాలోని ప్రజాస్వామ్య మనుగడకు రష్యాతో ప్రమాదం ఏర్పడిందని ఫ్రీడ్‌మన్ ఫిబ్రవరి 18న న్యూయార్క్ టైమ్స్‌లో రాశాడు. '2016లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకున్న 13మంది రష్యన్లను గూఢచార సంస్థలలో పనిచేసిన అనుభవం గల రాబర్ట్ మ్యుల్లర్ గుర్తించాడు. వీరందరికీ రష్యా పాలనా యంత్రాంగంతో సంబంధం ఉన్నది. ఎన్నికలపై ఆధారపడిన మన ప్రజాస్వామిక వ్యవస్థపై జరిగిన ఈ దాడికి జవాబుగా మన జాతీయ రక్షక దళాలను సమీకరించాలి. మనకిప్పుడు కావలసింది వాటికి నాయకత్వం వహించే అధ్యక్షుడు.' అంటే ఫ్రీడ్‌మన్ అభిప్రాయంలో అమెరికా రక్షణకు గూఢచార, సైనిక నిష్ణాతులతో కూడిన బృందం పుతిన్‌పై దాడి చేయటానికి వ్యూహరచన చేయాలి. అంటే రష్యాపై యుద్ధం ప్రకటించాలి.

సమాజంలోని అంతర్గత వైరుధ్యాలనుంచి ప్రజల దృష్టి మరల్చటమే లక్ష్యంగా ఇటువంటి ఆర్భాటంతో కూడిన అసత్య ప్రచారం కొనసాగుతున్నది. సామాజిక అసమానతలు, పరాయీకరణ, పోలీసు హింస, ఎడతెగని యుద్ధాలువంటి విషయాలకు వ్యతిరేకంగా కోపంతోవున్న కోట్లాది ప్రజల దృష్టిని మరల్చే లక్ష్యంతో ఇటువంటి ప్రచారం సాగుతుంది. పార్క్‌లాండ్ కాల్పుల ఉదంతంలో రష్యా ప్రమేయం ఉన్నదనే ప్రచారం ఈ కోవకే చెందుతుంది.

వామపక్షం, యుద్ధ వ్యతిరేక శక్తులు, ప్రగతిశీల వెబ్‌సైట్స్, రాజకీయ సంస్థలు-ఒక్కమాటలో చెప్పాలంటే యావత్ అమెరికా ప్రజల అభిప్రాయ వ్యక్తీకరణ లక్ష్యంగా ఈ ప్రచారం సాగుతున్నది. రాజకీయ విమర్శను నేరంగా భావించే పరిస్థితులను సృష్టించి దానిని నిషేధించే ప్రయత్నంలో భాగమే ఈ విష ప్రచారం. ఈ ప్రచారాన్ని తమ పోరాటాలతో తిప్పికొట్టటంలోనే అమెరికా ప్రజల భవిత నిక్షిప్తమై ఉన్నది.

బ్రూనో సజీవ దహనం... అతిపెద్ద మానవ తప్పిదం



డాక్టర్ దేవరాజు మహారాజు

ఫిబ్రవరి 17, 1600 సంవత్సరం. ఇటలీలోని రోమ్ నగరం, కాంపోడి ఫియోరి కూడలి అక్కడికి ఖగోళ సిద్ధాంత కర్త, గణిత శాస్త్రజ్ఞుడు అయిన గియార్డనో బ్రూనోను రెక్కలు విరిచికట్టి నాలుక తీగతో చుట్టి తీసుకొచ్చారు. నాలుకకు చుట్టిన తీగ విప్పేసి, చివరిసారి అడిగారు. "తప్పులన్నీ ఒప్పుకో! ప్రాణభిక్ష పెడతాం!" అన్నారు రోమన్ మత న్యాయస్థానం పెద్దలు. బ్రూనో తల అడ్డంగా తిప్పాడు. తను ఏ తప్పు చేయలేదని నిర్భయంగా చెప్పాడు. ఏ మాత్రం తొణకలేదు. శిక్ష అనుభవించడానికి సిద్ధం అన్నట్టుగా నిలబడ్డాడు. "నేను చెప్పిన నిజాలు తరతరాలుగా మీ లాంటి మూర్ఖుల్ని తొలుస్తూనే ఉంటాయి' అన్న మనో నిబ్బరం ఆయనది.

సత్యం ఏదో తెలిసి కూడా దాన్ని ప్రకటించడానికి జడుసుకునే పిరికి వాళ్ళు మన సమాజం నిండా ఉన్నారు. శాస్త్ర వైజ్ఞానిక రంగంలో కూడా ఉన్నారు. అలాంటి వారు రోజూ బ్రూనో వ్యక్తిత్వాన్ని గుర్తు చేసుకుని, తమలో కొద్ది కొద్దిగా మార్పు తెచ్చుకోగలిగితే సమాజాన్ని బాగుచేసిన వారవుతారు. చుట్టూ ఉన్నవారికి ఆదర్శప్రాయులు కావడం తర్వాత, ముందు వారు తమను తాము మోసం చేసుకోకుండా బతికితే చాలు.

మత న్యాయస్థానం అధికారులు, రాజ్యాధినేతలు అందరూ ఆత్రంగా ఎదురు చూశారు. ఆ చివరి క్షణంలో నైనా దాసోహమంటాడేమోనని ఆశపడ్డారు. కానీ వారి ఆశ నిరాశే అయ్యింది. సత్యస్థాపన కోసం తను ఎలాంటి శిక్షకైనా సిద్ధమేనన్నట్టు, వారివైపు బ్రూనో జాలిగా చూశాడు. 'ఏమిటీ విచిత్రం? గాలీ, వెలుతురూ లేని చీకటి గదిలో ఏడేండ్లు బంధించినా, రోజూ చిత్రహింసలు పెట్టినా, క్రమం తప్పకుండా మానసికంగా వేధించినా బ్రూనోలో ఏమాత్రం మార్పు రాలేదేమి అని మతాధికారులు ఆశ్చర్యపోయారు. వారి పైశాచికత్వానికి వారే భయపడ్డారు. అయితే ఆ పైశాచిక ప్రవృత్తిని బ్రూనోకు అంటగట్టారు. ఇతను మనిషి కాదు, సైతానుగా మారిపోయాడు. సైతాను రక్తం భూమిమీద పడితే అరిష్టం సంభవిస్తుంది.. అని తీర్మానించుకున్నారు. మూఢత్వంలోంచి క్రూరత్వంలోకి జారిపోయారు.

అప్పటివరకు మత విశ్వాసకులు భూమి కేంద్రకమని, దాని చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని విశ్వసించేవారు. అది తప్పని సూర్యుని చుట్టే భూమి తిరుగుతోందని బ్రూనో చెప్పాడు. ఈ విషయం అంతకుమందు నికొలస్ కోపర్నికస్ (1473-1543) చెప్పిందే. దాన్ని బ్రూనో బలపరిచాడు. అంతేకాదు, ఈ భూమి లాంటి "భూములు" (గ్రహాలు) ఇంకా ఉన్నాయన్నాడు. ఈ విశ్వానికి ఆదీ, అంతం ఉన్నాయని మత విశ్వసకులు బోధిస్తూ ఉంటే, అలాంటి వేమీ లేవన్నాడు బ్రూనో. మొత్తానికి సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం క్రైస్తవ సన్యాసి అయి ఉండి.. క్రీస్తుకు, బైబిల్‌కు వ్యతిరేకంగా ప్రశ్నలు గుప్పించడం, విమర్శించడం నాటి రోమన్ మత న్యాయస్థానం వారికి ఆగ్రహం తెప్పించింది. మానవీయ విలువల్ని మంటగలుపుతూ ఆనాటి మత పెద్దలు బ్రూనోకు శిక్ష విధించారు. మనిషి, మనిషిని - మనిషిగా గుర్తించక పోవడం అతి దారుణంగా చరిత్రలో నమోదయ్యింది.

శాస్త్రవేత్త, తత్త్వవేత్త, కవి అయిన గియార్డనో బ్రూనో కాంపోడి ఫియోరి కూడలిలో నిలబెట్టారు. అది పేద క్రైస్తవ సన్యాసులు నివసించే ప్రాంతం. మతానికి వ్యతిరేకంగా ఎవరేమి మాట్లాడినా వారికి ఇలాంటి గతే పడుతుందని బ్రూనోకు బహిరంగంగా శిక్ష విధించారు. మొదట ఆయన బట్టలూడదీశారు. తర్వాత నగ్నంగా తలక్రిందులుగా వేలాడదీశారు. సజీవంగా నిప్పంటించారు. అక్కడ ఉన్న జనం కన్నీటి పర్యంతమయ్యారు. శాసకుల దురాగతం చూసి భయకంపితులయ్యారు. పొరపాటున వేలి చివర కాలితేనే భరించుకోలేము కదా? మరి సజీవంగా కాలిపోవడానికైనా వెనుకాడని బ్రూనో గుండె ధైర్యాన్ని ఎలా అంచనా వేయగలం? కేవలం అభిప్రాయ బేధాలుండడం వల్ల ఒక మనిషిని నిలువునా కాల్చేసిన దురాగతం ఆనాడు అక్కడ జరిగింది. ఒక అబద్ధం నిజాన్ని కాల్చేసింది. మతం, విజ్ఞాన శాస్త్రానికి మంటబెట్టింది. మూఢత్వం జిజ్ఞాసను చంపేసింది. గెలిచామనుకున్న మత పెద్దలు ఆరోజు అక్కడ తాత్కాలికంగా సంతోషించి ఉండొచ్చు. కాని మానవ చరిత్రలో వారు దోషులుగా, మూర్ఖులుగా, దుర్మార్గులుగా శాశ్వతంగా మిగిలిపోయారు.

ఇంతకూ మత న్యాయస్థానం గియార్డనో బ్రూనోపై మోపిన అభియోగాలేమిటీ? ఏఏ కారణాల వల్ల ఆయనకు శిక్ష విధించారు?

1. కేథలిక్కుల నమ్మకాలకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు, పుస్తకాలు రాసినందుకు. 2. జీసస్ క్రీస్తును దేవుడిగా కీర్తించడాన్ని నిరసించినందుకు, 3. ఆనాటి మత బోధకుల విశ్వాసాల్ని.. ట్రినిటీ (ఈశ్వర త్రిగుణత్వవాదం)ని బలంగా దెబ్బతీసినందుకు. 4. జీసస్ తల్లి మేరీ కన్యాత్వాన్ని ప్రశ్నించినందుకు, అంటే.. కన్య అయిన మేరీ క్రీస్తుకు జన్మనెలా ఇచ్చిందీ.. అని అడిగినందుకు.. 5. పునర్జననం ఉండదని అన్నందుకు. 6. మానవుడి ఆత్మ వేరే శరీరంలో ప్రవేశించలేదని అన్నందుకు. 7. మత బోధకులు మాయలు, మంత్రాలతో జనాన్ని మభ్యపెడుతూ తప్పుదోవ పట్టిస్తున్నారని తీవ్రంగా నిరసించినందుకు.

ఇప్పటికీ బ్రూనో ప్రశ్నలు ప్రశ్నలుగానే ఉండిపోయా యన్నది మనం గుర్తించుకోవాలి. క్రీ.శ. 1593-1600 మధ్య కాలంలో ఏడేండ్లు చెరసాలలో బంధించి, బ్రూనోను శిక్షించడానికి అన్ని రకాల కారణాల్ని వెతికింది నాటి మత న్యాయస్థానం. అతను పుస్తకాలలో రాసిన విషయాల ఆధారంగా, ఆయన మాట్లాడుతున్నప్పుడు విన్నవారు ఇచ్చిన సాక్ష్యాల ఆధారంగా కేసును బలోపేతం చేశారు. అబద్ధపు కేసుల్ని గెలిపించాలంటే చట్టాలు, న్యాయస్థానాలు ఎక్కువ శ్రమించాల్సి ఉంటుంది. బ్రూనోకు వ్యతిరేకంగా సమకూర్చుకున్న పత్రాలు ఓసారి నోనా టవర్‌లో గల్లంతయ్యాయి. నాటి ప్రభువుల అడుగులకు మడుగులొత్తే వారు కొందరు మరికొన్ని సాక్ష్యాలు తెచ్చి సమర్పించారు. అంటే మూఢుల పట్టుదలను తక్కువగా అంచనా వేయగూడదని మనమిక్కడ అర్థం చేసుకోవాల్సి ఉంది. తన తప్పిదాలను ఒప్పుకుని, క్షమాభిక్ష అర్థించవల్సిందిగా నాటి రోమన్ మత న్యాయస్థానం బ్రూనో మీద ఎంతగానో ఒత్తిడి తెచ్చింది. అయినా స్థిర చిత్తుడైన బ్రూనో లొంగలేదు. వారి అన్ని ప్రయత్నాలు విఫలమైనాయని గ్రహించి ఎనమిదవ పోప్ క్లిమెంట్ మరణశిక్ష విధించాడు. ఆ రోజు జనవరి 20, 1600 సంవత్సరం. ఈ ఉత్తర్వు ఫిబ్రవరి 17 నాడు అమలులోకొచ్చింది.



పత్రికలు, మీడియా లేని రోజుల్లో విషయాలు ఉన్నదున్నట్టుగా ఎలా బయటకొచ్చాయి? అనే సందేహం ఎవరికైనా వస్తుంది. బ్రూనో ఆలోచనా విధానంతో ఏకీభవించే వారు సామన్య జనంలో ఉంటారు కదా? వారు చూసింది చూసినట్టుగా ప్రపంచానికి తెలియజేశారు. ముఖ్యంగా బ్రెస్ లౌ ప్రాంతానికి చెందిన గాస్పర్ స్కూప్ అనే అతను అక్కడ జరిగిన సంఘటనల్ని నమోదు చేశాడు. అందులో మానవాళి సగర్వంగా తలెత్తి చెప్పుకోగల విషయం ఒకటుంది. నాటి మత న్యాయాధీశులకు వణుకు పుట్టించే మాట గియార్డనో బ్రూనో అన్నాడని.. గాస్పర్ స్కూప్ రాశాడు.

"మీరుపలికే ఆ వాక్యం (మరణశాసనం) నా కన్నా అది మిమ్ముల్నే ఎక్కువ భయకంపితుల్ని చేస్తుంది" అని నిర్భయంగా, ధైర్యంగా ప్రకటించి తన ఆత్మ విశ్వాసాన్ని ప్రకటించుకున్నాడు బ్రూనో. గియార్డనో (1548-17 ఫిబ్రవరి 1600) ఫిలిప్పో బ్రూనోగా ఇటలీ, నాఫ్లస్ రాజ్యం, నోలాలో పుట్టాడు. కవిగా, తత్త్వవేత్తగా, గణిత శాస్త్రజ్ఞుడిగా పేరు సంపాదించుకున్నా, ఖగోళ సిద్ధాంత కర్తగా ప్రపంచ ప్రఖ్యాతుడయ్యాడు. ఆధునిక వైజ్ఞానిక పరికరాలు లేని రోజుల్లో, టెలిస్కోపులు, అబ్జర్వేటరీలు లేని రోజుల్లో కొన్ని వైజ్ఞానిక విషయాలు కచ్చితంగా చెప్పగలిగాడంటే.. ఆయన ఎంతటి మేధావో మనం అంచనా వేసుకోవాలి. చుక్కలు చాలా దూరంలో ఉన్న సూర్యుళ్ళు అని మొదట చెప్పిన వాడాయన. తరువాత కాలంలో ఆయన చెప్పిన అంశాల్ని ఆధునిక పరిశోధనలు ధృవీకరించాయి. స్వయం ప్రకాశితాలై ఉండి, వేడినిచ్చే కొన్ని 'సూర్యుళ్ళు' నిశ్చలంగా ఉన్నాయని, వాటి చుట్టు తిరిగేవాటినే "భూములం'టున్నామని, అవి వెలుగునూ, వేడిని సూర్యుల నుండి స్వీకరిస్తున్నాయని బ్రూనో ప్రకటించాడు. అసలు మొదటిసారి నక్షత్రాలను సూర్యుళ్ళుగా గుర్తించింది బ్రూనోయేనని ఆస్ట్రో ఫిసిస్ట్ - స్టీవెన్ సోటర్ ధృవీకరించారు.

అమోఘమైన ధారణాశక్తి, గొప్ప రచనా కౌశలం గియనార్డో బ్రూనో సొత్తు. ధృఢ చిత్తుడిగా ఉండడం, సత్యశోధన కోసం, సత్య స్థాపన కోసం ఎలాంటి కఠిన పరిస్థితులనైనా ఎదుర్కోగలగడం.. ఏ తరం వారికైనా ఆయన ఆదర్శం. ఖాళీ మెదళ్ళతో కేవలం ప్రచార ఆర్భాటాలతో, అబద్ధాలతో, నిజాయితీ అనే పదం ఒకటుందని కూడా తెలుసుకోకుండా బతుకుతున్న వాళ్ళను చూస్తే జాలేస్తుంది. సత్యం ఏదో తెలిసి కూడా దాన్ని ప్రకటించడానికి జడుసుకునే పిరికి వాళ్ళు మన సమాజం నిండా ఉన్నారు. శాస్త్ర వైజ్ఞానిక రంగంలో కూడా ఉన్నారు. అలాంటి వారు రోజూ బ్రూనో వ్యక్తిత్వాన్ని గుర్తు చేసుకుని, తమలో కొద్ది కొద్దిగా మార్పు తెచ్చుకోగలిగితే సమాజాన్ని బాగుచేసిన వారవుతారు. చుట్టూ ఉన్నవారికి ఆదర్శప్రాయులు కావడం తర్వాత, ముందు వారు తమను తాము మోసం చేసుకోకుండా బతికితే చాలు.

వైజ్ఞానికంగా ప్రపంచం ఏమీ సాధించని రోజుల్లోనే బ్రూనోలాంటి వాళ్ళు గట్టిగా నిలబడి మూఢ నమ్మకాల్ని నిరసించారు. ప్రాణత్యాగానికి సిద్ధమయ్యారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు మతపెద్దలు పెద్ద ఎత్తున ప్రచారాలు చేస్తూ అబద్ధాలని నిజాలుగా భ్రమింప జేస్తున్నారు. జనాన్ని మూఢత్వంలో ముంచి ఉంచుతున్నారు. బ్రూనో వారసుల అవసరం ఈనాడు కూడా ఉంది. ఇప్పటికీ భూమినే కేంద్రకంగా తీసుకుని, లెక్కలు కడుతున్న అజ్ఞాన పండితుల్ని జనం తిరస్కరించాల్సిన సమయం ఆసన్నమైంది. మనమిప్పుడు ఆస్ట్రాలజీ కాదు, ఆస్ట్రానమి తెలుసుకోవాలి!

ఫిబ్రవరి 17వ తేదీ ప్రపంచ ఆలోచనా సరళిని మార్చిన బ్రూనోను గుర్తుచేయడంతో పాటు, అలాంటి మరో మహానుభావుడు ఛార్లెస్ డార్విన్‌ను కూడా గుర్తు చేస్తుంది. ఇదే రోజు 1836లో డార్విన్ హెచ్చెమ్మెస్ బీగిల్ అనే ఓడ మీద టాస్మోనియా నుండి బయలుదేరాడు. బ్రూనో జ్ఞాపకార్థం పదిహేడు ఫిబ్రవరిని 'సత్యాన్వేషణ దినం'గా పరిగణిస్తున్నాం!

**వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త,
బయాలజీ ప్రొఫెసర్, సెల్: 9573706806**

సందట్లో సడేమియా

దేశమంతా పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన రూ.పదకొండు వేల కోట్ల కుంభకోణం గురించి కలవర పడుతుంటే దాన్ని అదనుగా తీసుకుని మోసకారి పెట్టుబడిదారీ వ్యవస్థ కుషీవలురు తనకు అనుకూలంగా మల్చుకోవటానికి రంగ ప్రవేశం చేశారు. రెండ్రోజుల క్రితమే ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుడు, ఉదారవాదం బలమైన సమర్థకుడు అరవింద్ సుబ్రమణియం, ఏ బెరుకూ లేకుండా ప్రభుత్వరంగ బ్యాంకుల్ని ఇక ప్రభుత్వ అధీనం ఉంచటం అర్థం లేనిదని ఉచితంగా ఉపదేశించారు. తక్షణం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటాను 50కి తక్కువగా చేయటం అవసరమని, దానివల్ల నిర్వాహకులు ప్రభుత్వానికి బదులు ప్రయివేటు యజమానులకు జవాబుదారీగా ఉంటారని చెప్పారు. అంటే ముఖ్య ఆర్థిక సలహాదారుడికి బ్యాంకుల నిర్వాహకులు ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండటమంటే అభ్యంతరం. నిజానికి ప్రభుత్వానికి జవాబుదారీ తనమంటే ప్రజలకు జవాబుదారీగా ఉండటమే. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న ఏ సంస్థ అయినా సరే దాని పనికి సంబంధించి ప్రజలు ప్రశ్నించే హక్కు ఉంటుంది. చట్టసభల్లో ఆ ప్రశ్నలపై చర్చ, వాదన జరగవచ్చు. ప్రభుత్వం దానికి జవాబు చెప్పాల్సి ఉంటుంది. సుబ్రమణియం లాంటి ఆర్థిక ఉదారవాదు లకు బ్యాంకు పెట్టుబడి విషయంలో ప్రభుత్వానికి కాని, ప్రజలకు కాని ప్రమేయం ఉండటం ఇష్టం ఉండదు. బ్యాంకులు ప్రయివేటు చేతుల్లోకి పోతే ప్రభుత్వం, ప్రజలు ఇక ప్రశ్నించటానికి ఉండదు. ప్రజలు దాచుకున్న సొమ్ము ఎవరు ఎలా పంచుకుంటారో యజమానులే నిర్ధారిస్తారు.

సుబ్రమణియం నోట ఈ ఉపదేశం జాలువారాక దేశ వ్యాపారుల సంఘం అసోచామ్ పద్ధతి ప్రకారం ప్రకటన చేసి పబ్లిక్ రంగ బ్యాంకుల ప్రయివేటీకరణ కోసం గట్టి సవాలు విసిరింది. పీఎన్‌బీ మోసం పూర్వరంగంలో ప్రభుత్వ రంగంలో బ్యాంకులు పని చేయటంలో పూర్తిగా విఫలమయ్యాయని వారు అనుకుంటున్నారు. ఆ వైఫల్యం కారణమైన బ్యాంకు పారు బకాయిలు(ఎన్‌పీఏ) నేడు ప్రమాదపు టంచుకి చేరాయి. మరోవైపు మోసాలు పెరుగుతున్నాయి. నిజానికి పరిశ్రమ, వ్యాపార శ్రేణులూ, సుబ్రమణియం లాంటి వారి సహాధ్యాయ ఉదారవాద ఆర్థికశాస్త్రవేత్తలూ సందట్లో సడేమియాల్లా ప్రస్తుతం ఈ గందరగోళ పరిస్థితిని ఉపయోగించుకుని లాభపడాలని చూస్తున్నారు. సమస్య మూలాల్లోకి పోకుండా వారు తన అభీష్టాన్ని సాధించుకోవాలను కుంటున్నారు. గుర్తుంచుకోవల్సిందేమంటే ఈ కరుడు కట్టిన సంస్కరణవాద ఆర్థిక సలహాదారుడు ఈ మధ్యే ప్రచురించబడిన కేంద్ర ఆర్థిక సమీక్షలో పెట్టుబడి సంక్షోభంలో ఉన్న ప్రభుత్వ రంగం బ్యాంకులకు ప్రభుత్వం మూలధనం చేకూర్చటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అతను ప్రభుత్వ రంగం బ్యాంకులకు ఎటువంటి మూలధనం ఇవ్వకుండా వాటి వ్యాపారాన్ని కుదింపజేసి బలహీనపర్చాలని అనుకుంటున్నారు. అప్పుడు 'బలహీన', 'విఫల' బ్యాంకులను నడవలేనివని ముద్ర వేసి రద్దీని తూకం వేసినట్టు కారుచౌకగా ప్రయివేటు వారి చేతుల్లోకి నెట్టేస్తే ప్రైవేటు వారికి ఇక పండగే. దేశ బ్యాంకింగ్ వ్యవస్థంతా ప్రైవేటువారి దఖల్లోకి వెళ్తుంది. ముఖ్య ఆర్థిక సలహాదారుడి సలహాతో ప్రవేటు వ్యాపార శ్రేణులు మహదానందంతో ఉన్నాయి. ఒక వ్యాపారుల సంఘమైతే వెంటనే అవకాశాన్ని పురస్కరించుకుని నేరుగానే బ్యాంకుల ప్రయివేటీకరణ, వాటిని ప్రయివేటు చేతులకు అప్పజెప్పాలని సవాలు చేసే స్థాయికి పోయింది.

ప్రస్తుతం దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థలో 70శాతం ప్రభుత్వ రంగంలోనే ఉంది. అన్నిటికంటే పెద్ద బ్యాంకు ఎస్‌బీఐ కూడా ప్రభుత్వ రంగం లోనే ఉంది. ప్రయివేటువారితో పోలిస్తే చాలా ఎక్కువ ఉపాధి కల్పిస్తున్నాయి. అలాగే ఉద్యోగ భద్రత, పదవీ విరమణ తరవాత సౌకర్యాలు, ఇతర సామాజిక భద్రత ప్రయివేటుతో పోలిస్తే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో చాలా ఎక్కువ. ప్రయివేటు బ్యాంకుల్లో ఉన్నత పదవుల్లో జీతాలు చాలా ఎక్కువ. కానీ సాధారణ ఉద్యోగుల జీతాలు చాలా తక్కువ. వ్యవసాయ రుణాలు, సన్న-చిన్న-మధ్య తరహా పరిశ్రమ-వ్యవసాయ రుణాలు ఇచ్చే ప్రభుత్వ విధానం అమలు జరిపేది ప్రధానంగా ప్రభుత్వ బ్యాంకులే. ఈ మధ్య కాలంలో వచ్చిన జన్‌ధన్ పథకంలో 95శాతం ప్రభుత్వ బ్యాంకులే. అనగా ప్రభుత్వం చేపట్టే సామాజిక, అభివృద్ధి పథకాల బాధ్యత ప్రభుత్వ బ్యాంకులే భరిస్తున్నాయి. ఈ విషయంలో ప్రయివేటు బ్యాంకుల అడ్రస్సులుండవ్. వారి ఏకైక లక్ష్యం లాభాలే. కానీ ప్రభుత్వ బ్యాంకులు లాభం లేకపోయినా ప్రజా ప్రయోజనం కోసం ప్రభుత్వ పథకాలను అమలు చేస్తాయి. అదీకాక ప్రయివేటు బ్యాంకులు చాలా నైపుణ్యం ఉన్నవని చెప్పటానికి లేదు. మోసాలు కాని, పారు బకాయిలు కాని ప్రయివేటు బ్యాంకుల్లో ఉన్నాయనేది గుర్తుంచుకోవాలి. అవి ప్రచారంలోకి తక్కువ రావటంతో మరుగున ఉంటాయి. నిజంగానే ప్రయివేటు బ్యాంకులు అంత నైపుణ్యం, దక్షత కలిగి ఉండినవైతే మునిగి పోయిన 36 ప్రయివేటు బ్యాంకులను ఎందుకు మూసేయాల్సి వచ్చింది. ఎందుకు వాటిలో ఎక్కువ బ్యాంకులను ప్రభుత్వ రంగ బ్యాంకులతో కలపాల్సి వచ్చింది. ప్రయివేటువారు ప్రభుత్వ బ్యాంకులను కూలకొట్టటానికి తానే నానా ఉపాయాలు చేస్తూ అదే సాకుగా చూపి మరలా మొత్తం ప్రభుత్వ బ్యాంకింగ్ రంగాన్నే కబళించాలని చూస్తున్నారు.

- వీఆర్‌కే.

వాస్తవాలను విస్మరించడం అవివేకమే...

వప్పల బాలచంద్రన్
సుదీంద్ర కులకర్ణి

(నిన్నటి సంచిక తరువాయి)

అందరికీ తెలిసినట్టుగానే... పాకిస్థాన్‌తో భారత్‌కు 1947-48లో జరిగిన మొట్టమొదటి యుద్ధం డ్రాగా ముగిసింది. ఐక్యరాజ్యసమితి యుద్ధాన్ని బలవంతంగా ఆపించి... జమ్మూ కాశ్మీర్ విభజనను అమలుపరిచింది. ఈ యుద్ధంలో పాకిస్థాన్‌కు బ్రిటన్ రహస్యంగా సహకరించే సాహసం చేసింది. భారత్, పాకిస్థాన్ స్వాతంత్ర్యం పొందిన తరువాత కూడా వారి ప్రత్యర్థి సైన్యాలకు బ్రిటిష్ జాతీయులే నాయకత్వం వహించాయి. ఇక్కడ చర్చనీయ ప్రశ్న ఏంటంటే: జమ్మూకాశ్మీర్ మొత్తం భారతదేశ ఆధీనంలోకి వచ్చేంత వరకూ భారత సైన్యం పోరాటం చేస్తూనే ఉండాలని పటేల్ నిశ్చయించుకున్నారా? దీనికి సమాధానం మోడీని, అతని భక్తులను నిరాశపరుస్తున్నది.

దీని గురించి 2002 పుస్తకం "వార్ అండ్ డిప్లమసీ ఇన్ కాశ్మీర్: 1947-48" పేజీ 79-80లో చంద్రశేఖర్ దాస్ గుప్త ఇలా రాసారు-

1. హైదరాబాద్‌లో కూడా ప్రజాభిప్రాయ సేకరణకు పాకిస్థాన్ అంగీకరించే వరకూ కాశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ ప్రతిపాదనను తాను అంగీకరించబోనని... ఒక దశలో సర్దార్ పటేల్ ప్రకటించారు. అంటే... కాశ్మీర్‌లో అభిప్రాయసేకరణ ప్రతిపాదనకు పటేల్ వ్యతిరేకి కాదు.

2. ఒక దశలో... ప్రజాభిప్రాయసేకరణను నిర్వహించడానికి పూంచ్ ప్రాంతం నుంచి భారత దళాలను పూర్తిగా ఉపసహరించుకుంటానని సర్దార్ పటేల్ సూచించారు. అంటే... ప్రజాస్వామ్య పరిష్కారం కోసం భారత దళాలను మధ్యలోనే వెనక్కి పిలవడానికి సిద్ధపడ్డారు. కానీ, అటువంటి పరిష్కారం రాలేదని అందరికి తెలుసు. పటేల్ సైనిక పరిష్కారం కోసం ఒత్తిడి చెయ్యలేదని కొందరికే తెలుసు.

"ఒకవేళ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ మొదటి ప్రధానమంత్రి అయ్యి ఉంటే... కాశ్మీర్‌లోని ఈ భాగం పాకిస్థాన్‌లో ఉండేది కాదు." అని 2018 ఫిబ్రవరి 7న ప్రధాన మంత్రి మోడీ పార్లమెంటులో వ్యాఖ్యానించారు. పటేల్ కాశ్మీర్ పాలసీకి నెహ్రూ అడ్డుపడ్డారని మోడీ ఆ ప్రకటన తెలుపుతున్నది. పటేల్ సన్నిహిత సహచరుడు విపి మెనన్ "ద స్టోరీ ఆఫ్ ఇంటిగ్రేషన్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్" (1956) చదివితే మోడీ ప్రకటనకు విరుద్ధ భావం కలుగుతుంది.

1917 నుండి రాజ్యాంగ సంస్కరణలను మెనన్ నిర్వహించారు. 1942 నుండి వైస్రాయ్‌కు రాజ్యాంగ సలహాదారునిగా ఆయన పని చేశారు. ఇండియన్ ఇండిపెండెన్స్ యాక్ట్‌ను రూపొందించిన ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ చైర్మెన్ ఆయన. బ్రిటిష్ పార్లమెంటు 1947 జూలై 18న ఈ యాక్ట్‌ను ఆమోదించింది. అధికార బదిలీలో ఆయన పాత్రను గురించి తెలియాలంటే "ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ ఇన్ ఇండియా" (1957) చదివితే మనకు అర్థం అవుతుంది. సర్దార్ పటేల్ కోరిక మేరకే ఆయన ఈ రెండు పుస్తకాలను రాశారు. 1946 ఆగస్టు 21 నుంచి సర్దార్ పటేల్‌తో మెనన్ సన్నిహితంగా ఉన్నారు.

పదవీ విరమణ చేయవద్దని.. లార్డ్ మౌంట్‌బాటెన్ కోరుకున్నట్టుగా గవర్నర్‌గా మారవద్దని.. మెనన్‌ను పటేల్ ఒప్పించారు. అంతే కాకుండా... అతి పెద్ద మంత్రిత్వశాఖ "స్టేట్స్ డిపార్ట్‌మెంట్" బాధ్యతలు చేపట్టి రాచరిక రాష్ట్రాల విలీనానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయనను కోరారు. ఈ భారీ బాధ్యతలను తనకు పటేల్ స్వయంగా అప్పగించారని మెనన్ కోట్ చేశారు.

1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం ఇవ్వాలని 1947 జూన్ 3న ప్రణాళిక వచ్చింది. 562 రాచరిక రాష్ట్రాలను విలీనం ఎలా చేయాలనేదే అప్పటి అతిపెద్ద ఆందోళన. సమయం తక్కువగా ఉండడం వల్ల రక్షణ, బాహ్య వ్యవహారాలు, సమాచార ప్రసారంపై మాత్రమే ఒప్పందం కుదుర్చుకోవాలని పటేల్‌కు మెనన్ సలహా ఇచ్చారు. అక్టోబర్ 26, 1947న కాశ్మీర్ కేసులో కూడా ఇదే జరిగింది.

స్వాతంత్ర్య చట్టం 1947 ప్రకారం రాచరిక రాష్ట్రాలు భారత్‌తో కానీ పాకిస్థాన్‌తో కానీ కలవొచ్చు. కానీ "స్వాతంత్ర్యం" అనేది ఆప్షన్ కాదు. హరిసింగ్ స్వతంత్రంగా ఉండాలనే ఆలోచనతో ఆడుకున్నాడు. 1921-22 కాలం నుంచే హరిసింగ్‌తో పరిచయం ఉన్న లార్డ్ మౌంట్‌బాటెన్ ఆయనను 1947 జూన్‌లో కలిశారు. తన నాలుగు రోజుల కాశ్మీర్ పర్యటనలో తన రాజ్యాన్ని భారత్ లేదా పాకిస్థాన్‌లో విలీనం చెయ్యమని నచ్చచెప్పారు. "ఆగస్టు 15కు ముందు ఏదో ఒక దేశంతో విలీనం చెయ్యాలని నిర్ణయించుకున్నారు కాబట్టి ఎటువంటి సమస్యలు రావు అని... ఏ దేశంతో విలీనం చేసినా తమ సంస్థానంలో భాగంగానే రక్షణ కల్పిస్తారని ఆయన మహారాజుకు హామీ ఇచ్చారు" అని మెనన్ చెప్పారు. పాకిస్థాన్‌లో విలీనం చేస్తే... భారత్ దాన్ని తప్పుగా అనుకోదని... ఇక దీనిపై స్వయంగా సర్దార్ పటేల్ నుండి హామీ ఉందని మహారాజ్‌కు చెప్పడానికి మౌంట్‌బాటెన్ అంత దూరం వెళ్లారు. ముస్లిం మెజారిటీ రాష్ట్రంతో కలయిక గురించి "ప్రజల కోరికలు" కూడా కనుక్కోవాలని మౌంట్‌బాటెన్ కోరారని మెనన్ అన్నారు. "ప్రజాభిప్రాయ సేకరణ" ఆలోచనకు మూలం ఇదే. ఏదేమైనప్పటికీ హరిసింగ్ త్వరలోనే నిర్ణయం తీసుకోవాలి. కానీ అది జరగలేదు.



1947 అక్టోబరు 22న పాక్ ఆక్రమదారులు కాశ్మీర్‌ను ఆక్రమించారు. 24న హరిసింగ్ భారతదేశాన్ని సహాయం కోరాడు. విలీనపత్రంపై సంతకం చేయించుకు రావాల్సిందిగా మెనన్‌ను 26న డిఫెన్స్ కమిటీ కోరింది. మేనన్ జమ్మూకు వెళ్లి మహారాజా చేత సంతకం చేసిన పత్రాలతో తిరిగి వచ్చారు. సర్దార్ పటేల్ విమానాశ్రయం వద్ద మెనన్ కోసం వేచి ఉన్నారు. తరువాత వారిద్దరూ కలిసి డిఫెన్స్ కమిటీ సమావేశానికి హాజరయ్యారు. అదే సమావేశంలో అభిప్రాయసేకరణ నిర్వహించి విలీనం చేపట్టాలని నిర్ణయించారు. నెహ్రూ లాగే, పటేల్ కూడా ఈ నిర్ణయానికి ఒప్పుకున్నారు.

మన కాషాయ అనుచరులు కాశ్మీర్ వివాదాన్ని ఐక్యరాజ్యసమితి ముందుకు తీసుకువెళ్ళినందువల్లే... జనవరి 1, 1949న కాల్పుల విరమణ ఆమోదించారని నెహ్రూను నిందిస్తున్నారు. అలా జరిగి ఉండకపోతే.. పాక్ ఆక్రమణదారులను అవిభజిత కాశ్మీర్ నుంచి గెంటేసే వాళ్ళమని వారంటారు.

భారత స్వాతంత్ర్య చట్టం 1947 ప్రకారం గవర్నర్ జనరల్ దేశ ప్రతినిధి. భారతదేశం అప్పుడు ఈ చట్టం కింద ఉందన్న విషయాన్ని విమర్శకులు మర్చిపోతున్నారు. గవర్నర్ జనరల్‌కు మాత్రమే ఇటువంటి విధానాలపై యుద్ధాలు నిర్వహించడంతో సహా నిర్ణయం తీసుకునే పూర్తి అధికారం ఉంటుంది. 1950లో రిపబ్లిక్‌గా సంపూర్ణ స్వాతంత్ర్యం లభించింది. అంతేకాకుండా ఆ సమయంలో భారత దేశం-పాకిస్థాన్‌కు జాయింట్ డిఫెన్స్ కౌన్సిల్ కూడా ఉండేది. కాబట్టి పటేల్ ప్రధానమంత్రిగా ఉన్నా, యుద్ధాన్ని కొనసాగించాలని ఆయన ఆర్మీని ఆదేశించలేరు.

నవంబరు 1న లాహోర్ సమావేశం తరువాత ఐక్యరాజ్య సమితికి వివాదాన్ని ప్రస్తావించమని గాంధీ, నెహ్రూలను ఒప్పించింది లార్డ్ మౌంట్‌బాటెన్ అని మెనన్ చెప్పాడు. అప్పటి వరకూ అది బహిరంగ యుద్ధం కాదు. "జాయింట్ డిఫెన్స్ కౌన్సిల్"తో.. ఇటీవలే స్వాతంత్ర్యం పొందిన రెండు దేశాల మధ్య ఇటువంటి యుద్ధాన్ని అతను కోరుకోలేదు. 1950 డిసెంబరు 15న తన మరణం వరకు సర్దార్ పటేల్, జనవరి 1, 1949న కాల్పుల నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేసారని అధికారిక నివేదిక ఏదీ లేదు.

రక్షణ విషయాల్లో పటేల్ పాల్గొనలేదనడం నిజం కాదు. రక్షణ శాఖ మంత్రి బాల్దేవ్ సింగ్ తో కలిసి సర్దార్ పటేల్ 1947 నవంబర్ 3న శ్రీనగర్ వెళ్లి.. రక్షణ వ్యూహాన్ని పర్యవేక్షించారని మెనన్ చెప్పారు. 1949 జనవరి 15 వరకు జనరల్ బుచర్ మన కమాండర్ ఇన్ చీఫ్. జనవరి 16న జనరల్ కరియప్ప కమాండర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. సర్దార్ బల్దేవ్ సింగ్ మన రక్షణ మంత్రి. జూన్ 21, 1948లో మౌంట్‌బాటెన్ రాజీనామా చేసిన తరువాత సి.రాజగోపాలాచారి మన గవర్నర్ జనరల్‌గా చేసారు.

చాలామంది కాషాయ "పండితులు" అధికారిక చరిత్ర చదవలేదని అర్థమవుతోంది. వారి అభిప్రాయాలు కేవలం నెహ్రూ మీద ఉన్న ద్వేషం పైనే ఆధారపడి ఉన్నాయి. సి.రాజగోపాలాచారి సైన్యాన్ని యుద్ధం కొనసాగించాలని అనుమతించేవారా లేదా అని అనుకోవడం ఉహాజితమే. అనుమతి ఇవ్వాలనుకున్నా ఇవ్వలేరు. ఎందుకంటే.. ఆయన లండన్ నుంచి గవర్నర్ జనరల్ అనుమతి తీసుకోవాల్సి వచ్చేది.

1959లో స్వతంత్ర పార్టీలో చేరిన మెనన్... నెహ్రూ ప్రతిపక్షంలో చేరిన తరువాత కూడా తన వాదన మార్చలేదు. ఆ రోజుల్లో రాజకీయ కార్యకలాపాలు సిద్ధాంతాలపై, నైతిక విలువలపై నిర్వహించబడేవి. ద్వేషం, దురభిప్రాయాలపై కాదు.

ఇవీ.. విభజన, కాశ్మీర్, పటేల్ గురించి తిరస్కరించలేని వాస్తవాలు. ఈ అంశాలపై ఇప్పుడు ప్రధానమంత్రి మోడీకి అవగాహన ఎందుకు కల్పించాలి? ఎందుకంటే ఇది ఎప్పుడో జరిగిన అంశాలపై, చనిపోయిన వ్యక్తులపై జరుగుతున్న అకాడమిక్ చర్చ కాదు. కాశ్మీర్ సమస్యపై ఈ చర్చ. న్యాయమైన... చిరకాల పరిష్కారం కోసం కాశ్మీర్ రోదిస్తున్నది. వాస్తవాధీనరేఖ నిప్పులపై ఉంది. ఉగ్రవాదులు, ప్రభుత్వాల హింసలో ఇరువైపు సైనికులు, పౌరులు చనిపోతున్నారు. ఊహించని రీతిలో అవమానం, అహేతుకతకు కాశ్మీర్ లోబడి ఉంది.

కాబట్టి భారత్, పాకిస్థాన్, పటేల్ నుంచి ఏదైనా నేర్చుకోవాలి అంటే... ఆచరణాత్మకతకు... పరిస్థితులకు అనుగుణంగా మారడానికి, కాశ్మీర్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి రాజీపడే మనస్తత్వంతో సిద్ధంగా ఉండడం.

రెండు దేశాల భవిష్యత్, శాంతి కోసం కాశ్మీర్‌ను పాకిస్థాన్‌కు ఇచ్చేయడానికి సిద్ధపడ్డ నాయకుడు ఆయన. "కాశ్మీర్‌లో ఒక్క అంగుళం కూడా ఇవ్వం" అనే ఈనాటి 'దేశ భక్తుల' ప్రగల్భాలు చూడండి.

ఆర్‌ఎస్‌ఎస్ నేత శేషాద్రి పుస్తకంలో (పేజీ-226) "వాస్తవాలను విస్మరించడమంటే అవివేకమే. వాస్తవాలను సూటిగా ఎదుర్కోకపోతే... అవి వాటి పగ తీర్చుకుంటాయి" అనే పటేల్ కోట్‌ను గుర్తుంచుకోవాలి.

**-అనువాదం : ఎం. శ్వేత
సెల్: 8333040365**



ఒక నాట్యకళను నేర్చుకోవాలంటే ఎంతో సాధన, ఏకాగ్రత కావాలి. అలాంటి ఏడు నాట్యరీతులను నేర్చుకోవాలంటే సాధనతో పాటు సాధించాలన్న పట్టుదల ఉండాలి. జీవితాన్ని అంకితం చేయాలి. అలా నాట్యమే జీవితమంటూ మల్టీ ప్యాషన్స్‌తో రాణిస్తున్న ప్రముఖ నాట్యకళాకారిణి అచ్యుతమానస. ఇటీవల తుర్కెనిస్థాన్‌లో భారతదేశ ప్రతినిధిగా నాట్యప్రదర్శన నిర్వహించి.. శెహబాష్ అనిపించుకున్నారు. ప్రపంచం నలుమూలల నుంచి ఎన్నికైన అతికొద్దిమంది కళాకారుల్లో ఒకరుగా ఆమె అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. ఒకవైపు కళాకారిణిగా దేశవిదేశాల్లో భారత నాట్యకళలను ప్రదర్శిస్తూ.. మరోవైపు గురువుగా అనాథబాలికలకు నాట్యం నేర్పిస్తూ.. వారిని జాతీయస్థాయి అవార్డు గ్రహీతలుగా తీర్చిదిద్దుతున్నారు. కొందరికే పరిమితమైన కళలను అందరికీ చేరువ చేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. బ్యాలెన్స్ చేసుకోవడం వస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చని నిరూపిస్తున్నారు. మానవితో ఆమె నాట్యప్రస్థానం..



సప్త నాట్యరీతుల నర్తకి

ఐదేండ్ల వయసులోనే దూరదర్శన్‌లో వచ్చే క్లాసికల్ డాన్స్ ప్రోగ్రామ్స్ చూసి.. నేను నేర్చుకోవాలన్న ఆసక్తిని పెంచుకున్నాను. నా ఆసక్తిని గమనించిన అమ్మ నన్ను సంగీతంలో చేర్చారు. నాట్యం, సంగీతం ఒకటే అనుకునే అమాయకత్వంతో సంగీత సాధన ప్రారంభమైంది. ఆ తర్వాత నాట్యం నేర్పిస్తారనుకునేదాన్ని. ఒక రోజు పక్క క్లాసు నుంచి గజ్జెల శబ్దం వినిపించింది. నేను వెళ్లి చూస్తే.. అక్కడ నాట్యం నేర్పిస్తున్నారు. 'నేను డాన్స్ నేర్చుకుంటాను అంటే నన్ను మ్యూజిక్‌లో చేర్చావు. నాకు డాన్స్ కావాలి' అంటూ అమ్మతో పేచీ పెట్టాను. నాన్న రవిచంద్ర ఐపిఎస్ ఆఫీసర్. ఆయన అనుమతితో డాన్స్‌లో చేరాను. అలా 24 ఏండ్ల పాటు నిరంతరాయంగా నాట్య సాధన చేస్తూనే ఉన్నాను.

హైపర్ యాక్టివ్..

చిన్నప్పటి నుంచి నేను హైపర్ యాక్టివ్. అన్నింటిలో నేనే ముందుండేదాన్ని. నాన్న ఐపిఎస్ ఆఫీసర్ కావడంతో రాష్ట్రంలోని చాలా పట్టణాల్లో మా చదువు కొనసాగింది. అమ్మ రాజ్యలక్ష్మి నన్ను, అన్నయ్యను చిన్నతనం నుంచి మా ఆసక్తి గమనించి కళల్లో, ఆటల్లో ప్రోత్సహించేవారు. కూచిపూడితో పాటు భరతనాట్యం కూడా నేర్చుకున్నాను. అనేక రంగాల్లో ప్రావీణ్యం సాధించాలన్న పట్టుదల చిన్నప్పటి నుంచే ఉంది. మల్టీటాస్కింగ్ మనిషిని ఎప్పుడు ఉత్తేజంగా ఉంచుతుంది అన్నది నా నమ్మకం. ఇంజనీరింగ్ మూడో సంవత్సరంలో ఉండగానే మంచి కంపెనీలో ప్లేస్‌మెంట్ వచ్చింది. ఏడాది పాటు ఉద్యోగం చేసి ఆ తర్వాత రిజైన్ చేశాను.

ఏడు నాట్యకళల్లో ప్రావీణ్యత..

ఆరో ఏటా నుంచి నాట్యసాధన ప్రారంభించాను. మొదట కూచిపూడి నేర్చుకున్నాను. ప్రముఖ గురువులు మహంకాళి సూర్యనారాయణ శర్మ, ఖాజా వెంకట సుబ్రహ్మణ్యం, డాక్టర్ వెంపటి చిన సత్యం, చింత ఆదినారాయణ శర్మ కూచిపూడిలో ఎంతో శిక్షణ ఇచ్చారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వందలాది ప్రదర్శనలు ఇచ్చాను. ఆ తర్వాత భరత నాట్యం నేర్చుకోవాలన్న ఆసక్తి కలిగింది. అప్పుడు అమ్మ ఒక్క మాట చెప్పారు. 'నాట్యకళలు వివిధ రకాలు. ఆయా ప్రాంతాలను బట్టి వాటిలో చాలా వ్యత్యాసాలు ఉంటాయి. ఒక విధమైన నాట్యాన్ని ప్రదర్శిస్తున్నప్పుడు మరో నాట్యం గుర్తుకు రాకూడదు. అలా వస్తే నువ్వు కొత్తగా మరోది నేర్చుకోవడం అనవసరం' అన్నారు. ఈ మాటలు నాపై చాలా ప్రభావం చూపించాయి. ఏ నాట్యరీతిలో ప్రదర్శన ఇస్తే.. నేను ఆ నాట్యకళకారిణిగానే గుర్తింపు పొందాను. గత పదేండ్ల నుంచి భరతనాట్యం, కథక్‌లో శిక్షణ తీసుకుంటున్నాను. అనేక ప్రదర్శనలు ఇచ్చాను. నా భరతనాట్య ప్రదర్శన గాని, కథక్ ప్రదర్శన గాని చూసినవారెవ్వరూ నాకు మరో నాట్యం కూడా వచ్చని అనుకోరు.

21ఏండ్ల నుంచి క్రమం తప్పకుండా తిరుపతి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో 108 అన్నమాచార్య కీర్తనలపై కూచిపూడినాట్య ప్రదర్శన ఇస్తున్నాను. కూచిపూడి లో పరిపూర్ణత, ప్రావీణ్యత సాధించాలన్న తపనతో తెలుగు





విశ్వవిద్యాలయం నుంచి, కూచిపూడిలోని శ్రీసిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాపీఠం నుంచి కూచిపూడిలో మాస్టర్స్ పూర్తి చేశాను. ఇప్పుడు పి.హెచ్‌డి చేస్తున్నాను. కూచిపూడి, భరతనాట్యం, కథక్ నేర్చుకున్న తర్వాత మరికొన్ని నాట్యరీతులను నేర్చుకోవాలన్న ఆసక్తి కలిగింది. ఒడిస్సీ, మణిపురితో పాటు టెంపుల్ రిచువల్ డాన్స్, మోహినీయట్టం నేర్చుకున్నాను. ప్రముఖ గురువులు డాక్టర్ ఆజుబాబు, వొలేటి రంగమణిలతో శిక్షణ తీసుకున్నాను. గతంలో ఎవరూ చేయని విధంగా సింహనందిని ప్రదర్శన ఇచ్చాను. నాట్యంతో మిళితమయ్యే సంగీతంపై ఉన్న మక్కువతో కర్ణాటక వోకల్ లైట్ మ్యూజిక్ నేర్చుకున్నాను. సంగీత, నాట్యకళలతో పాటు పెయింటింగ్ చేస్తాను.

అమ్మతో కలిసి..

పిల్లల అభిరుచులను తెలుసుకుని వారిని ఆయారంగాల్లో తల్లిదండ్రులు ప్రోత్సహిస్తారు. అమ్మనాన్నలకు కూడా కొన్ని ఆసక్తులు, అభిరుచులు ఉంటాయి. పిల్లలుగా ఉన్నప్పుడు వారు నేర్చుకోవాలనుకున్న ఎన్నో కళలను వివిధ కారణాలతో నేర్చుకోలేకపోతారు. మా అమ్మకు తన చిన్నతనంలో పెయింటింగ్ అంటే ఆసక్తి ఉండేదని తెలుసుకుని నేను ఆమెతో పెయింటింగ్ వేయించాను. మరికొన్ని వేసిన తర్వాత మేమిద్దరం వేసిన పెయింటింగ్స్‌తో ఎగ్జిబిషన్ పెట్టాలనుకుంటున్నాం.

కళలు అందరికీ చేరువ చేసేలా..

మనదేశంలో కళలు ఉన్నాయి. అయినా ఇప్పటికీ కొన్ని కులాల వారికి మాత్రమే ఇవి నేర్చుకోవడానికి అవకాశాలు.. అనుమతులు ఉన్నాయి. మనసు, శరీరం ఏకమై చేసే సాధనలో నాట్యం ఒకటి. మరి ఇది కొందరికే ఎందుకు అన్న ప్రశ్న నా మనస్సును తొలచివేసింది. సమాజ సేవ చేయాలన్న ఆలోచనతో ఉన్న నేను.. నాట్యాన్ని అందరికీ చేరువ చేసేలా 'కూచిపూడి మై లైఫ్' అన్న సంస్థను ప్రారంభించాను. అట్టడుగు స్థాయిలో ఉండే బాలబాలికలకు నాట్యం, పెయింటింగ్ నేర్పించాలని నిర్ణయించుకున్నాను. మొదటి దశగా ప్రభుత్వ ఆధీనంలో ఉండే స్టేట్ హోమ్స్‌లో ఉండే చిన్నారులకు కూచిపూడి నేర్పించడం మొదలు పెట్టాను. గత ఎనిమిదేండ్ల నుంచి స్టేట్‌హోమ్ చిన్నారులకు శిక్షణ ఇస్తున్నాను. ఇప్పుడు వారిలో కొందరు జాతీయ, రాష్ట్రస్థాయి కళాకారులుగా ఎదిగారు. రాష్ట్రస్థాయిలో బాలరత్న, జాతీయ స్థాయిలో బాలశ్రీ అవార్డులను అందుకోవడం చాలా గర్వంగా ఉంది. నేను ఇచ్చే చాలా ప్రదర్శన ల్లో స్టేట్‌హోమ్ చిన్నారులే ఉంటారు. నేను రూపొందించిన అనేక నృత్యరూపకాలను వారే ప్రదర్శించారు.

ధనవంతులకు, కొన్నికులాలకు మాత్రమే పరిమితమైన కళలను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాను.

ఫండింగ్ కోసం..

పేదవారికి, అట్టడుగు వర్గాల వారికి ఉచితంగా నాట్యం నేర్పించినా.. వారితో ప్రదర్శన ఏర్పాటు చేయాలంటే చాలా డబ్బులు కావాలి. కాస్ట్యూమ్స్‌కు చాలా ఖర్చు అవుతుంది. ఈ ఖర్చులను భరించాలంటే మాకు ఫండింగ్ కావాలి. ఇందుకోసం నేను రూపొందించిన నృత్యరూపకాలను రికార్డు చేసి డివిడిగా మార్కెటులోకి విడుదల చేశాం. వీటిని అమ్మగా వచ్చిన డబ్బులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాం. నాట్యం చాలా ఖరీదైన కళగా మారింది. కొంత మంది గురువులు వేలాది రూపాయలను ఫీజుగా తీసుకుంటూ.. పేదవారికి ఈ కళను అందకుండా చేస్తున్నారు. నేర్చుకోవాలన్న ఆసక్తి ఉన్నవారికి గురువు ముఖతా తప్ప మరేవిధంగా నేర్చుకోవడం సాధ్యం కాదు. గురువులు అందుబాటులో లేనివారు తమ ఆశలను నేరవేర్చుకోలేకపోతున్నారు. ఇలాంటి వారికి నాట్యాన్ని నేర్పించేలా రూపొందించిన ఈ డీవీడీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి.

వి. యశోద

30 నిమిషాల్లో 300 క్యాలరీలు!



స్కిప్పింగ్ చేయడం అన్నింటి కన్నా చక్కటి వ్యాయామం. స్కిప్పింగ్ చేయడం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడటంతో పాటు గుండె పని విధానం ఆరోగ్యకరంగా ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. జపింగ్, స్కిప్పింగ్ చేయడం వల్ల క్యాలరీలు ఎక్కువగా ఖర్చవుతాయి. దాంతో పాటు శరీర బరువు అదుపులో ఉంటుంది. క్రమం తప్పకుండా ప్రతిరోజు 30 నిమిషాలు స్కిప్పింగ్ ఆడటం వల్ల 300 క్యాలరీల శక్తి ఖర్చవుతుంది. శరీర బరువు తగ్గించుకోవాలనుకునే వారికి స్కిప్పింగ్ మంచి వ్యాయామం.

అయితే శరీర బరువును బట్టి స్కిప్పింగ్ చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు 56 కిలోల బరువు ఉంటే... 30 నిమిషాలు స్కిప్పింగ్ చేయాలి. ఇలా చేయడం వల్ల 300 క్యాలరీలు ఖర్చవుతాయి. ఇలా క్రమం తప్పకుండా రెండు వారాలు చేస్తే కచ్చితంగా శరీర బరువులో మార్పును చూడొచ్చు. అలాగే జపింగ్ చేయడం వల్ల కూడా బరువు తగ్గుతారు. కాని ఇలా చేయడం వల్ల శరీర బరువు నెమ్మదిగా తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు ఇలాంటి వ్యాయామాలు చేయడం మంచిదే కాని వీటిని సరిపడా ఆహారం తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. న్యూట్రీన్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గింజలు, చిరుధాన్యాలు, మాంసం, చేపలు, గుడ్లు, పాలు వంటివి ఎక్కువగా తీసుకోవాలి. ఒకవేళ స్కిప్పింగ్ చేసుకుంటే సరిపడా ఆహారం తీసుకోకపోతే కండరాల నొప్పులు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఇలాంటి సమస్యలను దృష్టిలో ఉంచుకొని బరువు తగ్గే ప్రయత్నాలు చేయడం మంచిదని చెబుతున్నారు నిపుణులు. ❄

గోరు వెచ్చటి నూనెతో...

కురులకు నిండుగా నూనె పట్టిస్తే చాలు వెంట్రుకలు బలంగా, పొడవుగా పెరుగుతాయనుకోవడం పొరపాటు. నూనె నిండుగా పట్టించిన వారిలో కూడా వెంట్రుకలు ఎక్కువగా రాలడం, చిక్కులు పడటం, చుండ్రు వంటి సమస్యలతో ఇబ్బందిపడే వారిని గమనిస్తునే ఉంటాం. ఈ సమస్యల నుంచి బయటపడాలంటే కొన్ని సూచనలను పాటించాల్సిందే అంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం...



- చుండ్రు ఎక్కువగా ఉన్నవారు, కురులు బలహీనంగా ఉన్నవారు గోరు వెచ్చటి నూనెతో తలకు మసాజ్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చుండ్రు సమస్య దూరం కావడంతో పాటు జుట్టు బలంగా తయారవుతుంది.
- గోరు వెచ్చటి నూనెను తలకు మసాజ్ చేయడం వల్ల మెడ నొప్పి తగ్గడంతో పాటు రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. వారానికి రెండు సార్లు గోరు వెచ్చటి నూనెతో తలను మసాజ్ చేసుకోవడం ద్వారా కురులు పొడవుగా పెరుగుతాయి.
- కుదుళ్లు బలంగా ఉండాలంటే హెర్బల్ నూనెలను ఉపయోగించాలి. హెర్బల్ నూనెలో ఉండే పోషకాలు కురులకు అవసరమైన పోషకాలను అందిస్తాయి.
- వెంట్రుకల చివర్లు చిట్లిపోతే చిన్నగా కట్‌చేసుకోవాలి. ఇలా కట్ చేసుకున్న వెంట్రుకలకు గోరు వెచ్చటి నూనెతో మసాజ్ చేసుకోవాలి. అలాగే స్నానం చేసిన ప్రతిసారి మాయిశ్చరైజర్ రాసుకుంటే వెంట్రుకలు చిట్లిపోకుండా మృదువుగా, పొడవుగా పెరుగుతాయి. దాంతో పాటు పొడిబారకుండా ఉంటాయి. ❄

సామూహిక గాయానికి 28 ఏండ్లు

'కునన్ - పుష్పోరా' కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాకు చెందిన మారుమూల జంట గ్రామాలు. 1991 వరకు ఈ గ్రామాలు ఉన్నాయనే విషయం కూడా దేశంలో చాలా మందికి తెలియదు. కాని ఒక్కసారిగా ప్రపంచవార్తల్లోకి ఎక్కాయి ఈ రెండు గ్రామాల పేర్లు. కారణం ఆ రెండు గ్రామాలపై తోడేళ్లలా విరుచుకుపడిన ఆర్మీ జవాన్లు ఆ గ్రామంలోని మహిళలపై చేసిన సామూహిక అత్యాచారం. సరిగ్గా 28 ఏండ్ల క్రితం ఫిబ్రవరి 22వ తేదీన దేశాన్ని రక్షించాల్సిన ఆర్మీ, తమ బాధ్యతను మరిచి మృగాలుగా మారి ప్రజలపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. అర్ధరాత్రి సమయంలో వందలాది మంది ఒకేసారి వారి ఇళ్లలోకి చొరబడి పిల్లలు, యువతులు, వృద్ధులు అనే తేడా లేకుండా వందలాది మంది మహిళలపై పడి అత్యాచారం చేశారు. వాళ్ల బారి నుండి తప్పించుకొని పారిపోతున్న మహిళల్ని కూడా వెంటాడి, వేటాడి మరీ అత్యాచారం చేశారు. ఈ అత్యాచారంలో 8 ఏండ్ల పసిపాపతో సహా 80 పండు ముసలిని కూడా ఆ సైన్యం వదలలేదంటే ఎంత పాశవికంగా ప్రవర్తించారో అర్థం చేసుకోవచ్చు.

మూడు రోజుల్లో డెలివరీ కావాల్సిన మహిళ, నెల రోజుల ముందే ఒక బిడ్డకు జన్మనిచ్చిన మహిళ. అంతకు ముందు రోజు పెళ్లి చేసుకున్న యువతి ఇలా ఒక్కరేమిటి అందరూ ఈ మారణ మృగాల బాధితులే. మూడు రోజుల్లో డెలివరీ కాబోతున్న మహిళలను మానవ



మృగాలు రేప్ చేస్తే అతి కష్టం మీద డాక్టర్లు ఆమెకు ఆపరేషన్ చేసి ప్రాణాలు నిలబెట్టాల్సి వచ్చింది. ఇంత కర్కశంగా జంతువులు కూడా వ్యవహరించవు. ఆ ఇంట్లోకి చొరబడ్డ సైనికులు ఇంట్లో ఉన్న పురుషుల్ని ఇళ్లముందే కట్టేసి, తమ తల్లులను, భార్యలను, పిల్లలను అత్యాచారం చేశారు. ఆ సమయంలో వారి పరిస్థితి ఎంత భయంకరంగా ఉండి ఉండవచ్చో అర్థం చేసుకోవచ్చు. ఈ ఘోర కృత్యం జరిగాక మరుసటి రోజు బాధితులంతా చుట్టుపక్కల గ్రామస్తుల సహాయంతో ఆందోళనకు దిగారు. అండగా ఉండాల్సిన నాటి ప్రభుత్వ పెద్దలు మాత్రం బాధితులది నిరాధారారోపణ, వాస్తవం కాదు అంటూ తన వైఖరిని ప్రకటించుకుంది.




గ్రామస్తుల ఒత్తిడి, దేశంలో ఉన్న హక్కుల సంఘాలు, ప్రపంచ వాప్తంగా ఉన్న సంస్థలు, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చాయి. అనివార్య పరిస్థితిలో ప్రభుత్వం ఎంక్వయిరీని నియమించి చేతులు దులిపేసుకుంది. బాధితులను కలవడానికి వచ్చిన జిల్లా మెజిస్ట్రేట్ ఎస్. ఎం. యాసిన్ 'మిలిటరీ చర్య హింసాత్మక జంతువులలా ఉంది' అన్నాడంటే ఆ దాడి ఏవిధంగా జరిగిందో అర్థం చేసుకోవచ్చు. తూ తూ మంత్రంగా విచారణ జరిపి సైనికుల చేతిలో 53 మంది మహిళలు అత్యాచారానికి గురయ్యారని తేల్చినప్పటికీ నేటికి ఆ బాధితులకు న్యాయం దక్కలేదు, బాధ్యులకు శిక్ష పడలేదు. ఆ ఘటన జరిగి నేటికి 27 ఏండ్లు గడిచిపోయాయి. అత్యాచారానికి గురైన బాలికలలో అత్యధికమందిని పెళ్ళి చేసుకోవడానికి ఎవరు ముందుకు రాలేదు. ఇప్పటికీ అవివాహితులుగా మిగిలిపోయి అంగవైకల్యంతో, మానసిన ఒత్తిడికి లోనై సజీవ శవాలుగా బతుకులను వేలాడ దీస్తున్నారు.

తన కళ్ళ ముందే ఎనిమిది మంది సైనికులు తన తల్లిని అత్యాచారం చేస్తుంటే చూసిన పసి హృదయం పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించండి. కళ్ల ముందే నిత్యం జరుగుతున్న ఆకృత్యాలను మౌనంగా చూస్తూ భరించిన కొంతమంది కాశ్మీరి అమ్మాయిలు (పరిశోధక విద్యార్థినులు) పెరిగి పెద్దయ్యాక ఒక బృందంగా ఏర్పడ్డారు. వందలాది సార్లు ఆ రెండు గ్రామాలను సందర్శించి, బాధితులతో పదే పదే మాట్లాడి, అనేక రిపోర్టులను, పిటీషన్స్‌ని స్టడీ చేసి పరిశోధనాత్మకంగా "Do you Know Kunan Poshpora?" అనే ఒక పుస్తకాన్ని సమాజం ముందుకు తీసుకువచ్చారు. వేర్పాటువాదాన్ని అణచివేసే పేర ఆ ప్రాంతాన్ని అదుపులోకి తీసుకున్న ఆర్మీ కాశ్మీరీ ప్రజల పట్ల ముఖ్యంగా మహిళల పట్ల ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందో ఈ పుస్తకం మరోసారి కళ్లముందు ఉంచింది. నిర్భయ ఘటన నేపథ్యంలో ఏర్పాటు చేసిన జస్టిస్ వర్మ కమిషన్ కూడా సైనికుల పట్ల ఇదే వైఖరితో ఉన్నట్లు ఆ నివేదిక ద్వారా తెలుస్తుంది. సరిహద్దు ప్రాంతాల్లో వేర్పాటు వాదాన్ని అరికట్టేందుకు నాటి ప్రభుత్వాలు సైన్యానికి అప్పజెప్పిన 'ప్రత్యేక సైనిక అధికారాల చట్టం (ఆస్ప)' ఫలితమే ఇదంతా. సైన్యం నిత్యం చేస్తున్న అత్యాచారాలకు వ్యతిరేకంగానే మణిపూర్ వేదికగా ఇరోం షర్మిళ ఏండ్లకు ఏండ్లు నిరసనను ప్రకటించింది. దీన్ని రద్దు చేస్తే తప్ప దీనికి ఒక పరిష్కారం దొరకదు. లేదంటే ఇలాంటి ఘోర కృత్యాలు నిత్యం జరుగుతుంటాయి. ❄

ఇట్లచేద్దాం

కలబంద చర్మంపై రాసుకుంటే, అది జిడ్డును అదుపుచేసి, మృత కణాలను తొలగించి, కొత్త కణాలను సృష్టిస్తుంది. కలబంద గుజ్జును ముఖానికి రాసుకోవడం వల్ల మొటిమల వలన వచ్చిన మచ్చలు కూడా పోతాయి.



బీజేపీలో అసహనం

మీడియా చర్చలలో దాడులు


శివాజీతో బీజేపీ కార్యకర్తల వాగ్వాదం

అమరావతి : ప్రత్యేకహోదా, విభజన హామీల అమలులో చేసిన దగాపై ప్రజానీకంలో ఆగ్రహం వెల్లువెత్తుతుండటంతో బీజేపీలో అసహనం పెరుగుతోంది. రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక హోదాపై జరుగుతున్న మీడియా చర్చల్లో చొరబడుతున్న బీజేపీ కార్యకర్తలు గందరగోళం సృష్టించి వాటిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో భౌతిక దాడులకూ తెగబడుతున్నారు. విజయవాడలో కొద్దిరోజుల క్రితం జరిగిన ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం తరువాతే ఈ తరహా దాడులు పెరగడం గమనార్హం. గురువారం విజయవాడలో 10 టివి నిర్వహించిన చర్చ కార్యక్రమంలో పాల్గొన్న ఒక బీజేపీ నేత ప్రత్యేక హోదా అడిగే వారిని రాష్ట్ర ద్రోహులుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గందరగోళం సృష్టించడానికిబీజేపీ కార్యకర్తలు ప్రయత్నించారు. సాక్షి, ఎన్‌టీవీ, టీవీ9, మహా టీవీ తదితర ఛానళ్లు నిర్వహిస్తున్న చర్చ కార్యక్రమాల్లోనూ ఇదే పరిస్థితి నెలకుంటోంది.

వ్యూహం ప్రకారం దాడులు

ప్రత్యేక హోదాపై టీవీ ఛానళ్లు నిర్వహించే చర్చ కార్యక్రమాల్లోకి ఒక వ్యూహం ప్రకారం బీజేపీ కార్యకర్తలు ప్రేక్షకులుగా హాజరవుతున్నారు. చర్చల్లో పాల్గొనే వారు నరేంద్రమోడీ ప్రభుత్వ నిర్వాకాన్ని ఏ మాత్రం ప్రస్తావించినా అరుపులు, కేకలతో అడ్డుకుంటున్నారు. విజయవాడలో టీవీ9 నిర్వహించిన చర్చ కార్యక్రమంలో సినీ నటుడు శివాజీపై బీజేపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమానికి హాజరైన వామపక్షాలు, ఇతర ప్రజాస్వామ్యవాదులు అడ్డుకోవడంతో ఈ ప్రయత్నం విఫలమైంది.

ఆ తరువాత కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో టివి చర్చలను లక్ష్యంగా చేసుకుని బిజెపి దాడులు కొనసాగాయి. బుధవారం రాత్రి విజయనగరంలో చర్చను ఏర్పాటు చేసిన మహా టీవీ సిబ్బంది వాహనంపై దాడి జరిగింది. ఈ దాడి వెనక కూడా బిజెపి ప్రమేయం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే రోజు కాకినాడలో టీవీ9 నిర్వహించిన చర్చాగోష్టిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వివిధ ప్రాంతాల్లో సాక్షి, ఎన్‌టివి నిర్వహిస్తున్న చర్చా గోష్టులలో కూడా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. అనంతపురంలో రెండు రోజులు క్రితం ఒక ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక రాయలసీమ అంశంపై చర్చించాలని డిమాండ్ చేస్తూ అడ్డుకున్నారు.

బీజేపీ కార్యకర్తలు ఒక వ్యూహం ప్రకారం చేస్తున్న ఈ దాడులతో బహిరంగ చర్చలు నిర్వహించడానికి, వాటికి రాజకీయ పార్టీలను ఆహ్వానించడానికి మీడియా సంస్థలు తటపటాయించే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు జిల్లాలో గురువారం నిర్వహించిన చర్చ కార్యక్రమానికి ఒక టివి ఛానల్ రాజకీయ పార్టీల ప్రతినిధులను, కార్యకర్తలను అనుమతించలేదు. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రత్యేకహోదా అంశాలను వక్తలు ఏ మాత్రం ప్రస్తావించినా నినాదాలతోనూ, అరుపులతోనూ అడ్డుకునే ప్రయత్నాన్ని బిజెపి కార్యకర్తలు ఒక వ్యూహం ప్రకారమే చేస్తున్నారన్న అభిప్రాయం పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది.

మార్చి 5 నుంచి బడ్జెట్ సమావేశాలు

అమరావతి : మార్చి 5వ తేదీ నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ఉత్తర్వులు విడుదలయ్యాయి. శాసనసభ, శాసనమండలి సమావేశాలు మార్చి 5 సోమవారం ఉదయం గం.9.30 నిమిషాలకు ప్రారంభం కానున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

మాట తప్పొద్దు

ప్రత్యేక హోదాపై కేంద్రానికి చంద్రబాబు వినతి

- అనంతలో 'కియో' ఫ్రేమ్ ఇన్‌స్టలేషన్ పనుల ప్రారంభం


కియో కార్ల పరిశ్రమ ఫ్రేమ్ ఇన్‌స్టాలేషన్ పరిశ్రమ సూచికకగా సంతకాలు చేస్తున్న ఆ పరిశ్రమ సిఇఓ హౌన్ హూ పార్కు, ముఖ్యమంత్రి చంద్రబాబు

అనంతపురం : "విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీ అమలు చేసి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి ఉండేది. ఇచ్చిన మాట తప్పి తెలుగువారి ఆత్మగౌరవాన్ని కించపరచవద్దు." అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్రంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రత్యేకహోదా కోసం ఎవరు పోరాడినా మద్దతిస్తామని చెప్పారు. గురువారం అనంతపురం జిల్లా అమ్మవారిపల్లి వద్ద ఏర్పాటుచేసిన 'కియో' కార్ల పరిశ్రమ ఫ్రేమ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బీజేపీతో గత ఎన్నికల్లో పొత్తుపెట్టుకున్నామని తెలిపారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరితే 14వ ఆర్థిక సంఘం ఇవ్వడానికి వీల్లేదని చెప్పిందని కేంద్రం అప్పట్లో వెల్లడించిందని గుర్తు చేశారు. అయినా హోదాకు తగ్గట్టు సహాయం అందజేస్తామని చెప్పడంతో సర్దుకున్నామని వివరించారు. మూడున్నరేళ్లుగా ఎంతో ఓపికగా వేచి చూసామని చెప్పారు. 29 సార్లు ఢిల్లీకి వెళ్లడంతోపాటు, పలుమార్లు ప్రధానమంత్రిని కలిశానని పేర్కొన్నారు. అయినా రాష్ట్రానికి అందాల్సినంత సాయం అందలేదని విచారం వ్యక్తం చేశారు. కేంద్రం సహకరిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేదని చెప్పారు. కేంద్రం నుంచి సహాయం అందకపోయినా పెట్టుబడుల కోసం కృషి చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే ఇప్పుడు అనంతపురం జిల్లాకు 'కియో' పరిశ్రమ వచ్చిందని తెలిపారు. రాష్ట్రానికి ఇసుజి, హీరో మోటర్సు తదితర పరిశ్రమలు మరిన్ని రానున్నాయన్నారు. సుమారు 13.54 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తాయని చెప్పారు.

ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే ఈ పరిశ్రమలు మరిన్ని రావడానికి మార్గం సుగమమై ఉండేదని చెప్పారు. హోదా కోసం ఎవరు ఉద్యమం చేసినా తన మద్దతు ఉంటుందన్నారు. అయితే శాంతి భద్రతల విఘాతం కలుగకుండా ఒత్తిడి పెంచాల్సిన అవసరముందని చెప్పారు.

ఫ్రేమ్‌వర్కు ఇన్‌స్టాలేషన్‌కు శంకుస్థాపన...

అనంతపురం జిల్లా పెనుకొండ సమీపంలోని యర్రమంచి వద్ద ఏర్పాటు కాబోతున్న 'కియో' కార్ల తయారీ పరిశ్రమకు సంబంధించి 'ఫ్రేమ్ ఇన్‌స్టాలేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్లాంటులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కియో పరిశ్రమ అధ్యక్షులు, సిఇఒ హాన్ హూ పార్కుతో కలసి పాల్గొన్నారు. ఇద్దరూ ఇనుప భీమ్‌పై సంతకాలు చేసి లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కియో కార్ల పరిశ్రమ రాష్ట్రానికి రావడం ఎంతో గర్వకారణమన్నారు. కరువు ప్రాంతమైన ఇక్కడ ఉపాధి అవకాశాలు మెరుగుపడేందుకు ఇది ఎంతగానో దోహదం చేస్తాయని వివరించారు. సిఇఒ హాన్ హూ పార్కు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారం బాగా ఉందని చెప్పారు.

ముందస్తు నిర్బంధం

- సీఎం పర్యటన కోసం పోలీసుల దూకుడు
- అనంతలో సీపీఐ(ఎం), సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు సహా పలువురి అరెస్టు



అనంతపురం : అనంతపురం జిల్లా పెనుకొండలో గురువారం 'కియో' కార్ల పరిశ్రమలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న సందర్భంగా బుధవారం అర్ధరాత్రి నుంచే జిల్లాకు చెందిన పలువురిని అక్రమంగా అరెస్టు చేశారు. సీపీఐ(ఎం), సీపీఐ, ప్రజా సంఘాలు, న్యాయవాదులను అక్రమంగా నిర్బంధించారు. రాయలసీమ ప్రాంతానికి ప్రభుత్వ మిచ్చిన హామీలను అమలు చేయాలని గత కొంత కాలంగా జిల్లాలో వామపక్షాలు, ప్రజా సంఘాలు, న్యాయవాదులు పోరాటం సాగిస్తు న్నారు. సీపీఐ(ఎం) ఉత్తర ప్రాంత కార్యదర్శి వి.రాంభూపాల్‌ను అరెస్టు చేసి అనంతపురం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. దక్షిణ ప్రాంత కార్యదర్శి ఎం.ఇంతియాజ్‌ను హిందూపురంలో అరెస్టు చేశారు. రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబు లును పెనుకొండలో అరెస్టు చేశారు. బార్ అసోసి యేషన్ నాయకులు, న్యాయవాదులు హరినాథరెడ్డి, నారాయణరెడ్డి, రాజారెడ్డి లను బుధవారం సాయంత్రమే అరెస్టు చేశారు. వీరితోపాటు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ తదితర ప్రజాసంఘాల నాయకులనూ అరెస్టు చేశారు. జిల్లా వ్యాప్తంగా 160 మంది సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలను, 250 మంది న్యాయవాదులను పోలీస్ స్టేషన్లకు తరలించారు. కొందరు ముఖ్య నాయకులను దూరప్రాంతాల పోలీస్ స్టేషన్లకు తరలించారు. కొందరిని పోలీస్ వాహనాల్లో ఎక్కించుకుని చంద్రబాబు సభ ముగిసే వరకూ ఎక్కడెక్కడో తిప్పారు.

న్యాయవాదులపై పోలీసుల నిర్బంధం

- అనంతపురం, కర్నూలులో అరెస్టు
- కడపలో కొనసాగిన దీక్షలు


కర్నూలు జిల్లా వెల్దుర్తి పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న అరెస్టయిన న్యాయవాదులు

విజయవాడ: రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయవాదుల దీక్షలు గురువారం కొనసాగాయి. అనంతపురం జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రిని అడ్డుకుంటామని హెచ్చరించిన అనంతపురం, కర్నూలు, కడప న్యాయవాదుల సంఘం నాయకులను బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. పోలీసులను తప్పించుకుని వెళ్లిన న్యాయవాదులను సైతం జిల్లా సరిహద్దుల్లో అరెస్టు చేశారు.

కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగలక్ష్మిదేవి, సీనియర్ అడ్వకేట్ జయరాజు, బార్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి కె.కుమార్‌లను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఐలు నాయకులు బి.వెంకటస్వామి, పి.నిర్మల, సీనియర్ అడ్వకేట్ ఓంకార్ కర్నూలు నుంచి అనంతపురం వెళ్తుండగా వెల్దుర్తి వద్ద పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. అనంతపురం జిల్లాలో దీక్షలు కొనసాగాయి. కదిరి పట్టణంలో న్యాయవాదులు చేపట్టిన దీక్షలను పోలీసులు భగ్నం చేసి, వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతపురం జిల్లా కేంద్రంలో చేపట్టిన న్యాయవాదుల దీక్షలకు పలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కడప జిల్లాలో దీక్షలు 31వ రోజుకు చేరాయి. యానాదయ్య, గంగశేఖర్, రంగబాలాజీ, పాలకొండరాయుడు దీక్షలో కూర్చున్నారు. కడప బార్ అసోసిచేషన్ అధ్యక్షులు అరుణకుమారి మాట్లాడారు.

ఆర్జీవీ అరెస్టుకు డిమాండ్

- నేటి నుంచి సంతకాల సేకరణ
- మహిళ, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త దేవి, అధ్యక్షత వహించిన ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి తదితరులు

అమరావతి : మహిళను వ్యాపార వస్తువుగా, అభ్యంతరకరంగా చూపిస్తూ జీఎస్టీ సినిమాను చిత్రీకరించినందుకు డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మను వెంటనే అరెస్ట్ చేయాలని మహిళా, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. మహిళా సంఘాల నాయకులపై వర్మ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటైంది. వర్మను అరెస్ట్ చేయకుంటే వచ్చే నెల 6 నుంచి నిరవధిక దీక్షలు చేపడతామని సంఘాలు ఐక్యంగా హెచ్చరించాయి. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహిస్తూ ఇంటర్నెట్‌లో అశ్లీల వీడియోలను నియంత్రించేందుకు 'మీడియా వాచ్ కమిటీ' ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పోర్నోగ్రఫీని కట్టడి చేసే వ్యవస్థను తీసుకువచ్చేలా మేధావులు, మహిళ, ప్రజా సంఘాలన్నీ కలిసి శుక్రవారం నుంచి వచ్చే నెల 1 వరకు సంతకాల సేకరణ చేపడతాయని చెప్పారు. సామాజిక కార్యకర్త దేవి మాట్లాడుతూ పాశ్చాత్య పోర్న్ వీడియోలు మన సెర్చ్ ఇంజిన్‌లోకి రాకుండా, చైనా తరహాలో పటిష్టంగా కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. సైబర్ నేరాలకు టోల్ ఫ్రీ నెంబర్ పెట్టాలని సూచించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలను గౌరవించేలా విద్యా వ్యవస్థలో మార్పు రావాలన్నారు. మహిళా సంఘాలు చేస్తున్న పోరాటాలకు మద్దతునిస్తామన్నారు. ప్రగతిశీల మహిళాసంఘం రాష్ట్ర నాయకురాలు గంగా భవాని మాట్లాడుతూ అశ్లీల వీడియోల నియంత్రణ కోసం పోరాడేందుకు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

26న కలెక్టరేట్ల వద్ద నిరాహారదీక్షలు

- ఎక్సైజ్ పన్ను రద్దు చేయాలి: తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరాహారదీక్షలు చేస్తున్నట్టు తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎంవి రమణ మాట్లాడుతూ గీత కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్న రూ.15 కోట్ల ఎక్సైజ్ పన్ను రద్దు చేస్తామని మంత్రి టి పద్మారావుగౌడ్ ప్రకటించారని చెప్పారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం గీత కార్మికుల నుంచి బలవంతంగా ఎక్సైజ్ పన్ను వసూలు చేస్తున్నారని అన్నారు. ఎక్సైజ్ పన్ను రద్దు చేస్తున్నట్టు తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల వద్ద వసూలు చేసిన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరారు. గీత వృత్తిలో ప్రమాదం జరిగి వందలాది మంది చనిపోవడం, కొందరు వికలాంగులుగా మారుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియో ఆసరా పింఛన్ పొందే వారికి వర్తించబోదని జీవో నెంబర్ 164లో పేర్కొనడం సమంజసం కాదన్నారు. షరత్తుల్లేకుండా ప్రమాదం జరిగిన వారందరికీ ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన వారికి సకాలంలో వైద్యం అందించాలని కోరారు. గీత కార్మికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఉన్నా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని అన్నారు. 2018-19 బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి భూమి, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు, వ్యక్తిగత రుణాలు, పిల్లలకు విద్య, హాస్టల్ వసతి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉందని వివరించారు. అర్హులైన అందరికీ కొత్త సభ్యత్వం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కొత్త సొసైటీలకు అనుమతి ఇవ్వాలని సూచించారు. తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమను నెలకొల్పాలని కోరారు. కల్లు అమ్మకాలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని సూచించారు. నిరుపేదలకు మూడెకరాల భూమి, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని చెప్పారు. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను ప్రచారంలోకి తేవాలని సూచించారు. ఏజెన్సీ ఏరియాలో రద్దయిన సొసైటీలను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులు బత్తుల జనార్ధన్, కె స్వామిగౌడ్, వి వెంకటనర్సయ్య, సుర్వి నరేష్‌గౌడ్, రవి ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ. కోటి భూమిని నా భర్త అక్రమంగా అమ్మేశాడు

- డీజీపీ కి అదనపు డీసీపీ బాబూరావు భార్య ఫిర్యాదు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

తన పేరిట ఉన్న కోటి రూపాయల భూమిని అక్రమంగా తన భర్త , నగర సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ అదనపు డీసీపీ బాబూరావు అమ్మేశాడని, తానుండగానే మరో మహిళతో సంసారిక జివితాన్ని గడుపుతున్నాడని, అతనిపై చర్య తీసుకుని న్యాయం చేయాలని సదరు అధికారి భార్య వేదశ్రీ గురువారం డీజీపీ మహేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. గత 15 ఏండ్లుగా తయ్యబ తస్నీమ్ అనే మహిళతో తన భర్త సహజీవనం చేస్తున్నాడని, ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్న తనను వదిలేసి ఆమెతో సంసారిక జీవితాన్ని సాగిస్తున్నాడని వేదశ్రీ ఆరోపించింది. అంతేగాక విజయవాడలో ఉన్న 199 చదరపు గజాల కోటి రూపాయల విలువైన భూమి తన పేరిట ఉందని , దానిని తనకు తెలియకుండానే అక్రమంగా బాబూరావు అమ్మేశాడని ఫిర్యాదులో పేర్కొంది.

సర్కారు విద్యార్థులకు

19 నుంచి నీట్, జేఈఈ, ఎంసెట్ శిక్షణ

పాత పది జిల్లాల్లో నిర్వహణ

- ఇంటర్ విద్య కమిషనర్ అశోక్
- అధ్యాపకులకు ఓరియెంటేషన్ కార్యక్రమం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు వేసవిలో నీట్, జేఈఈ, ఎంసెట్ ఉచిత శిక్షణ ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సమాయత్తమవుతున్నది. వచ్చేనెల 19 నుంచి ఈ శిక్షణ ప్రారంభమవుతున్నది. అందులో భాగంగానే గురువారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో అధ్యాపకులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించింది. ఇంటర్ విద్య కమిషనర్ ఎ అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీలను బలోపేతం చేయడంలో భాగంగా కళాశాలలకు పక్కా భవనాల నిర్మాణాలు, ప్రహరీ గోడల నిర్మాణాలు, మరుగుదొడ్లు, ఫర్నీచర్, ల్యాబ్స్‌లో పరికరాలు, ఆట వస్తువులు సమకూర్చడం జరుగుతున్నదని చెప్పారు. బయోమెట్రిక్ ద్వారా హాజరు, సీసీ కెమెరాల ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్‌లో ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ కాలేజీల బలోపేతానికి అధ్యాపకులు కృషి చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించడం కోసమే నీట్/జేఈఈ/ఎంసెట్ శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జాతీయ, రాష్ట్ర ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామని వివరించారు. అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ సామాజిక బాధ్యతతో కోచింగ్ ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. వచ్చేనెల 19 నుంచి ఏప్రిల్ 19వ తేదీ వరకు పాత పది జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఒక్కో కేంద్రంలో అబ్బాయిలు 50 మంది, అమ్మాయిలు 50 మంది చొప్పున వంద మంది ఉంటారని చెప్పారు. విద్యార్థులకు ఏప్రిల్ 20 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సాధన చేయిస్తామని అన్నారు. ప్రతి కేంద్రం నుంచి ఐదు మందిని ఎన్నుకొని పది రోజులు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తామన్నారు. నీట్, జేఈఈ, ఎంసెట్ ప్రవేశ పరీక్షలపై అధ్యాపకులు, సూచనలు, సలహాలు, మెళకువలు నేర్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ డైరెక్టర్ ఎ సత్యనారాయణరెడ్డి, గాయత్రి విద్యాసంస్థల చైర్మెన్ పివిఆర్‌కె మూర్తి, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ హెచ్‌పీసీఎల్ ట్రేడ్ యూనియన్ కార్యదర్శి గుణశేఖర్, ప్రభుత్వ కాలేజీల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు పి మధుసూదన్‌రెడ్డి, ప్రభుత్వ కాలేజీల ప్రిన్సిపాల్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కె కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్

జగిత్యాలలో పట్టుకున్న హైదరాబాద్ పోలీసులు

నవతెలంగాణ- జగిత్యాల

గల్ఫ్ ఏజెంట్‌ను హైదరాబాద్ పోలీసులు జగిత్యాలలో అరెస్టు చేశారు. అయితే, స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా.. మఫ్టీలో వచ్చిన హైదరాబాద్ పోలీసులు గురువారం ఏజెంట్‌ను రోడ్డుపై పట్టుకుపోవడంతో కిడ్నాప్‌గా భావించారు. స్థానికుల సమాచారంతో జిల్లా ఎస్పీ పోలీసులను అప్రమత్తం చేసి విచారణ చేపట్టగా అసలు విషయం తెలిసింది.గొల్లపల్లి మండలం బొంకూరు గ్రామానికి చెందిన కందుకూరి నారాయణ కొన్ని సంవత్సరాలుగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. ఈ మధ్యకాలంలో ఇజ్రాయిల్ దేశానికి పంపిస్తానని కొంతమంది వద్ద డబ్బులు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ బాధితుల్లో హైదరాబాద్‌కు చెందిన వారు కూడా ఉన్నారు. వారు సైదరాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. గురువారం మధ్యాహ్నం కందుకూరి నారాయణ తన స్నేహితుడైన దేవేందర్‌రెడ్డి ద్విచక్రవాహనాన్ని తీసుకుని మీసేవ కేంద్రానికి వెళ్లాడు. అప్పటికే మఫ్టీలో ఉన్న నలుగురు హైదరాబాద్ పోలీసులు కారులో నారాయణను వెంబడిస్తూ వచ్చారు. మీసేవ కేంద్రం వద్ద ఆగగానే నారాయణను పట్టుకున్నారు. బలవంతంగా కారులో ఎక్కించుకుపోయారు. ఇది గమనించిన స్థానికులు జిల్లా ఎస్పీ అనంతశర్మకు సమాచారం ఇచ్చారు. ద్విచక్ర వాహనం నెంబర్ ఆధారంగా పోలీసులు నారాయణ భార్యను విచారించారు. అతని స్నేహితులను అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించారు. జిల్లా పోలీసులకు సమాచారం తెలుపకుండా నారాయణను హైదరాబాద్ పోలీసులు తీసుకెళ్లడంతో మొదట కిడ్నాప్‌గా భావించారు. అయితే, ఎస్పీ పోలీసులను అప్రమత్తం చేసి చెక్‌పోస్టులను మూసేయాల్సిందిగా ఆదేశించారు. విచారణ అనంతరం కిడ్నాప్ కాదు, అరెస్టు అని తెలిపారు.

ఆరు రోజుల ఏసీబీ కస్టడీకి అవినీతి కట్టా

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

అవినీతి తిమింగలం , హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ కట్టా పురుషోత్తంరెడ్డిని తదుపరి విచారణ కోసం ఆరు రోజుల పాటు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కస్టడీకి ఇస్తు ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. 23 నుంచి 28వ తేదీ వరకు ఏసీబీ అధికారులు కట్టాను విచారించనున్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడి దాదాపు 25 కోట్ల రూపాయలకు పైగా అక్రమాస్తులను కట్టా కలిగి ఉన్నట్టు ఇప్పటి వరకు జరిపిన దర్యాప్తులో ఏసీబీ అధికారులు తేల్చిన విషయం తెలిసిందే.

భగీరథ నీటిశుద్ధికి కరదీపిక

- ఇంజినీర్ ఇన్ చీఫ్ సురేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భగీరథ నీటిశుద్ధికి ప్రత్యేకంగా కరదీపిక రూపొందించినట్టు మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.సురేందర్‌రెడ్డి తెలిపారు. ప్రధాన పనులు పూర్తయిన నేపథ్యంలో ఇంట్రా విలేజ్ పనులపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. గురువారం ఎర్రమంజిల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల ఎస్.ఈ, ఈఈలతో మాట్లాడారు. అంతకుముందు తాగునీరు, పారిశుధ్యంపై రూపొందిం చిన కరదీపికను సురేందర్ రెడ్డి ఆవిష్కరించారు. మిషన్ భగీరథ ప్రధాన పనులను అనుకున్న సమ యానికి పూర్తి చేసినందుకు అధికారులకు అభినందనలు చెప్పారు. ప్రతీ ఒక్కరు పగలు, రాత్రి తేడా లేకుండా కష్టపడ్డారని ప్రశంసించారు. ప్రధాన పనులు పూర్తయిన సెగ్మెంట్లల్లో ట్రయల్ రన్ నిర్వహించాలని ఆదేశించారు. ట్రయల్ రన్ విజయవంతమైన చోట వాటిని ప్రారం భోత్సాలకు సిద్ధం చేయాలని సూచించారు. ప్రధాన సెగ్మెంట్లను ప్రారంభించిన అనంతరం ప్రతీ గ్రామానికి శుద్ధి చేసిన మంచినీరు చేరుతుం దన్నారు. ఆ తర్వాత ఇంట్రా విలేజ్ పనులపై శాఖ మొత్తం దష్టి పెట్టాలని చెప్పారు. ఈ విషయంలో సహకరించడానికి ఎమ్మెల్యే లు, కలెక్టర్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. భగీరథ కట్టడాలు, నిర్మాణాలను ఫోటోలు తీసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు కపాకర్ రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయ్‌ప్రకాశ్‌తోపాటు కన్సల్టెంట్లు ఇతర అధికారులు పాల్గొన్నారు. మిషన్ భగీరథ చెల్లింపులను మరింత సరళతరం చేయడానికి, జీఎస్టీ పై అవగాహన కల్పించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిఏఓలకు ఎర్రమంజిల్‌లోని శాఖ రాష్ట్ర కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు.

బీఎస్ఈలోకి జీహెచ్ఎంసీ

- లిస్టింగ్ ఘంట మోగించిన మేయర్, సీఎస్
- స్థానిక సంస్థలు ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి

నవతెలంగాణ - సిటీబ్యూరో

బాండ్ల ద్వారా మొదటి దశలో రూ.200 కోట్ల నిధులను సమీకరించిన హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) అధికారికంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) లిస్టింగ్‌లో గురువారం నమోదైంది. ఈ సందర్భంగా మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఘంట మోగించి లిస్టింగ్ అయినట్టు ప్రకటించారు. జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి మాట్లాడుతూ.. స్థానిక సంస్థలు ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంతంగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలని అన్నారు. బాండ్ల ద్వారా నిధుల సేకరణతో దేశంలోని పురపాలక సంఘాలకు జీహెచ్ఎంసీ ఆదర్శంగా నిలవడంతోపాటు కొత్త ఒరవడికి నాంది పలికిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ దేశంలోనే అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ముందుందన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకత ఆధారంగా జీహెచ్ఎంసీకి రేటింగ్ సంస్థలు ఏఏ (నిలకడ) ఇచ్చాయని, భవిష్యత్‌లో ఏఏఏ (పాజిటివ్) సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. బాండ్ల ద్వారా నిధుల సేకరణతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లిస్టింగ్‌లో నమోదు కావడం చారిత్రాత్మక ఘట్టమని జోషి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, ఆర్థిక, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శులు రామకష్ణారావు, అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ డైరెక్టర్ టీకే శ్రీదేవి, కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్, ఖమ్మం మేయర్ రూపాలాల్, నిజామాబాద్ మేయర్ ఆకుల లలిత, బీఎస్ఈ చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్ నీరజ్ కుల్‌శ్రేష్ట, ఎస్‌బీఐ క్యాపిటల్ ఉపాధ్యక్షులు ఆశీష్‌సాబ్లే, స్పా క్యాపిటల్ సలహాదారులు సంజయ్‌గుప్త పాల్గొన్నారు.

కాల్పులను అరికట్టాలంటే... టీచర్లకూ గన్స్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్



వాషింగ్టన్: అమెరికాలోని పాఠశాలల్లో కాల్పుల ఘటనలు అరికట్టాలంటే టీచర్లకు తుపాకులు ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిప్రాయపడ్డారు. పాఠశాల పరిసరాల్లో గన్ ఫ్రీ జోన్స్ లేకుండా చేస్తామని అన్నారు. అమెరికాలో హింసాత్మక ఘటనల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వైట్‌హౌస్ అధికారులతో కలిసి ట్రంప్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుపాకులు కొనుగోలు చేసేందుకు వస్తున్న కస్టమర్ల నేపథ్యాన్ని తుపాకులు అమ్మేవాళ్లు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరముందన్నారు. పాఠశాలల్లో ఇటీవల జరిగిన కాల్పుల ఘటనలు తనను ఎంతగానో బాధించాయని అన్నారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలంటే ఉపాధ్యాయులకు తుపాకులు సరఫరా చేసి వాటి వినియోగంపై శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందన్నారు. దుండగులు కాల్పులు జరుపుతున్న సమయంలో పోలీసుల సాయం కోసం టీచర్స్ ఎదురు చూడాల్సిన దుస్థితి ఇకపై ఏర్పడొద్దని తాము ఆకాంక్షిస్తున్నామని అన్నారు. కాగా, అమెరికాలో తుపాకీ సంస్కృతి పెరిగిపోయింది. సమాజంలో అన్ని వర్గాలకు చెందినవారు తుపాకులను ఉపయోగిస్తున్నారు. అంతేగాకుండా, తమ కార్యకలాపాలకు అడ్డుచెప్పినవారిపై కాల్పులకు తెగబడుతున్నారు. దీంతో, కాల్పుల ఘటనల సంఖ్య బాగా పెరిగిపోయింది. వరుస కాల్పుల ఘటనలతో అమెరికన్లలో భయాందోళనలు నెలకొన్నాయి. గతవారం ఫ్లోరిడా స్కూల్‌లో పూర్వ విద్యార్థి చొరబడి కాల్పులకు తెగబడ్డ సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటనపై విమర్శలు వెల్లువెత్తాయి. వేలాది మంది వీధుల్లోకి చేరుకుని ఇలాంటి ఘటనలను ప్రభుత్వం నివారించకపోవడం శోచనీయమంటూ ఆందోళనలు చేపట్టారు. గన్ కల్చర్‌కు వ్యతిరేకంగా వాషింగ్టన్, చికాగో, పిట్స్‌బర్గ్ నగరాల్లో వందలాది మంది భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.

కాల్పుల ఘటనల నియంత్రణకు ప్రత్యేక యంత్రాంగం


మెజరరీ స్టోన్‌మేన్ డగ్లస్ హైస్కూల్ విద్యార్థులతో ట్రంప్ మాట్లాడారు. కాల్పుల ఘటనల పట్ల ఆందోళన చెందొద్దని కోరారు. ఇలాంటి ఘటనల నియంత్రణకు ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించామన్నారు. 'తుపాకులు కొనుగోలు చేసే వాళ్ల నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాం. వారి మానసిక పరిస్థితి ఎలా ఉందో తెలుసుకుంటాం. ఇకపై గతంలో జరిగినట్టు జరగదు. ఇప్పటికే చాలా కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. తుపాకుల ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపడతాం' అని ట్రంప్ అన్నారు. గన్ లాబీయింగ్ సంస్థ నేషనల్ రైఫిల్ అసోసియేషన్ (ఎన్ఆర్ఏ) చాలా కాలంగా చేస్తున్న ప్రతిపాదనకు ట్రంప్ మద్దతు పలికారు. టీచర్లకు, ఇతర సిబ్బందికి తుపాకులివ్వాలనే డిమాండ్‌ను ట్రంప్ చాలా బలంగా సమర్థించారు. తుపాకులను ఉపయోగించడంలో నైపుణ్యం ఉన్న టీచర్లుంటే ఇలాంటి దాడులను వెంటనే అడ్డుకోవచ్చునని ట్రంప్ అన్నారు.

గన్-ఫ్రీ జోన్‌పై విమర్శ

స్కూళ్లలో గన్-ఫ్రీ జోన్ పట్ల ట్రంప్ అభ్యంతరం తెలిపారు. 'గన్ ఫ్రీ జోన్ అనేది పిచ్చితనమే. ఎందుకంటే, పిరికివాళ్లు లోపలికి జొరబడి కాల్పులు జరిపేందుకు అవకాశం ఉంటుంది' అని ట్రంప్ అన్నారు. దాదాపు 40 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు హృదయాలను కలచివేసేలా మాట్లాడిన మాటల్ని ట్రంప్ విన్నారు. ట్రంప్ పాల్గొన్న ఈ సమావేశానికి ముందు వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది విద్యార్థులు వాషింగ్టన్‌లో ర్యాలీ నిర్వహించారు. మరోవైపు, ఫ్లోరిడా షూటింగ్‌లో క్షేమంగా బయటపడిన వారు ఆ రాష్ట్ర ప్రజాప్రతినిధులను కలిసి అస్సాల్ట్ రైఫిళ్ల విక్రయంపై నియంత్రణ విధించాలని డిమాండ్ చేశారు.

ఉభయ కొరియా దేశాల మధ్య చర్చలు జరగాలి :

- ఐరాస మాజీ ప్రధాన కార్యదర్శి



న్యూయార్క్ : ఉత్తర, దక్షిణ కొరియా దేశాల మధ్య చర్చలు జరగాలని తాను ఆకాంక్షిస్తున్నట్టు ఐరాస మాజీ ప్రధాన కార్యదర్శి బాన్ కీ మూన్ అభిప్రాయపడ్డారు. ఈ చర్చలకు అమెరికా కీలక పాత్ర పోషించాలని తాను కోరుతున్నానని అన్నారు. దక్షిణ కొరియాలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు క్రీడాకారులు, అథ్లెట్స్‌లను ఉత్తర కొరియా పంపించింది. ఉత్తర, దక్షిణ కొరియా ప్రతినిధులు ఒలింపిక్స్‌ను తిలకించారు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సైతం దక్షిణ కొరియా నుంచి స్నేహాన్ని కోరుతున్నారు. ఇరుదేశాల మధ్య చర్చలు జరగాలని, కొరియా ద్వీపకల్పంలో శాంతి స్థాపన జరగాలని తాను కోరుతున్నట్టు బాన్ కీ మూన్ అభిప్రాయపడ్డారు. ఉభయ కొరియాల మధ్య మొదలైన చర్చల క్రమం సజీవంగా వుండాలని, శాంతి, సామరస్యత నెలకొనడానికి, అణు నిరాయుధీకరణకు దారి తీయాలని కోరారు.

పెరూలో రోడ్డు ప్రమాదం

44 మంది మృతి



లిమా: పెరూలో అరెక్విపా నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఓ డబుల్ డెక్కర్ బస్సు అదుపు తప్పి లోయలో పడిపోవడంతో 44 మంది మృతి చెందారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. చలా నుంచి అరెక్విపా నగరానికి బస్సు బయలుదేరిన సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడంతోనే ప్రమాదం సంభవించినట్టు అధికారులు అనుమానిస్తున్నారు. లిమా డీఎస్పీ వాల్టేర్ ఓరిట్జ్ తెలిపిన వివరాల ప్రకారం......అరెకిపాలోని హైవేపై గురువారం ఈ ప్రమాదం జరిగింది. ఓ నదిపై నిటారుగా ఎత్తైన కొండలను ఆనుకుని వెళ్లే హైవే మలుపు వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ప్రత్యేక సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి తరలివెళ్లాయి. 44 మృతదేహాలను వెలికి తీసినట్టు అధికారులు తెలిపారు. బస్సు బయల్దేరినప్పుడు అందులో మొత్తం 45 మంది ప్రయాణిస్తున్నట్టు సమాచారం. అయితే, మార్గమధ్యంలో మరికొందరు బస్సులో ఎక్కినట్టు భావిస్తున్నందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ ఘటనపై పెరూ అధ్యక్షుడు పెడ్రో పాబ్లో కుజిన్స్కి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. తక్షణ సాయం అందించే విధంగా అన్నిరకాల చర్యలు చేపట్టామని అన్నారు.కాగా, గత నెలలో ఇదే రహదారిపై పసామాయో సమీపంలో ఓ బస్సు మరో ట్రక్కును ఢీకొట్టటంతో 52 మంది మృతి చెందారు.గత నెల 2న సెంట్రల్ కోస్టల్ ఏరియాలో జరిగిన బస్సు ప్రమాదంలో సుమారు 52 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. పెరూ ప్రాంతంలో 2016లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సుమారు 2,700 మందికి పైగా చనిపోయినట్టు అధికారులు వెల్లడించారు.

సిరియాలో ఆగని వైమానిక దాడులు

- ఆరుగురు మృతి



డమాస్కస్ : సిరియా సైన్యం, తిరుగుబాటుదారులకు మధ్య జరుగుతున్న వైమానిక దాడుల కారణంగా ఆరుగురు మృతి చెందారు. 34 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డమాస్కస్ పోలీస్ కమాండ్ తెలిపిన వివరాల ప్రకారం...అల్-అబసిస్ స్క్వేర్‌పై రాకెట్ దాడి జరిగింది. ఈ దాడిలో ఆరుగురు మృతి చెందారు. భారీ ఆస్తినష్టం సంభవించింది. పలు కార్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసమయ్యాయని పేర్కొంది. డమాస్కస్ శివార్లలో సాయుధ గ్రూపులు మోర్టార్ దాడులతో విరుచుకుపడుతున్నాయి. ఇదిలా ఉండగా, జర్మానా నగరంలో గురువారం జరిగిన దాడిలో ఇద్దరు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు. పొలాల్లో కూడా రాకెట్లు పడడంతో పంటలు ధ్వంసమయ్యాయని, రైతులు ఉపయోగించే పనిముట్లు దెబ్బతిన్నాయని పోలీసులు తెలిపారు. ఈ దాడులకు సిరియా అరబ్ ఆర్మీ వెంటనే స్పందించిందని, రాకెట్లు, మోర్టార్లు ప్రయోగిస్తున్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఎదురు దాడులు జరిపిందని సిరియా స్టేట్ మీడియా ప్రకటించింది. అనేక రాకెట్ లాంచర్లను ధ్వంసం చేశామని, తిరుగుబాటుదారుల స్థావరాలు బాగా దెబ్బతిన్నాయని సిరియా ఆర్మీ ప్రకటించుకుంది. సిరియా రాజధాని దాని పరిసర ప్రాంతాల్లో తూర్పు ఘౌటా ప్రాంతానికి చెందిన తిరుగుబాటు గ్రూపులు దాడులకు పాల్పడటాన్ని ఐరాస ఖండించింది. డమాస్కస్‌లోను, పరిసర గ్రామీణ ప్రాంతాల్లోనూ గత కొద్ది గంటల వ్యవధిలో 40కి పైగా హోవిట్జర్ శతఘ్నులను తిరుగుబాటుదారులు ప్రయోగించారని సిరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.


వేర్పాటువాద నేత అరెస్ట్‌కు

స్పెయిన్ కోర్టు ఆదేశాలు

మాడ్రిడ్: స్విట్లర్లాండ్‌లో ప్రవాసముంటున్న వేర్పాటువాద నేత, మాజీ ఎంపీ అన్నా గాబ్రియేల్‌ను అదుపులోకి తీసుకోవాలని స్పెయిన్ కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాటలోనియాకు స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన నిరసనకారులకు గాబ్రియేల్ మద్దతిస్తున్నారు. దీంతో, ఆమెను అరెస్ట్ చేయాలని స్పెయిన్ ప్రభుత్వం ప్రయత్నించింది. అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ఆమె స్విట్జర్లాండ్‌కు వెళ్లి అక్కడే ప్రవాసముంటున్నారు. ఈ కేసు విచారణకు సంబంధించి కోర్టు పంపిన సమ్మన్లపై గాబ్రియేల్ స్పందించలేదు. దీంతో, న్యాయస్థానం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. గాబ్రియేల్‌పై అరెస్ట్ వారెంట్ జారీ చేయటంతో పాటు ఆమెను స్వదేశానికి తిప్పి పంపాలని స్విస్ అధికారులను కోరాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు న్యాయమూర్తిని అభ్యర్థించారు.

13న రాష్ట్ర బంద్

- ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని డిమాండ్
- మాదిగ ఉపకులాల పట్ల బీజేపీ మోసం : ఎమ్మార్పీఎస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలని కోరుతూ మార్చి 13న రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ ప్రకటించింది. మాదిగ ఉప కులాలకు బీజేపీ మోసం చేసిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 24 సంవత్సరాలుగా ఎమార్పీఎస్ చేస్తున్న పోరాటంలో 24 గంటల పాటు బంద్‌కు పిలుపు నివ్వడం ఇదే తొలిసారి అని చెప్పారు.

దళితుల్లోని అన్ని కులాలకు రిజర్వేషన్ల ఫలాలు దక్కాలన్న ఉద్దేశంతో గత 24 ఏండ్లుగా పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్లనే బంద్ చేయాలిసి వస్తున్నదని చెప్పారు. దళితులందరూ ఒక్కటే అనే భావనలో ప్రభుత్వాలు ఉన్నాయని, కానీ దళితుల్లోని రెండు కులాల మధ్య కూడా సాంఘిక, ఆర్థిక, విద్య, రాజకీయపరమైన అంశాల్లో అసమానతలు ఉన్నాయ న్నారు. వర్గీకరణకు కమిషన్లు, అసెంబ్లీలో తీర్మానాలు అనుకూ లంగా ఉన్నా ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే వర్గీకణలో జాప్యం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. యూపీఏ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు బిల్లు పెడితే మద్దతు ఇస్తామన్న బీజేపీ అధికారంలోకి వచ్చి నాలుగేండ్లు అవుతున్నా వర్గీకరణ గురించి మాట్లాడటక పోవడం శోచనీయమన్నారు. మాదిగ ఉపకులాలకు బీజేపీ చేసిన నమ్మకద్రోహానికి నిరసనగా ఎమ్మార్పీఎస్ తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో రుద్రవరం లింగస్వామితో పాటు తదితర ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ నాయకుల వసూళ్ల పర్వం

- 60 మంది నిరుద్యోగుల వద్ద.. డబ్బులు వసూలు చేసిన టీఆర్ఎస్ నాయకులు : సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-క్లాక్‌టవర్

ఉద్యోగాలిప్పిస్తామని కొందరు టీఆర్ఎస్ నాయకులు నిరుద్యోగుల నుంచి వసూళ్ల పర్వానికి పాల్పడుతున్నారని సీఎల్పీ ఉపనేత, నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖలో ఆపరేటర్ ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి కొంత మంది టీఆర్ఎస్ నాయకులు 60 మంది నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.5 లక్షల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు.

కనగల్ మండలానికి చెందిన ఆవుల శంకర్, పాలకూరి నగేశ్ వద్ద రూ.5లక్షల చొప్పున వసూలు చేశారని చెప్పారు. విద్యుత్ శాఖ మంత్రి సొంత జిల్లాలోనే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని అన్నారు.

మంత్రి జగదీశ్‌రెడ్డి చొరవ తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సంకు ధనలక్ష్మి, మండలాధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

హరీష్ శంకర్ సీటీమార్



హరీష్‌శంకర్, కృష్ణ

'గబ్బర్ సింగ్', 'దువ్వాడ జగన్నాథమ్' వంటి హిట్ చిత్రాలను రూపొందించిన దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వంలో త్వరలో 'సీటీమార్' పేరుతో ఓ సినిమా తెరకెక్కనుంది. 'జవాన్' చిత్రాన్ని నిర్మించిన అరుణాచల్ క్రియేషన్స్ పతాకంపై కొమ్మలపాటి కృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా గురించి చిత్ర బృందం తెలియజేస్తూ, 'అల్లు అర్జున్ హీరోగా, హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'దువ్వాడ జగన్నాథమ్' చిత్రంలోని 'సీటీ మార్.. సీటీ మార్..' అనే సాంగ్ ఎంతగా పాపులర్ అయ్యిందో తెలిసిందే. ఈ పాటలోని 'సీటీమార్' పదాన్ని టైటిల్‌గా హరీష్ శంకర్ తన నెక్ట్స్ సినిమాను రూపొందించబోతున్నారు. ప్రస్తుతం ఆయన దిల్‌రాజు బ్యానర్‌లో 'దాగుడుమూతలు' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇది స్క్రిప్ట్ వర్క్‌లో ఉంది. ఇది పూర్తి కాగానే 'సీటీమార్' ఉంటుంది. వరుస హిట్స్‌లో ఉన్న ఓ యువ కథానాయకుడు ఇందులో హీరోగా నటించనున్నారు. ఆ వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి' అని తెలిపింది.



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, వి.వి.వినాయక్

నయా రొమాంటిక్ థ్రిల్లర్ షురూ..

నూతన దర్శకుడు శ్రీనివాస్ దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఓ సినిమాలో నటిస్తున్నారు. వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ శొంఠినేని(నాని) నిర్మిస్తున్న ఈ నూతన చిత్రం గురువారం రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. హీరోపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వి.వి.వినాయక్ క్లాప్‌నివ్వగా, గురజాల ఎమ్మెల్యే యరపతనేని శ్రీనివాసరావు కెమెరా స్విచాన్ చేశారు. తెలంగాణ ఎఫ్.డి.సి.చైర్మెన్ రామ్మోహనరావు గౌరవ దర్శకత్వం వహించారు. మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సంయుక్తంగా స్క్రిప్ట్ అందించారు. ఈ సందర్భంగా హీరో సాయి శ్రీనివాస్ చెబుతూ, 'నవీన్‌తో కలిసి సినిమా చేద్దామని చాలా రోజులుగా స్క్రిప్ట్స్ వింటున్నాం. శ్రీనివాస్ చెప్పిన కథ నచ్చడంతో ప్రాజెక్ట్ ఓకే అయ్యింది. ఇంత వరకు తెలుగు చిత్ర పరిశ్రమలోనే రానటువంటి ఓ కొత్త జోనర్‌లో ఈ సినిమా ఉంటుంది. థమన్‌తో ఫస్ట్‌టైమ్ పనిచేస్తున్నాను. ప్రేక్షకులకిది కొత్త అనుభూతినిస్తుంది' అని చెప్పారు. 'నన్ను, నా కథని నమ్మి సినిమా చేయడానికి ముందుకు వచ్చిన బెల్లంకొండ శ్రీనివాస్, సురేష్, నిర్మాత నవీన్‌లకు థ్యాంక్స్. రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రమిది. మార్చి 2 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపనున్నాం. ఇందులో ఇద్దరు కథానాయికలుంటాయి. ప్రస్తుతం ఆడిషన్ జరుగుతోంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని చిత్ర దర్శకుడు శ్రీనివాస్ తెలిపారు. 'మా బ్యానర్‌లో వస్తున్న తొలి చిత్రమిది. డిఫరెంట్ సబ్జెక్ట్‌తో వస్తుందనే ఆనందంగా ఉంది. ఆదరించాలని కోరుకుంటున్నాం' అని నిర్మాత తెలిపారు.



అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయెల్



మహేష్‌బాబు

శుభపరిణామం..

ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను..'
మే 4న 'నా పేరు సూర్య..'

మహేష్ నటించిన 'భరత్ అనే నేను', అల్లు అర్జున్ 'నా పేరు సూర్య' సినిమాలను ఏప్రిల్ 26నే విడుదల చేయనున్నట్టు గతంలో నిర్మాతలు ప్రకటించిన విషయం విదితమే. ఒకేరోజు రెండు భారీ చిత్రాలు విడుదలైతే అది నిర్మాతలకు, ఇండస్ట్రీకి మంచిది కాదనే విషయాన్ని గమనించిన సినీ పెద్దలు దిల్ రాజు, కె.ఎల్.నారాయణ, నాగబాబు సమక్షంలో ఈ రెండు చిత్రాల నిర్మాతలు ప్రత్యక్షంగా సమావేశం అయ్యారు. రెండు భారీ చిత్రాలు ఒక రోజు విడుదలవ్వడం ఇండస్ట్రీకి శ్రేయస్కరం కాదని భావించిన వీరు ఒక అవగాహన ఒప్పందానికి వచ్చి, విడుదల తేదీలను మార్చారు. ఇందులో భాగంగా 'భరత్ అనే నేను..' వారం ముందుగా విడుదలవుతుండగా, 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' వారం రోజులు వెనక్కి వెళ్ళి విడుదల చేసేందుకు నిర్మాతలు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా నిర్మాతలు డి.వి.వి.దానయ్య, లగడపాటి శ్రీదర్, బన్నీ వాసు మాట్లాడుతూ, 'ఈ రెండు భారీ చిత్రాల మధ్య కనీసం రెండు వారాలు గ్యాప్ ఉండాలన్న ఉద్దేశంతో ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను', మే 4న 'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా' చిత్రాల్ని విడుదల చేయాలని నిర్ణయించాం. ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలన్న అభిప్రాయంతో తీసుకున్న ఈ నిర్ణయాన్ని సపోర్ట్ చేసిన మా హీరోలకు, దర్శకులకు, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అని అన్నారు. ఈ నేపథ్యంలో సినీ పెద్దలు దిల్‌రాజు. డా.కె.ఎల్.నారాయణ, నాగబాబు మాట్లాడుతూ, 'సంక్రాంతి సీజన్‌ని మినహాయిస్తే మిగిలిన సందర్భాల్లో రెండు భారీ చిత్రాల మధ్య ఇలా రెండు వారాలు గ్యాప్ ఇచ్చి రిలీజ్ డేట్స్ ప్లాన్ చేయడం వల్ల పరిశ్రమకు ఎంతో మేలు జరుగుతుంది. 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య' నిర్మాతల మధ్య మంచి అండర్‌స్టాండింగ్ కుదరడం ఓ శుభపరిణామంగా భావిస్తున్నాం' అని తెలిపారు.



అదితిరావు హైదరీ, సుధీర్‌బాబు

నవతరం ప్రేమ కథ..
సమ్మోహనం

సుధీర్‌బాబు, అదితిరావు హైదరీ హీరోహీరోయిన్లుగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్న నూతన చిత్రానికి 'సమ్మోహనం' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ, "సమ్మోహనం' అంటే మంత్రముగ్దుల్ని చేసే ఒక అందమైన ఆకర్షణ. మ్యాజికల్ ఎట్రాక్షన్. మా చిత్రంలో హీరోహీరోయిన్ల మధ్య సమ్మోహనకరమైన రొమాన్స్ ఉండటంతోపాటు మిగతా పాత్రలకి ఉండే విభిన్నమైన ఆకర్షణలు మెప్పిస్తాయి. ఓ కొత్త పోకడ ఉన్న నవతరం ప్రేమ కథతో ఆద్యంతం హాస్యం, సజీవమైన కుటుంబ బంధాలు, ఉద్వేగభరిత సన్నివేశాల సమాహారంగా ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు. 'కథకు యాప్ట్‌గా నిలిచే టైటిల్ ఇది. ఇప్పటి వరకు మూడు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. గురువారం నుంచి మార్చి 3 వరకు నాలుగో షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతుంది. దీంతో 80శాతం షూటింగ్ పూర్తవుతుంది. మార్చి 3వ వారం నుంచి ఏప్రిల్ 3 వరకూ హిమాచల్ ప్రదేశ్, ముంబయిలో షూటింగ్ చేస్తాం. ఇదొక ఫీల్‌గుడ్ సినిమా. ప్రేమ, వినోదం ప్రధాన ఆకర్షణలు. పూర్తి స్థాయి టెక్నికల్ వ్యాల్యూస్‌తో తెరకెక్కిస్తున్నాం. పీజీ విందా కెమెరా పనితనం సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. మే మూడో వారంలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ అన్నారు. వి.కె.నరేష్, తనికెళ్ల భరణి, పవిత్ర లోకేష్, రాహుల్ రామకృష్ణ నందు, అమిత్ పురోహిత్, కాదంబరి కిరణ్, హరితేజ్, కేదార్ శంకర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, ఎడిటర్: మార్తాండ్ కె.వెంకటేష్, ఆర్ట్: రవీందర్.



తాప్సీ



శ్రీకాంత్

ప్రస్తుతం కన్‌ఫ్యూజన్‌లో ఉన్నా..

'హీరోగా కొనసాగాలా లేక పూర్తి స్థాయి క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్ పాత్రలు చేయాలా? అనే సందిగ్ధంలో ఉన్నా' అని అంటున్నారు హీరో శ్రీకాంత్. ఆయన హీరోగా నటించిన చిత్రం 'రా..రా'. శ్రీమిత్ర చౌదరి, విజయ్ కుమార్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'ఫస్ట్‌టైమ్ నేను చేసిన హర్రర్ కామెడీ చిత్రమిది. చాలా కొత్తగా, పూర్తి స్థాయి వినోదాత్మకంగా ఉంటుంది. సెంటిమెంట్, ఫీల్‌తో కూడిన ఎమోషన్స్ ఉంటాయి. దెయ్యాలు మనుషులను చూసి భయపడటమనే కాన్సెప్ట్ కొత్తగా ఉంటుంది. నేను ఫెయిల్యూర్ డైరెక్టర్‌గా కనిపిస్తాను. హిట్ కోసం హర్రర్ సినిమా తీయాలనుకుంటాను. దెయ్యాల సినిమా తీసే క్రమంలో ఓ అమ్మాయితో ప్రేమలో పడతా. ఆమె దెయ్యమని తెలిశాక ఏం జరిగిందనేది సినిమాలో ఆసక్తికరం. ఈ చిత్రానికి మొదట ఓ దర్శకుడు డైరెక్ట్ చేశాడు. నిర్మాతలకు, దర్శకుడి మధ్య విభేదాలు తలెత్తడంతో అతను వైదొలిగాడు. నేను రాజీ కుదిర్చేందుకు ప్రయత్నించాను. కానీ కుదరలేదు. దీంతో మరో సీనియర్ డైరెక్టర్‌తో చేయించాం. పేరు చెప్పడం ఆయనకిష్టం లేదు. ప్రస్తుతం హీరోగా సినిమాలు చేస్తుండటంతో విలన్, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఒప్పుకోవడం లేదు. ప్రాధాన్యత కలిగిన మంచి పాత్రలు వస్తేనే చేస్తున్నా. కన్నడలో సుదీప్, శివరాజ్‌కుమార్‌లతో ఓ సినిమా చేస్తున్నా. విలన్ పాత్ర అది. 'యుద్ధం శరణం' తర్వాత కూడా విలన్‌గా చాలా ఆఫర్లు వచ్చాయి, కానీ నేనే చేయడం లేదు. నటుడికి సక్సెస్, ఫెయిల్యూర్స్ కామన్. జయాపజయాలను అన్నింటినీ ఎదుర్కోవాలి. కొందరు ఫెయిల్యూర్స్ కారణంగా, ఛాన్సులు లేకపోవడం కారణంగా ఇబ్బంది పడటం, ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇది కరెక్ట్ కాదు. రాణించేందుకు కష్టపడాలి. ఇక మా అబ్బాయిల విషయానికి వస్తే రోషన్ యాక్టింగ్‌లో డిప్లొమా చేస్తున్నాడు. మరో రెండేండ్ల వరకు సినిమాలు చేయడు. 'నిర్మల కాన్వెంట్' చేశాక 'ఎందుకు చేశామా' అనిపించింది. కానీ దాని వల్ల రోషన్‌కు నటనపై ఆసక్తి పెరిగింది. ఇక మా చిన్నబ్బాయి రోహన్ తెలుగు, తమిళం, హిందీలో ప్రభుదేవా నటించే చిత్రంలో నటిస్తున్నాడు. హర్రర్ ఎంటర్‌టైనర్ చిత్రమది. మూడు భాషల్లో అతనికి పేరొస్తుందని, వాడితో కలిసి నేను చేయాల్సిన ఓ సినిమాను శాక్రిఫై చేశాం. ప్రస్తుతం 'ఆపరేషన్ 2019' చిత్రంలో నటిస్తున్నాను. ఇందులో మంచు మనోజ్ గెస్ట్ రోల్ చేస్తున్నాడు' అని అన్నారు.

హైదరాబాద్ చరిత్ర నేపథ్యంలో..



సంపత్‌కుమారస్వామి, నిర్మల, మనోహర్ చిమ్మని, ప్రదీప్ చంద్ర తదితరులు

నూతన నటీనటులతో మనోహర్ చిమ్మని దర్శకత్వంలో పి.సి.క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న చిత్రం 'నమస్తే హైదరాబాద్'. ఈ సినిమా ద్వారా కొత్త సింగర్స్‌ను పరిచయం చేయడం కోసం సంగీత దర్శకుడు ప్రదీప్ చంద్ర ఆడిషన్ నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని గురువారం హైదరాబాద్‌లో అతిథులుగా విచ్చేసిన తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమారస్వామి చిలగాని, మహిళా అధ్యక్షురాలు, కోశాధికారి నిర్మల సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంపత్ కుమారస్వామి మాట్లాడుతూ, 'తెలంగాణ దర్శకుడు మనోహర్ చిమ్మని రూపొందిస్తున్న ఈ సినిమా ద్వారా నూతన నటీనటులను, గాయనీగాయకులను పరిచయం చేయడం అభినందనీయం. ఈ సినిమా అద్భుత విజయం సాధించాలి' అని అన్నారు. 'తెలంగాణ ఏర్పడ్డాక తెలంగాణ దర్శకుడిగా నేను రూపొందిస్తున్న పక్కా తెలంగాణ యూత్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. అంతర్లీనంగా సందేశం ఉంటుంది. ఎంతో మందిని ఎన్నో విధాలుగా ప్రభావితం చేసిన చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరం నేపథ్యంగా రూపొందిస్తున్న ఈ సినిమా కోసం తెలంగాణ నుంచి కొంత మంది కొత్త గాయనీగాయకులను కూడా పరిచయం చేయాలని భావించి ఈ ఆడిషన్ నిర్వహిస్తున్నాం' అని దర్శకుడు మనోహర్ చిమ్మని తెలిపారు. సంగీత దర్శకుడు ప్రదీప్ చంద్ర చెబుతూ, 'తెలంగాణ యువతలో మంచి సంగీత జ్ఞానం ఉన్నవాళ్లు ఎందరో ఉన్నారు. ఈ ఆడిషన్ కార్యక్రమం ద్వారా వారిలో కొందరినీ వెలికితీసి, ఈ సినిమా ద్వారా వెండితెరకు పరిచయం చేయబోతున్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వీరేంద్రలలిత్.

వాడేనా పాటలొచ్చాయ్..



నేహా దేశ్ పాండే, శివ తాండేల్

శివ తాండేల్, నేహా దేశ్ పాండే జంటగా సాయి సునీల్ నిమ్మల దర్శకత్వంలో నిర్మాణి ఫిల్మ్స్ పతాకంపై ఓం సాయి రామ్ సమర్పణలో మణిలాల్ మచ్చి అండ్ సన్స్ నిర్మిస్తున్న చిత్రం 'వాడేనా'. ఈ చిత్ర ఆడియో లాంచ్ బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథులుగా విచ్చేసిన రాజ్ కందుకూరి థియేట్రికల్ ట్రైలర్‌ను, ఎన్.శంకర్ పాటల సీడీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ, 'ట్రైలర్, పాటలు, ఆర్.ఆర్ చాలా బాగున్నాయి. టైటిల్ ఆసక్తికరంగా ఉంటే సినిమాపై క్యూరియాసిటీ పెరుగుతుంది. అదే సర్‌ప్రైజ్ ఎలిమెంట్ ఈ టైటిల్‌లో ఉందని భావిస్తున్నా. మనం తరచూ వాడే 'వాడేనా' పదం టైటిల్‌గా ఉన్న ఈచిత్రం కచ్చితంగా ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నా' అని అన్నారు. 'ఇది సైలెంట్‌గా వచ్చి హిట్ కొట్టే చిత్రమవుతుంది. టీమ్ అందరికీ మంచి పేరు తెచ్చిపెట్టాలి' అని రాజ్ కందుకూరి తెలిపారు. దర్శకుడు సాయి సునీల్ నిమ్మల మాట్లాడుతూ, 'దర్శకుడిగా ఎన్.శంకర్‌ని చూసి స్ఫూర్తి పొందా. 'పెళ్ళిచూపులు' చిత్రాన్ని 22 సార్లు చూసి ఎంతో నేర్చుకున్నా. సినిమాలో సెకండాఫ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దర్శకత్వంతోపాటు నాలుగు పాటలు రాశాను, కొరియోగ్రఫీ కూడా చేశా. నూతన నటీనటులు, సాంకేతిక నిపుణులు అని కాకుండా సినిమాలో విషయం ఉందా లేదా అన్నది ముఖ్యం. 'పెళ్ళి చూపులు' ఇదే విషయాన్ని నిరూపించింది. 'వాడేనా' కూడా మంచి విషయం ఉన్న సినిమాగా నిలిచిపోతుందని ఆశిస్తున్నా' అని చెప్పారు. 'పాటలు చాలా బాగా వచ్చాయి. దర్శకుడు వంద శాతం క్వాలిటీ ఔట్‌పుట్ ఇచ్చాడు. పెద్ద సినిమా మాదిరిగా కష్టపడ్డాం' అని నిర్మాత తెలిపారు.

ఇప్పటికీ..

'నేను స్టార్‌గా ఫీలవ్వడం లేదు. కెరీర్ పరంగా ఇప్పటికీ స్ట్రగుల్ పడుతూనే ఉన్నాను' అని అంటోంది తాప్సీ. 'పింక్', 'నామ్ షబానా', 'జుడ్వా 2' చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన తాప్సీని ఆయా చిత్రాల విజయాలు బాలీవుడ్‌లో స్టార్ స్టేటస్‌కి తీసుకెళ్ళాయి. అయినప్పటికీ తనకి స్టార్ అనే ఫీలింగ్ లేదని చెబుతోంది. ఓ మ్యాగజైన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తాప్సీ చెబుతూ, 'సినిమా కోసం నేను ఎక్కువగా హార్డ్ వర్క్ చేస్తాను. నేనెలా చేశానో ఫ్రైడే రోజు కనిపిస్తుంది. నన్ను చూసి ఆడియెన్స్ సినిమాకు వస్తారని నేననుకోవడం లేదు. అలా ఆడియెన్స్‌ను థియేటర్‌కి రప్పించడం కోసం ట్రై చేస్తున్నాను. నేను స్టార్ హీరోయిన్‌ని అనే భావన నాలో ఎంత మాత్రం లేదు. అన్ని రకాల సినిమాలు చేయాలనుకుంటాను. ఆ దిశగానే నా చిత్రాల ఎంపిక ఉంటుంది. మూస ధోరణిలో సినిమాలు చేయడం నాకిష్టం ఉండదు' అని తెలిపింది. ఇదిలా ఉంటే తాప్సీ, కృతి సనన్ కలిసి ప్రొఫెషనల్ షూటర్స్ ఆధారంగా తెరకెక్కే చిత్రంలో నటిస్తున్నారు. 'ఉమానియా' పేరుతో తెరకెక్కే ఈ చిత్రాన్ని ఫాంటమ్ ఫిల్మ్స్ పతాకంపై విక్రమాదిత్య మోత్వాని, మధు మంతెన, వికాస్ భాల్, అనురాగ్ కశ్యప్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఓ నూతన దర్శకుడు ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయనున్నారు. దీంతోపాటు తాప్సీ ప్రస్తుతం 'మాన్‌మర్జియాన్', 'ముల్క్', 'సూర్మ' చిత్రాల్లో నటిస్తోంది.



నర్గీస్ ఫక్రీ

భయపెడతా..

'రాక్‌స్టార్', 'మై తేరా హీరో', 'మద్రాస్ కేఫ్', 'అజార్', 'హౌస్‌ఫుల్ 3', 'బాంజో' చిత్రాలతో ప్రేక్షకులను విశేషంగా అలరించిన నర్గీస్ ఫక్రీ దాదాపు రెండేండ్ల విరామం తర్వాత వెండితెరపై మెరవనుంది. ఇందులో భాగంగా ఫస్ట్‌టైమ్ ఓ హర్రర్ చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 'రాగిణి ఎంఎంఎస్ 2', 'ఎలోన్' చిత్రాలను తెరకెక్కించిన భూషణ్ పటేల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'అమావాస్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో సచిన్ జోషి కథానాయకుడిగా నటిస్తున్నారు. లండన్‌లో ప్రారంభమైన ఈ చిత్రం దాదాపు 35 రోజుల షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. చిత్రీకరణ తుది దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. వికింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నర్గీస్ దీంతోపాటు 'రేస్ 3'లోనూ గెస్ట్‌గా నటిస్తోంది. అలాగే '5 వెడ్డింగ్స్', 'టార్బాజ్' చిత్రాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

మణిరత్నం నవాబ్‌లో..!



డయానా ఎరప్పా

మోడల్, 2011 – మిస్ ఇండియా కంటెస్టెంట్ డయానా ఎరప్పా బంపర్ ఆఫర్ అందుకుంది. మణిరత్నం చిత్రంలో నటించే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. మణిరత్నం ప్రస్తుతం 'నవాబ్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి, శింబు, అరుణ్ అర్జున్, అదితిరావు హైదరీ, ఐశ్వర్య రాజేష్, జ్యోతిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయికగా ఛాన్స్ రావడం పట్ల డయానా స్పందిస్తూ, 'ఆడిషన్ కోసం మణిరత్నం టీమ్ నుంచి కాల్ వస్తే ఫొటోస్ పంపించా. ఆడిషన్ ఇచ్చా. కొన్ని నెలలకు నేను సెలక్ట్ అయినట్టు కాల్ చేశారు. ఆ వార్తని నమ్మలేకపోయా. మణిరత్నంను కలిసినప్పుడు రెక్కలు వచ్చిన బట్టర్‌ఫ్లైలా గాల్లో ఎగిరినట్టుగా అనిపించింది. ఆడిషన్‌లో నా నటన ఆయన్ని బాగా ఇంప్రెస్ చేసిందని మణిరత్నం చెప్పడం చాలా హ్యాపీగా అనిపించింది' అని తెలిపింది.

జైపాల్‌రెడ్డివి క్రిమినల్ రాజకీయాలు

- నాగం రాకతో గ్రూపు రాజకీయాలు
- డికె అరుణమ్మ వల్లే జిల్లాల్లో కాంగ్రెస్ బతికుంది
- నాగర్‌కర్నూల్ నుంచి పార్టీ జెడ్పీటీసీకి టికెట్ ఇస్తే అభ్యంతరం లేదు : ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి వ్యాఖ్యలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో కేంద్ర మాజీ మంత్రి ఎస్ జైపాల్‌రెడ్డి క్రిమినల్ రాజకీయాలు నడుపుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ నేత నాగం జనార్ధన్‌రెడ్డిని పార్టీలోకి తీసుకోవద్దని తాము చెప్పినప్పటికీ ఆయనను జైపాల్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. నాగం వస్తే జిల్లాలో గ్రూపు రాజకీయాలు పెరుగుతాయన్నారు. నాగం విషయంలో అధిష్టానానికి తాము చెప్పాల్సింది చెప్పామన్నారు. గురువారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన ఇష్టాగోష్టిలో మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బతికి ఉందంటే అరుణమ్మనే కారణమన్నారు. జైపాల్‌రెడ్డి ఏనాడూ జిల్లా పార్టీ నేతలను పట్టించుకోలేదన్నారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ నా కొడుకుకే ఇవ్వాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ జెడ్పీటీసీ సభ్యురాలుకు ఇవ్వాలన్నారు. నాగంను చేర్చుకున్నా...తాము సహకరించబోమన్నారు. నాగర్‌కర్నూల్‌లో 20 ఏండ్లపాటు తాను నాగంతో పోరాడుతున్నామన్నారు. జైపాల్‌రెడ్డి, నాగం ఇద్దరూ కోవర్టులని, నాగంను జైపాల్‌రెడ్డి తీసుకొస్తున్నారని విమర్శించారు. ఒకవేళ నాగం కాంగ్రెస్‌లోకి వస్తే పార్టీకి నష్టమన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిచిన రోజే నాగం పార్టీలోకి వస్తే బాగుండేదని, ఇప్పుడు వచ్చినా ఆయనకు ఓట్లు పడే అవకాశం లేదన్నారు. ఇదే విషయాన్ని అధిష్టానానికి, ఉత్తమ్‌కూ వివరించినట్టు తెలిపారు. నా పుట్టుకే కాంగ్రెస్‌కు వ్యతిరేకం అన్న నాగంని ఎలా తీసుకుంటారో పార్టీ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలో సర్వే చేయించి ఎవరినీ తీసుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు. డికె అరుణను నమ్ముకున్న కార్యకర్తలను దెబ్బతీయాలని పార్టీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. నాగం లాంటి వారిని పార్టీలో చేర్చుకుంటే కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకులు ఆత్మస్థైర్యం కోల్పోతారని ఆయన హెచ్చరించారు.

సోహ్రాబుద్దీన్ కేసులో ఆధారాలు సమర్పించడంలో..

సీబీఐ విఫలమవుతోందని బోంబే హైకోర్టు మండిపాటు

ముంబయి: నకిలీ ఎన్‌కౌంటర్‌గా అనుమానాలున్న సోహ్రాబుద్దీన్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ తీరును బోంబే హైకోర్టు తప్పు పట్టింది. నిందితులపై ఆధారాలను రికార్డెడ్‌గా కోర్టు ముందుంచడం దర్యాప్తు సంస్థ ప్రాథమిక బాధ్యత అని బోంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రేవతి మోహితే డేరే గుర్తు చేశారు. సోహ్రాబుద్దీన్ సోదరుడు రుబాబుద్దీన్ షేక్ వేసిన మూడు రివిజన్ పిటిషన్లపై ఈ నెల 9 నుంచి జస్టిస్ రేవతి విచారిస్తున్నారు. బుధవారం(ఈ నెల 21న) విచారణ సందర్భంగా సీబీఐ నుంచి తగినంత సహకారం అందటంలేదని జస్టిస్ రేవతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేసులోని నిందితులైన గుజరాత్ మాజీ డీఐజీ డిజి వంజారా, రాజస్థాన్ ఐపీఎస్ అధికారి దినేశ్ ఎంఎన్, గుజరాత్ ఐపీఎస్ అధికారి రాజ్‌కుమార్ పాండ్యన్‌ను విచారణ నుంచి తప్పించడాన్ని రుబాబుద్దీన్ ప్రశ్నించారు. సోహ్రాబుద్దీన్ దంపతులను హైదరాబాద్(తెలంగాణ) నుంచి పట్టుకుపోవడంలో గుజరాత్ ఏటీఎస్ బృందానికి నేతృత్వం వహించిన పాండ్యన్ కీలక పాత్ర వహించినట్టు ఆరోపణలున్నాయి. సాక్ష్యులను పాండ్యన్ బెదిరిండం వల్లే మాట మార్చారని రుబాబుద్దీన్ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. సీబీఐ వేసిన రెండు పిటిషన్లపైనా హైకోర్టు విచారిస్తోంది. ఈ కేసు నుంచి రాజస్థాన్ పోలీస్ కానిస్టేబుల్ దల్పత్‌సింగ్ రాథోడ్, గుజరాత్ కానిస్టేబుల్ ఎన్‌కె అమీన్‌ను విచారణ నుంచి తప్పించడాన్ని సీబీఐ సవాల్ చేస్తోంది. ఈ నెల 12న విచారణ సందర్భంగా కొందరు సాక్ష్యులు మాట మార్చడంపైనా జస్టిస్ రేవతి సీబీఐని నిలదీశారు. ఈ కేసు విచారణ పట్ల శ్రద్ధ కనపరిచే విధానం ఇదేనా అంటూ సీబీఐ తీరును జస్టిస్ రేవతి ప్రశ్నించారు. సాక్ష్యులకు రక్షణ కల్పించడంపై దృష్టి సారించాలని సీబీఐకి సూచించారు.

2005 నవంబర్‌లో సోహ్రాబుద్దీన్ షేక్, ఆయన భార్య కౌసరీబీని గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేసి, కస్టడీలో ఉండగా హత్యగావించి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లినట్టు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

'మిర్చి' మంటలు

నవతెలంగాణ-నయాబజార్

మిర్చి పంటకు గతేడాది పరిస్థితి పునరావృతమవుతోంది. రైతు పంట మార్కెట్‌కు తెచ్చే సమయానికి ధర పతనమవుతోంది. రెండు మూడు రోజులుగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి భారీగా వస్తోంది. దీంతో ఇటీవల క్వింటాలుకు రూ.11,300 వరకు పలికిన మిర్చి ధర గురువారం ఒక్కసారిగా పతనమైంది. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. వారి ఆందోళనకు పలు పార్టీల నాయకులు మద్దతుగా నిలిచారు. గురువారం ఒక్కరోజే కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జయశంకర్, కృష్ణా జిల్లాల నుంచి రైతులు 75వేల బస్తాల మిర్చి మార్కెట్‌కు వచ్చింది. దీంతో దళారులు, వ్యాపారులు కుమ్మక్కై క్వింటాలుకు మూడు వేల రూపాయలు తగ్గించారు. ముందుగా జెండాపాట రూ.9700గా ప్రకటించారు. అనంతరం పెద్ద మొత్తంలో మార్కెట్‌కు మిర్చి రావడంతో ఇదే అదనుగా భావించిన వ్యాపారులు, దళారులు ఒక్కటై క్వింటాలుకు రూ.8500, 7900, 7000 ఇలా తమ ఇష్టారీతిన ధర తగ్గిస్తూ కొనుగోళ్లు జరిపారు. దాంతో ఒకే నాణ్యత కలిగిన పంటకు ఇంత తేడా ఏంటని రైతులు నిలదీశారు. మార్కెట్‌లో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, టీడీపీ నాయకులు మార్కెట్‌కు చేరుకుని మిర్చి రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేసేవరకు కొనుగోళ్లు జరగనియ్యబోమని తేల్చిచెప్పారు. మార్కెటింగ్ అధికారి సంతోష్‌కుమార్‌ను నిలదీశారు. ఆర్డీవో పూర్ణచంద్రరావు, డీసీపీ కొల్లు సురేష్‌కుమార్ విజ్ఞప్తి మేరకు ఆందోళన విరమించి చర్చలకు వెళ్లారు. చర్చల్లో ఆర్డీవో, డీసీపీ, మిర్చి ఖరీదుదారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు రూ.7వేల నుంచి రూ.8,900వరకు ఎంత మంది రైతుల పంట కొనుగోలు చేశారో ఆ రైతులకు ప్రతి క్వింటాలుకు రూ.200 అదనంగా ధర చెల్లించాలని నిర్ణయించి తీర్మానించారు. అనంతరం మధ్యాహ్నం 2:30గంటల సమయంలో కాంటాలు మొదలు పెట్టారు.

ఇది దుర్మార్గ చర్య : సీపీఐ(ఎం)

రైతుల ఆందోళన సందర్భంగా మార్కెట్‌కు వచ్చిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ఇదేనా లభించే మద్దతు ధరని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో దళారుల ప్రమేయాన్ని అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి వ్యాపారుల మాయలకు చెక్‌పెట్టాలన్నారు. క్వింటా మిర్చి రూ.12వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

మతం ముసుగులో దళితులపై దాడి

- ఎస్సీల పాస్టర్‌తో ప్రార్థన చేయించారని గొడవ
- గ్రామస్తుల మధ్య చిచ్చు పెట్టిన యూత్ సభ్యులు
- దళిత మహిళా సర్పంచ్‌పైనా వివక్షే
- మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలో ఘటన

నవతెలంగాణ-కౌడిపల్లి

దేశ భవిష్యత్తును నిర్దేశించేది యువకులు.. అలాంటి వారు మతం పేరుతో గ్రామస్తుల మధ్య చిచ్చు పెట్టారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి గ్రామంలో యూత్ సభ్యులు దళితులపై దాడి చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి ఆ గ్రామాన్ని సీపీఐ(ఎం), కేవీపీఎస్ నాయకులు సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ ఘటనపై బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...

దేశ భవిష్యత్తును నిర్దేశించేది యువకులు.. అలాంటి వారు మతం పేరుతో గ్రామస్తుల మధ్య చిచ్చు పెట్టారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి గ్రామంలో యూత్ సభ్యులు దళితులపై దాడి చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి ఆ గ్రామాన్ని సీపీఐ(ఎం), కేవీపీఎస్ నాయకులు సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ ఘటనపై బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...

తునికి గ్రామ జనాభా 3260వేలు. 2500పైగా ఓటర్లు. బీసీలు 2వేలు, ఎస్సీలు 500, ఎస్టీలు 600, ఓసీలు 100, మైనారిటీలు 60మంది ఉంటారు. ఇప్పటివరకు గ్రామంలో కులమతాల గొడవ లేమీ లేవు. మొన్నటివరకు అందరూ కలిసి మెలసి ఉన్నారు. ఇటీవల గ్రామంలోని యువజన సంఘాల సభ్యులు మత ఘర్షణలకు తెరలేపారు. బేస్త కిషన్, వెంకటమ్మకు నాలుగేండ్లుగా ఆరోగ్యం బాలేదు. వెంకటమ్మ ప్రతి ఆదివారం నర్సాపూర్‌లోని చర్చికి పోతోంది. ఈ క్రమంలో గత ఆదివారం ఇంటికి పాస్టర్‌ను పిలుచుకుని ప్రార్థనలు చేయించింది. దాంతో అదే గ్రామానికి చెందిన శివాజీ, యంగ్ ఇండియన్, ఛత్రపతి యువజన సంఘాలకు చెందిన యువకులు వెంకటమ్మ ఇంటి వద్దకు పోయారు. 'మాల మాదిగ ఫాస్టర్లను మన ఇండ్లల్లోకి తీసుకొచ్చి ప్రార్థనలు చేయిస్తావా?. నీవు ఆ మాలమాదిగోల్ల దేవుళ్లను నమ్ముతావా?' అంటూ భార్యాభర్తలపై దాడి చేశారు. అడ్డొచ్చిన వారి కొడుకునూ కొట్టారు. దీనిపై గ్రామంలో మంగళవారం పంచాయితీ పెట్టారు. ఆ యువకులను గ్రామ పెద్దలు మందలించారు. పెద్దలు మాట్లాడుతుండగానే యూత్ సభ్యులు పదేపదే మాలమాదిగోల్ల దేవుడు అనడంతో దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా కులం పేరు పెట్టి అనొద్దు. మాకు నచ్చిన దేవుడిని మేం మొక్కుతాం' అనడంతో యూత్ సభ్యులు దళితులను బూతులు తిడుతూ దాడి చేశారు. దాంతో దళిత యువకులు రాజు, రవి, బేగరి సత్తయ్యకు గాయాలయ్యాయి. అనంతరం ఇరు గ్రూపుల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురిపైనా కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఈ విషయమే కాదు, యూత్ సభ్యులు దళిత మహిళ అయిన సర్పంచ్‌ను కూడా వేధిస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. కొంతమంది పనిగట్టుకుని ఆమెను సోషల్ మీడియాలో అవమానించే విధంగా మెసేజ్‌లు పోస్టు చేస్తున్నట్టు సమాచారం.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం

దళితులను కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. దాంతోపాటు సర్పంచ్ దళితురాలు కాబట్టి చిన్నచూపు చూస్తున్నారు. కొంత మంది ఆమెను ఇబ్బంది పెట్టే విధంగా ప్రవర్తిస్తున్నారు. సంబంధం లేని పోస్టులను సోషల్ మీడియాలో పెట్టి ఇక్కట్లకు గురిచేస్తున్నారు. వారిపైనా కేసులు నమోదు చేయాలి. లేదంటే ఆందోళనలు చేపడతాం.

ఉద్దేశపూర్వకంగానే దాడి..
కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్

మతం ముసుగులో దళితులపై దాడి దారుణం. నిందితులను కఠినంగా శిక్షించాలి. ఈ దాడి ఉద్దేశపూర్వకంగా చేసినట్టే ఉంది. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరుగుతున్నాయి. రాజ్యాంగం ప్రకారం అందరికీ అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ అవి పొందడంలో దళితులకు అందని ద్రాక్షగా మారింది. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఈ ఘటనపై విచారణ చేపట్టాలి.

నీకు రూ.60 లక్షలు ఇస్తాం.. ఆత్మహత్య చేసుకుంటావా?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డబ్బుల కోసమే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే..నీకు రూ. 60 లక్షలు ఇస్తాం.. ఆత్మహత్య చేసుకుంటావా? అని (రిటైర్డ్) జస్టిస్ చంద్రకుమార్ ప్రశ్నించారు. రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారో తెలుసుకోకుండా వారి గురించి హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి వ్యాఖ్యానించడం సరి కాదన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడం వల్లనే అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సంవత్సరం పత్తి వెయొద్దని ప్రచారం చేయడం వల్ల రైతులు కంది పంట వైపు మొగ్గు చూపారు.. సుమారు 7.28 లక్షల ఎకరాల్లో కంది పంట వేస్తే 2.64 లక్షలు కందుల దిగుబడి వచ్చింది. కంది పంటకు కనీస మద్దతు ధర రూ.5,500 నిర్ణయించిన ప్రభుత్వం రైతుకు మాత్రం రూ.4వేలకు మించి ఇవ్వలేదన్నారు. వ్యవసాయ మార్కెట్లలో రైతాంగం నిలువు దోపిడికి గురవుతున్నారని తెలిపారు. పెట్టుబడి పథకం సంపన్న రైతులకే లాభం చేకూరుస్తుందని, సామాన్య రైతులకు ఎలాంటి లాభం ఉండదని చెప్పారు.

ఉన్మాది ఘాతుకం...

నవతెలంగాణ-బోనకల్

ప్రేమను నిరాకరించినందుకు ఓ ఉన్మాది ఘాతుకానికి పాల్పడ్డాడు. యువతిపై కత్తితో దాడిచేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ యువతి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో గురువారం జరిగింది. బాధితురాలి వివరాల ప్రకారం... బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన మన్నెం యమున బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన కోలా రామలింగం కొన్ని నెలలుగా ప్రేమించాలంటూ ఆమెను వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక యమున విషయాన్ని తల్లిదండ్రులైన లక్ష్మీ, అంజయ్యకు తెలిపింది. వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసులు కేసు నమోదు చేసి రామలింగంను నెలరోజుల పాటు జైల్లో పెట్టారు. బెయిల్‌పై బయటకు వచ్చిన రామలింగం పది రోజుల తర్వాత యమునపై మళ్లీ వేధింపులకు దిగాడు. వేధింపులు తాళలేక బాధితురాలి తల్లిదండ్రులు యమునను చదువు మాన్పించి ఇంటి వద్దే ఉంచుతున్నారు. ఈ విషయమై వారం కిందట వారు మళ్లీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో యమున గురువారం ఒంటరిగా ఉన్న సమయంలో అక్కడికి వచ్చిన రామలింగం ఆమెతో ఘర్షణ పడ్డాడు. చంపుతానంటూ బెదిరించాడు. యమున తిరస్కరించడంతో వెంట తెచ్చుకున్న కత్తితో పొట్ట, ఛాతి భాగంలో పొడిచాడు. బాధితురాలి కేకలు విన్న స్థానికులు అక్కడకు వచ్చి ఆమెను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఆలేటి ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలిని పరామర్శించి, పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కత్తి పోటు బలంగా దిగడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రామలింగం పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది. ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యమునను వైరా ఏసీపీ దాసరి ప్రసన్నకుమార్ పరామర్శించారు. యమున పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రేమోన్మాది ఓ బాలికపై కత్తితో దాడి చేయడాన్ని నిరసిస్తూ పీవైఎల్, పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మంలోని గట్టయ్య సెంటర్‌లో దిష్టిబొమ్మ దహనం చేశారు.

కార్పొరేట్ ఆత్మహత్యలపై..

(మొదటిపేజీ తరువాయి)

మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, అరకొర సౌకర్యాలతో యాజమాన్యాలు విద్యా సంస్థలను నడుపుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయా కాలేజీలపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో రెండు నెలల్లో దాదాపు 50 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనల వివరాలను, అలాగే ఆయా కాలేజీల్లో సౌకర్యాలు లేమికి సంబంధించిన వివిధ వార్తా పత్రికల్లో వచ్చిన పేపర్ కటింగ్స్‌ను ఎన్‌హెచ్‌ఆర్సీకి అందజేశారు. దీనిపై స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్సీ నాలుగు వారాల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఇరు రాష్ట్రాల సిఎస్‌లకు ఆదేశించింది.

పని చేయని ఏజెన్సీలను తొలగించండి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన చర్చించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవటం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు పాలమూరు జిల్లాలో తాను పర్యటించనున్నట్టు మంత్రి ప్రకటించారు. శుక్రవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లాకలెక్టరేట్ లో పాలమూరు ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల పనులకు చెందిన భూసేకరణ, ఇసుక సమస్య , తదితర అంశాలను ఈ సమావేశంలో చర్చిస్తానని మంత్రి తెలిపారు. నాలుగు ప్రాజెక్టుల కోసం అవసరమైన భూసేకరణ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల పనులను షెడ్యూల్ ప్రకారం చేయకుండా జాప్యం చేస్తున్న ఏజెన్సీల పై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పాలమూరు ఆన్ గోయింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నత్త నడకన పని చేస్తున్న ఏజెన్సీలను గుర్తించి ఆయా ఏజెన్సీలను 60 సి నిబంధన కింద తొలగించి చేసి వేరే ఏజెన్సీలకు పనులు అప్పగించాలని కోరారు. కల్వకుర్తి నుంచి నీటి విడుదల కొనసాగుతున్నందున గత మూడు నెలలుగా నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడిందని ఇరిగేషన్ ఇంజనీర్లు మంత్రి ద ష్టికి తీసుకు వచ్చారు. ఈ నెలాఖరులో నీటి విడుదలను నిలిపి పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. కల్వకుర్తి లిఫ్ట్-3 లో నాలుగు పంపులు పనిచేస్తున్నాయని,5వ పంపు బిగింపు పనులను వేగవంతం చేసి మార్చి చివరికల్లా పూర్తి చేయాలని హరీశ్ రావు ఆదేశించారు. లిఫ్టు 2 నుంచి లిఫ్టు 3 వరకు తవ్విన టన్నెల్‌లో 1.2 కిలోమీటర్ల లైనింగ్ పనులను జూలై వరకు పూర్తి చేయాలన్నారు. జూలై తర్వాత ఏజెన్సీలకు గడువు పెంచేది లేదని మంత్రి స్పష్టం చేశారు. కాలువల కట్ట 2 మీటర్ల ఎత్తునకు పెంచే చర్యలు చేపట్టాలన్నారు. కాలువలలో పూడిక, ఇతర శిధిలాలను తొలగించడం వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అన్నారు. డి- 82 కాలువ తవ్వకం పనులన్నీ జూలై వరకు పూర్తి చేయాలని సూచించారు.

కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో పూర్తి ఆయకట్టుకు సాగునీరివ్వాలని మంత్రి ఆదేశించారు. .కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల కింద ఇప్పటికే 5 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నట్టు మంత్రి చెప్పారు. కల్వకుర్తి నుంచి 3.75 లక్షల ఎకరాలకు గాను 2.50 లక్షల ఎకరాలకు, .బీమా కింద 2 లక్షల 3 వేల ఎకరాలకు గాను 1 లక్ష ఎకరాలకు సాగునీరిచ్చినట్టు ఆయన చెప్పారు.నెట్టెంపాడు కింద 2 లక్షల ఎకరాలకు గాను 1 లక్ష ఎకరాలకు, కోయిల్ సాగర్ కింద 50 వేల ఎకరాలకు గాను 20 వేల ఎకరాలకు సాగునీరందిన్చినట్టు మంత్రి తెలిపారు.

అచ్చంపేట అసెంబ్లీ నియోజక వర్గంలో 15 వేల ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశంతో తలపెట్టనున్న చంద్రసాగర్ ఎక్స్‌టెన్షన్ కెనాల్ నిర్మాణ పనుల ఆమోదానికి ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు.

'రైతు' కార్పొరేషన్ చైర్మెన్‌గా గుత్తా !

(మొదటిపేజీ తరువాయి)

సమితుల మాదిరిగానే త్వరలోనే జిల్లా, రాష్ట్ర స్థాయి రైతు సమన్వయ సమితులు ఏర్పాటవుతాయని వెల్లడించారు. రైతు సమన్వయ సమితుల నిర్మాణం, విధులు, బాధ్యతలను నిర్ణయించడంతో పాటు, ఈ నెల 25,26 తేదీల్లో నిర్వహించే ప్రాంతీయ సదస్సులపై గురువారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. కార్పొరేషన్ చైర్మెన్‌గా ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఖరారు చేసినట్టు తెలిసింది. ఉగాది పండుగను పురస్కరించుకుని ఉత్తర్వులు జారీ చేయడంతో, అదే రోజు ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం. రైతు సమన్వయ సమితుల్లో కనీసం 51 శాతం మంది బలహీన వర్గాలు, మహిళలు ఉండేలా నిర్మాణం జరుగుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ఈ నెల 25, 26 తేదీల్లో సదస్సుల్లో మండల రైతు సమన్వయ సమితి సభ్యులతో పాటు ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్ పర్సన్లు హాజరు కావాలని సీఎం చెప్పారు. రైతులు పరస్పరం తమ అభిప్రాయాలు పంచుకోవడం కోసం, నిరంతర అవగాహన సదస్సులు నిర్వహించడం కోసం ప్రతీ ఐదు వేల ఎకరాలకు ఒకటి చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 2,630 రైతు వేదికలు నిర్మించనున్నట్టు సీఎం తెలిపారు. రైతు వేదికల నిర్వహణ బాధ్యతలను మండల రైతు సమన్వయ సమితులు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూముల నుంచి గానీ, దాతల నుంచి గానీ, కొనుగోలు ద్వారా గానీ రైతు వేదికల కోసం స్థలం సేకరించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు పోచారం శ్రీనివాస రెడ్డి, ఈటల రాజెందర్, ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, మండలిలో విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మెన్ వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీలు బి.వినోద్ కుమార్, గుత్తా సుఖేందర్ రెడ్డి, బాల్క సుమన్, అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శులు ఎస్.నర్సింగ్‌రావు, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. కాగా రాష్ట్ర గవర్నర్ నరసింహన్ మొదటిసారి ప్రగతి భవన్‌కు వచ్చారు. సీఎం సోదరి విమలాబాయి మరణ వార్త తెలుసుకొని కేసీఆర్‌ను గవర్నర్ పరామర్శించారు.

రాజధాని చుట్టూ అమానుషం

(మొదటిపేజీ తరువాయి)

వైద్య పరీక్షల నిమిత్తం తాండూరులోని జిల్లా ఆస్పత్రికి పంపించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం నేదునూర్ గ్రామానికి చెందిన వికలాంగురాలు పింఛన్ డబ్బులతో జీవనం కొనసాగిస్తోంది. పుట్టుకతోనే కాలు, చేయి పని చేయదు. అదే గ్రామానికి చెందిన గుమ్మడి వెంకట్‌రమణారెడ్డి బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె నోట్లో బట్టలు కుక్కి లైంగికదాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ భాస్కర్ తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ముచ్చర్ల నర్సింహ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కాళ్ల జంగయ్య, శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

జగన్ కేసులో మోడీకి చిక్కులు!

(మొదటిపేజీ తరువాయి)

చార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిలో మారిషస్‌కు చెందిన కరీసా ఇన్వెస్ట్‌మెంట్ ఎల్ఎల్‌సీ సంస్థ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కింద 49శాతం వాటాల రూపంలో.. మొత్తం రూ.115 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఓ సారి రూ.1.18కోట్లు, రెండో సారి రూ.14కోట్లు, మూడో సారి రూ.99కోట్ల పెట్టుబడులు పెట్టింది. సీబీఐ చార్జిషీట్ దాఖలు చేశాక..అప్పటి నుంచి ఇందూ టెక్ జోన్ పనులు నిలిచిపోయాయి. దీంతో పెట్టుబడులు పెట్టిన తాము మోసపోయామంటూ 50 మిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇప్పించాలని మారిషస్ ప్రభుత్వం నెదర్లాండ్స్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.ఇందులో భాగంగానే మారిషస్ ప్రభుత్వం భారత ప్రధాని నరేంద్ర మోడీకి కోర్టు నోటీసులు పంపినట్టు సమాచారం. ఆయనతో పాటు ఈ ఫిర్యాదులో కేంద్ర ఆర్థిక, న్యాయ, వాణిజ్య పన్నులు, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రుల పేర్లను కూడా ప్రతివాదులుగా చేర్చినట్టు తెలుస్తోంది.

ఆభరణాలతో రావొద్దు

(మొదటిపేజీ తరువాయి)

చేరుకోవాలని సూచించింది. మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంట నుంచి 1.45 గంటల వరకే చేరుకోవాల్సి ఉంటుందని తెలిపింది. అభ్యర్థులు విలువైన పరికరాలు, వ్యక్తిగత వస్తువులు, బంగారు ఆభరణాలతో పరీక్షా కేంద్రంలోకి హాజరుకావొద్దని కోరింది. అభ్యర్థులు మెహందీ, ఇంక్ వంటి బాహ్యపదార్థాలను చేతులు, పాదాలపై ఉపయోగించకూడదని తెలిపింది. ఇవి ఉంటే వేలిముద్ర, బయోమెట్రిక్ పరీక్షా కేంద్రంలో నమోదు కాదు. మొబైల్, సెల్యూలార్ ఫోన్, ట్యాబ్, పెన్‌డ్రైవ్లు, బ్లూటూత్ వంటి పరికరాలు, గడియారాలు, కాలిక్యులేటర్లు, లాగ్ పట్టికలు, పర్సు, నోట్ పుస్తకాలు, విడి పేపర్లు లేదా రికార్డింగ్ సాధనాలు అనుమతిం చబడవని పేర్కొంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డు పరీక్షా కేంద్రంలోకి తప్పనిసరిగా తీసుకురావాలని సూచించింది. హాల్‌టికెట్‌తోపాటు అసలైన గుర్తింపు కార్డు లేకుండా పరీక్షా కేంద్రంలోని అనుమతి ఉండదు. భద్రత కోసం అభ్యర్థి ఫొటో, ఎడమ బొటన వేలి ముద్రను తీసుకొని అసలు, నకిలీగా గుర్తిస్తారు. అభ్యర్థులు నిర్ణీత సమయం వరకు పరీక్షా కేంద్రం వదిలి వెళ్లేందుకు అనుమతి లేదు. పెన్, రఫ్ పేపర్లు ఇన్విజిలేటర్లకు తప్పక ఇచ్చి వెళ్లాల్సి ఉంటుంది. హాల్‌టికెట్‌లో ఫొటో సరిగా కనిపించకపోతే రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు పరీక్ష కేంద్రానికి తీసుకురావాలని అభ్యర్థులకు సూచించింది. అభ్యర్థికి కేటాయించిన కంప్యూటర్‌పై వ్యక్తిగత వివరాలు జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపింది. ఏవైనా వ్యత్యాసాలుంటే ఇన్విజిలేటర్ల దృష్టికి తేవాలని సూచించింది. పరీక్షా సమయంలో కీ బోర్డును తాకొద్దని, ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి మౌస్ ఉపయోగించాలని తెలిపింది. అభ్యర్థులు అవాంఛనీయ చర్యలకు పాల్పడొద్దని, నిబంధనలు, సూచనలు అతిక్రమించొద్దని పేర్కొంది. నిబంధనలు అతిక్రమిస్తే అభ్యర్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీఎస్‌పీఎస్సీ హెచ్చరించింది. అవసరమైతే అభ్యర్థి తదుపరి పరీక్షలు రాయకుండా నిషేధం విధించే అధికారం ఉందని తెలిపింది.

టీఆర్టీ పోస్టులు, అభ్యర్థులు వివరాలు

కేటగిరీ	పోస్టులు	అభ్యర్థులు
స్కూల్ అసో ఉపా(ఎస్ఏ)	1,941	1,45,158
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)	5,415	89,149
భాషాపండితులు (ఎల్‌పీ)	1,011	24,219
వ్యాయామ విద్య ఉపాధ్యాయులు (పీఈటీ)	416	16,871
స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎస్‌ఏపీఈ)	09	2,177
మొత్తం	8,792	2,77,574

ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్

టీఆర్టీ అభ్యర్థుల సమస్యలు, ఫిర్యాదులు పరిష్కరించేందుకు టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీఆర్టీ అభ్యర్థుల కోసం ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

అభ్యర్థులు ఏ సమస్య అయినా హెల్ప్‌డెస్క్ దృష్టికి తేవాలని కోరారు. 8333923740 నెంబర్‌కు ఫోన్ చేయాలని, లేదంటే helpdesk@tspsc.gov.in ఈమెయిల్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సదుపాయం ద్వారా అభ్యర్థులు తమ సమస్యలను త్వరగా పరిష్కరించుకోవాలని కోరారు. టీఆర్టీ అభ్యర్థులు సూచనల కోసం టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

హాల్‌టికెట్లలో మళ్లీ గందరగోళం

టీఆర్టీ అభ్యర్థులకు జారీ చేసే హాల్‌టికెట్లలో మళ్లీ గందరగోళం ఏర్పడింది. ఒక పోస్టుకు దరఖాస్తుచేస్తే మరో పోస్టు పేరుతో హాల్‌టికెట్లు వస్తున్నాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉషారాణి సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)కి దరఖాస్తు చేసింది. కానీ హాల్‌టికెట్‌లో మాత్రం ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పీఈటీ)కి దరఖాస్తు చేసినట్టుగా ఉంది. దీంతో ఆమె ఆందోళన చెందుతున్నది. తనకు న్యాయం చేయాలని టీఎస్‌పీఎస్సీని కోరుతున్నది.

జిల్లాల వారీగా ఉపాధ్యాయ పోస్టులు

జిల్లా	ఎల్‌పీ	పీఈటీ	ఎస్ఏ	ఎస్ఏపీఈ	ఎస్జీటీ	మొత్తం
ఆదిలాబాద్	122	25	118	3	1314	1582
హైదరాబాద్	23	35	153	-	206	417
కరీంనగర్	95	117	249	3	74	538
ఖమ్మం	81	13	92	-	160	346
మహబూబ్‌నగర్	123	36	391	-	1429	1979
మెదక్	125	33	214	2	876	1250
నల్లగొండ	100	56	307	-	40	503
నిజామాబాద్	100	35	85	1	319	540
రంగారెడ్డి	146	16	192	-	915	1269
వరంగల్	96	50	140	-	82	368
మొత్తం	1011	416	1941	9	5415	8792

ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ చేయండి

టీజేఎమ్‌యూ చలో బస్‌భవన్‌లో నేతలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీ కార్మికుల వేతన సవరణను తక్షణం అమలు చేయాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎమ్‌యు) డిమాండ్ చేసింది. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారంనాడు చలో బస్‌భవన్ ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య, తెలుగుదేశంపార్టీ హైదరాబాద్ నగర అధ్యక్షులు ఎమ్ఎన్ శ్రీనివాస్ కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. టీజేఎమ్‌యు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి సుధాకర్, కె హన్మంతు ముదిరాజ్ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. 2017 ఏప్రిల్ 1వ తేదీ నుంచి జరగవలసిన వేతన సవరణపై ఇప్పటి వరకు ప్రభుత్వం, యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం పట్టనట్టే వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పనిభారాలు తగ్గించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, తార్నాక ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చాలని, అద్దెబస్సులు, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు టీఎస్‌ఆర్టీసీ చైర్మెన్ సోమారపు సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్ జివి రమణారావులకు 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



సెన్సెక్స్ ▼ 25
33,819

నిఫ్టీ ▼14
10,382

డాలరుకు రూపాయి విలువ
65.06



బంగారం(10.గ్రా)
రూ. 30,554



వెండి (కేజీ)
రూ. 40,600



సైబర్‌దాడుల నష్టం రూ. 3.25 కోట్లు

న్యూఢిల్లీ: సైబర్ దాడులు భారతీయ కంపెనీలకు తలనొప్పిగా తయారయ్యాయి. గత ఏడాదిన్నర కాలంలో ఈ దాడుల వల్ల మన దేశ కంపెనీలు దాదాపు రూ.3.25 కోట్ల మేర నష్టపోయాయని. టెక్నాలజీ సంస్థ సిస్కో ఒక నివేదికలో వెల్లడించింది.

మార్కెట్లోకి రూ.11.50 కోట్ల కారు!



చెన్నై: విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ రోల్స్-రాయిస్ భారత మార్కెట్లోకి అత్యంత ఖరీదైన కారును తీసుకువచ్చింది. ఇండియాలో విస్తరణకు యోచిస్తున్న కంపెనీ తన మార్కెట్ వ్యూహంలో భాగంగా 'ఫ్యాంటమ్' పేరుతో రూ.9.50 కోట్ల విలువైన అత్యాధునిక కారును మార్కెట్లోకి తెచ్చింది. ఫ్యాంటమ్ ఎక్స్‌టెండెడ్ వీల్‌బేస్ వాహనం ధర రూ.11.35 కోట్లు పలకనుందని.. కంపెనీ వెల్లడించింది. ఫ్యాంటమ్ కారు 6.75 లీటర్ ట్విన్ టర్బో ఛార్జ్‌డ్ వీ12 ఇంజిన్‌తో రూపొందించారు. ఈ ఇంజిన్ 563 హెచ్‌పీ సామర్థ్యాన్ని కలిగి.. కేవలం 5.4 సెకండ్ల వ్యవధిలోనే 0-100 కి.మీ. గరిష్ట వేగాన్ని అందుకుంటుందని కంపెనీ తెలిపింది. మొత్తం 214 శాతం దిగుమతి సుంకంతో పాటు జీఎస్‌టీ కలుపుకొని కారు ధరను నిర్ణయించినట్టుగా కంపెనీ ఆసియా పసిఫిక్ ప్రాంతపు రీజినల్ డైరెక్టర్ పాల్ హారిస్ తెలిపారు. తమ సంస్థకు దక్షిణ భారతంలో మొత్తం అయిదు అవుట్ లెట్‌లు ఉన్నట్టుగా ఆయన వివరించారు. జీఎస్‌టీ, నోట్ల రద్దు వంటి చర్యలు గత ఏడాది తమ అమ్మకాలను ప్రభావితం చేసినట్టుగా ఆయన తెలిపారు. కోలినియన్ మోడల్ వాహనాన్ని ఈ ఏడాది తరువాత తాము మార్కెట్లోకి తేనున్నట్టుగా హారిస్ వివరించారు. ఈ ఏడాది చివరి నాటికి ఆయిదు మోడళ్లతో పాటుగా బ్లాక్‌బ్యాడ్జ్ మోడల్ కార్లు అందుబాటులో ఉండనున్నట్టుగా ఆయన తెలిపారు.

ఆగని అవినీతి..!



- భారత్ పరిస్థితిల్లో మార్పు లేదు
- అవినీతి దేశాల చిట్టాలో 81వ స్థానం
- రెండేండ్ల కిందటి కంటే పెరిగిన కరప్షన్
- కరప్షన్ లెస్ దేశాల్లో న్యూజిలాండ్ బెస్ట్
- అవినీతి పోరాటాలపై పెరిగిన దాడులు
- సగటున రోజుకో జర్నలిస్టు హత్య: టీఐ

న్యూఢిల్లీ: దేశంలో పెరిగిపోతున్న అవినీతికి అంతం పలకడంతో పాటు.. పారదర్శకతకు పెద్దపీట వేసేలా తాము పలు చర్యలు తీసుకోవడంతో దేశంలో అవినీతి తగ్గుముఖం పట్టిందని మోడీ సర్కారు చెబుతున్న మాటల్లో డొల్లతనం మరోమారు బయటపడింది. బెర్లిన్ కేంద్రంగా పని చేస్తోన్న 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్‌నేషనల్' (టీఐ) సంస్థ తాజాగా విడుదల చేసిన అవినీతి దేశాల జాబితా మన దేశంలో జరుగుతోన్న అవినీతిలో ఎలాంటి చెప్పుకోదగ్గ మార్పు లేదని తేల్చింది. ప్రపంచ వ్యాప్తంగా 181 దేశాల్లో పరిస్థితులను విశ్లేషించిన ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్‌నేషనల్ సంస్థ.. భారత్ మొత్తం 40 పాయింట్ల జాబితాలో 81వ స్థానంలో నిలిచినట్టుగా వెల్లడించింది. అంతకు ముందు ఏడాదిలో కూడా (2016) భారత్ ఇదే 40 పాయింట్లతో 79వ స్థానంలో ఉన్నట్టుగా సంస్థ తెలిపింది. అయితే 2016 సంవత్సరంలో 176 దేశాలపై మాత్రమే తాము అధ్యయనం చేశామని... దేశాల సంఖ్య పెరిగిందని'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్‌నేషనల్ వెల్లడించింది. ప్రభుత్వ రంగ సంస్థల్లో అవినీతి జోరును ఈ సంస్థ పరిశీలించింది. 2015 నాటి అవినీతి దేశాల పరిస్థితుల అధ్యయనంలో మన దేశానికి 38 పాయింట్లతో మేటి ర్యాంకింగ్ లభించడం విశేషం. అవినీతి చాలా తక్కువగా ఉన్న దేశాల్లో న్యూజిలాండ్, డెన్మార్క్‌లు వరుసగా 89, 88 పాయింట్ల స్కోరింగ్‌తో ఉత్తమ దేశాలుగా నిలిచాయి. మరోవైపు సిరియా (14), దక్షిణ సూడాన్ (12), సోమాలియా (09) దేశాలు వరుసగా జాబితాలో కింది స్థానాల్లో నిలిచాయి. కాగా మన పొరుగున్న ఉన్న చైనాలో భారత్ కంటే మెరుగైన పరిస్థితులు ఉన్నాయని టీఐ తెలిపింది. జాబితాలో ఆ దేశంలో 41 పాయింట్లతో 77వ స్థానంలో నిలిచింది. మరోవైపు దాయాది దేశం పాకిస్థాన్‌లో 32 పాయింట్ల స్కోర్‌తో 117వ స్థానంలో నిలిచినట్టుగా టీఐ విశ్లేషణ వెల్లడించింది.

మీడియాపై పెరుగుతున్న దాడులు..

ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలపైనా మీడియాపైనా ఈ మధ్య కాలంలో అవినీతిపై పోరాడిన నేరానికి దాడులు తీవ్ర మయ్యాయని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ధోరణి అవినీతి అత్యధికంగా ఉన్న దేశాలలో మరింత ఎక్కువగా ఉందని గుర్తించింది. అవినీతి నిర్మూలనకు ఎన్ని చర్యలు తీసుకున్నా, చాలా దేశాలలోని పరిస్థితిలో పెద్దగా మార్పు రావటం లేదని అభిప్రాయపడింది. గత ఆరేండ్ల కాలంలో వివిధ దేశాల్లో తీసుకున్న చర్యలు సంతృప్తికరంగా లేవని తెలిపింది. అవినీతి విపరీతంగా ఉన్న దేశాలలో సగటున రోజుకు ఒక జర్నలిస్టు హత్యకు గురవుతున్నాడని, 2012లో జరిగిన హత్యలన్నీ ఈ కోవకు చెందినవేనని నివేదిక సూచించింది.

రోటోమాక్ 'కొఠారీ' ద్వయం అరెస్టు



న్యూఢిల్లీ: బ్యాంకు రుణాల ఎగవేత ఆరోపణలు ఎదుర్కొంటున్న రోటోమాక్ సంస్థ అధినేత విక్రమ్ కొఠారీ, ఆయన కుమారుడు రాహుల్ కోఠారీని సీబీఐ అధికా రులు గురువారం అరెస్టు చేశారు. కాన్పూర్‌లోని కొఠారీ నివాసం, కార్యాలయాలలో మూడు రోజులుగా సాగుతు న్న సీబీఐ సోదాలు గురువార మూ కొనసాగింది. సీబీఐ అడిగిన ప్రశ్నల కు కొఠారీ, ఆయన కుటుంబీకులు సరైన సమాధానమివ్వడం లేదని, కేసును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అధికారులు తెలిపారు. కొఠారీతో పాటు ఆయన కుమారుడు రాహుల్ కొఠారీని సీబీఐ అరెస్టు చేసింది. కాగా, కొఠారీ మాత్రం.. తాను బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న మాటే నిజమే అని కానీ, ఎగ్గొట్టలేదు అని చెబుతున్నారు. అయితే కొఠారీ.. బ్యాంకు ఆఫ్ బరోడా నుంచి తీసుకున్న రుణం చెల్లించడం లేదని బ్యాంకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఈ నెల 19న సీబీఐ కేసు దాఖ లు చేసింది. ఆయన రూ. 3,695 కోట్లు బ్యాంకుల వద్ద అప్పుగా తీసుకున్నారు.

సరిదిద్దుకుందాం.. రా!

- 'దిద్దుబాటు' ప్రణాళికతో రండి
- నీరవ్ మోడీకి పీఎన్‌బీ ఆఫర్





న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో (పీఎన్‌బీ) రూ.11,400 కోట్ల ఘరానా మోసానికి పాల్పడిన వజ్రాల వ్యాపారి నీవర్ మోడీతో సమస్య పరిష్కారానికి ఆ బ్యాంక్ అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను వినియోగిస్తోంది. ఇందులో భాగంగా బ్యాంక్ నీరవ్ మోడీకి మరో ఆఫర్ ఇచ్చింది! తమ బ్యాంక్ శాఖల్లో మోస పూరితంగా తీసుకున్న 'లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్'ల (ఎల్‌వోయు) ద్వారా పొందిన రుణాలను తిరిగి చెల్లించేందుకు గాను సమగ్రమైన, అమలు చేయదగిన ప్రణాళికతో ముందుకు రావాలని నీరవ్‌ను కోరింది. సమస్య పరిష్కారానికి కలిసి ముందుకు సాగుదామని ఈమెయిల్ రూపంలో సంకేతాలను పంపింది. 'మీరు తీసుకున్న భారీ అప్పులు తిరిగి చెల్లించేందుకు గడువులు పొడగించేందుకు మేం సహకరించలేం.. అయితే అప్పులు చెల్లించేందుకు మీరు ఏదైనా అమలు చేయగల సమగ్ర ప్రణాళికతో రాగలరా! అలాగైతే మాకు తిరిగి మెయిల్ చేయండి' అని బ్యాంకు నీరవ్ మోడీకి మెయిల్ పంపింది.

నీరవ్ మోడీ ఆర్థిక అనిశ్చితిలోకి జారుకున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఈ సమస్యను అధిగమించేందుకు వనరులను సమీకరించే పనిలో పడింది. ఇతర బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాలకు సరిపడా ఆస్తులున్నాయని ప్రభుత్వరంగ పీఎన్‌బీ పేర్కొంది. అవసరమైతే వీటిని విక్రయించి తగిన చర్యలు చేపట్టేలా బ్యాంక్ ప్రణాళికలను రూపొందిస్తోంది. తమ బకాయిలను రాబట్టు బకునేందు కు చట్టపరంగా అన్ని చర్యలూ తీసుకుంటామని స్పష్టం చేసింది.

రాష్ట్రంలో అతిపెద్ద 'ఔషధ నగరి'



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా సిటీ (ఔషధ నగరం) తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు కానుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు వెల్లడించారు. గురువారం హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన 'బయో ఏషియా-2018' అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దాదాపు 19,000 ఎకరాల్లో ఫార్మా సిటీ ఏర్పాటు జరగనుందని తెలిపారు. దీంతో ప్రపంచంలోనే మన ఫార్మాసిటి అతి పెద్దది కానున్నదని మంత్రి కేటీఆర్ వివరించారు. హైదరాబాద్‌లో జీనోమ్ వ్యాలీ, ఫార్మా సిటీ, వైద్య ఉపకరణాల పార్కుల ఏర్పాటుతో లైఫ్‌సైన్సెస్ కంపెనీలకు.. అన్ని సౌకర్యాలు ఒకే చోట అందుబాటులో ఉండే నగరంగా హైదరాబాద్ ఎదగనుందని ఆయన వివరించారు. బయో సైన్స్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ నెంబర్‌వన్ స్థానంలో ఉందని వివరించారు. రాష్ట్రంలోని జీనోమ్ వ్యాలీ క్లస్టర్ ఆసియాలోనే అతి పెద్దదిదన్న కేటీఆర్... జీనోమ్ వ్యాలీ విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో వందకు పైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలు ఉన్నాయని వివరించారు. మన రాష్ట్రం అతి తక్కువ ధరకే వ్యాక్సిన్లను అందజేస్తున్నదని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఐటీ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణకు అగ్ర పథంలో నిలుపుతామని మంత్రి హామీ ఇచ్చారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సు శనివారం (24 వరకు) జరగునుంది. దాదాపు 50 దేశాల నుంచి లైఫ్ సైన్సెస్‌కు చెందిన పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, వైద్య నిపుణలు ఈ సదస్సుకు హాజరయ్యారు.

ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికుడి ఆత్మహత్య

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన

నవతెలంగాణ-సిరిసిల్ల



ఆర్థిక ఇబ్బందులు తాళలేక చేనేత కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ కార్మిక క్షేత్రంలో గురువారం జరిగింది. స్థానికులు, మృతుని బంధువుల వివరాల ప్రకారం... సుందరయ్యనగర్‌కు చెందిన కొక్కుల తిరుపతి (35) గతంలో రూ.2 లక్షలు అప్పు చేసి మరమగ్గాలు అద్దెకు తీసుకున్నాడు. నష్టాలు రావడంతో ప్రస్తుతం మరమగ్గాల కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. మనస్తాపం చెందిన తిరుపతి గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతునికి భార్య, కుమారుడు అరుణ్ ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల పహారా నడుమ భూసేకరణ

- భూములివ్వబోమన్నా బలవంతంగా సర్వే

నవతెలంగాణ-కూసుమంచి



ఖమ్మం-సూర్యాపేట బైపాస్ రోడ్డు భూసేకరణపై ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. గురువారం పోలీసుల పహారా నడుమ సర్వే చేపట్టారు. గిరిజనులు అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులు వారిని దూరంగా నిలిపేశారు. పంటలు పండే తమ భూములను బైపాస్ రోడ్డుకు ఇచ్చేది లేదంటూ రైతులు కొద్దిరోజులుగా భూసేకరణ పనులు అడ్డుకుంటున్న విషయం విధితమే. ఈ క్రమంలో గురువారం కూసుమంచి మండల పరిధిలోని లింగారంతండా, కోక్యాతండాలకు చెందిన గిరిజన రైతుల భూముల్లో ఆర్ఐ లక్ష్మణ్, సర్వేయర్ అంజన్‌రావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. తమ ప్రాణాలు పోయినా భూములిచ్చేది లేదంటూ గిరిజనులు పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కృష్ణ పోలీసులకు సమాచారం అందించడంతో కూసుమంచి ఎస్ఐ రఘు, నేలకొండపల్లి ఎస్ఐ సుమన్ తమ సిబ్బందితో కలిసి రైతుల పంట పొలాల వద్దకు వచ్చారు. రైతులను భూముల్లోకి రానివ్వకుండా అడ్డుకున్నారు. భూములివ్వ బోమని రైతులు చెబుతున్నా బలవంతంగా సంతకాలు పెట్టించి పోలీసు పహారా నడుమ సర్వే పనులు నిర్వహించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోర్టు ఆదేశం

నవతెలంగాణ-హైదరాబాద్



తెలుగు రాష్ట్రాల్లోని హౌసింగ్ బోర్డుల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులకు సవరించిన పేస్కేల్స్ మేరకు పింఛన్, కరవు భతి చెల్లించాలనే విజ్ఞాపన పత్రాలను నెలరోజుల్లో పరిష్కరించాలని ఉమ్మడి హైకోర్టు గురువారం రెండు రాష్ట్రాలను ఆదేశించింది. 2013లో వేతన సవరణ చేసినా తమకు అందుకు అనుగుణంగా పింఛన్, కరవు భ తి ఇవ్వడం లేదని హైదరాబాద్‌కు చెందిన కుమారస్వామి వేసిన రిట్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేత త్వంలోని బెంచ్ విచారించింది. హౌసింగ్ బోర్డుల మధ్య వివాదాల కారణంగా విశ్రాంతి ఉద్యోగులకు బకాయిలు చెల్లించకపోవడం సబబుకాదని బెంచ్ పేర్కొంది.

'మగ్గం' హామీలు గాలికి..



ఫైల్

అధ్యయనం లేదు.. అమలు అసలే లేదు...

వరంగల్‌లో వస్త్రనగరి శంకుస్థాపనకే...

- దీన స్థితిలో తెలంగాణ నేతన్నలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణ ఉద్యమ సమయంలోను, అటు తర్వాత ఎన్నికలప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు అటకెక్కాయి. గత నాలుగేండ్ల కాలంలో ప్రధాన వాగ్దానాలేవీ అమలుకు నోచుకోకపోవటంతో వారి స్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా తయారైంది. రాష్ట్రంలోని పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, ఆలంపూర్, సిరిసిల్ల, హుజూరాబాద్, దుబ్బాక, వరంగల్, సిరిపురం, మోత్కూరు, నారాయణఖేడ్, జోగిపేట, కొయ్యలగూడెం, పుట్టపాక, గట్టుప్పల, సంస్థాన్ నారాయణపురం తదితర కేంద్రాల్లో చేనేత, మరమగ్గాలు ఎక్కువగా ఉన్నాయి. వీటిపై ఆధారపడి దాదాపు 2 లక్షల మంది జీవిస్తున్నారు. వీరిలో 70 వేల మంది మరమగ్గాలపై పనిచేస్తుండగా.. మిగతావారు చేనేత కార్మికులుగా ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో 17,200 చేనేత మగ్గాలున్నాయి. వివిధ చేనేత సంఘాలు, సంస్థల అధ్యయనం ప్రకారం వీటి సంఖ్య 26 వేలుగా నమోదైంది. వీటికి అనుబంధంగా అచ్చులు అతికేవారు, చిటికీలు అద్దేవారు, బీములో పోసేవారు, చేనేత వస్త్ర వ్యాపారం చేసే వారు సుమారుగా లక్షన్నర మంది దాకా ఈ వృత్తి ద్వారా జీవనోపాధి పొందుతున్నారు.

ఇంతటి ప్రాముఖ్యత కలిగిన చేనేత వృత్తిని రక్షిస్తాం, ఆధునీకరిస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ పలుమార్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి అనేకసార్లు సమీక్షలు కూడా నిర్వహించారు. తెలంగాణలో చేనేత కార్మికుల స్థితిగతుల అధ్యయనం కోసం ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తాం, చేనేతను, జౌళిని విడదీసి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తాం, రాష్ట్రంలో టెక్స్‌టైల్ పరిశ్రమను విస్తరిస్తాం, పోచంపల్లి, గద్వాల వంటి వస్త్రోత్పత్తులకు ప్రచారం, ప్రాధాన్యత కల్పిస్తామంటూ ఆయన ప్రకటించారు. కానీ ఆచరణలో అవి అమలుకు నోచుకోలేదు. సమీక్షల అనంతరం క్షేత్రస్థాయిలో కార్యాచరణ, పనుల పురోగతి లేకపోవటంతో కార్మికుల జీవన స్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. పైగా ప్రభుత్వం సరైన సమయంలో ఆర్డర్లు ఇవ్వకపోవటంతో ఆర్‌వీఎమ్ (రాజీవ్ విద్యా మిషన్-దీనిపేరును సర్వశిక్షా అభియాన్‌గా మార్చారు) కింద పాఠశాలల విద్యార్థులకు యూనిఫారాలు, బతుకమ్మ చీరెలను ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించాల్సి వచ్చింది. ఫలితంగా తెలంగాణ చేనేత కార్మికుల ఉపాధికి పెద్ద ఎత్తున గండిపడింది. మరోవైపు మంత్రి కేటీఆర్ తన సొంత నియోజకవర్గమైన సిరిసిల్లపై ప్రత్యేక దృష్టి సారించారు. అక్కడ మరమగ్గాల కార్మికులు అత్యధిక సంఖ్యలో ఉండటమే అందుకు కారణం. ఈ క్రమంలో సిరిసిల్లలోని ప్రతి నేత కుటుంబానికి నాలుగు మరమగ్గాలను అందజేస్తామంటూ ఆయన ప్రకటించారు. వారికోసం వర్క్‌షెడ్లను కూడా ఏర్పాటు చేస్తామంటూ తెలిపారు. ఇది కూడా ఇప్పటి వరకూ అమలుకు నోచుకోకపోవటం గమనార్హం.

కేసీఆర్ ఇచ్చిన హామీలు.. వాటి అమలు తీరు ...

వాగ్దానం	ప్రస్తుత పరిస్థితి
చేనేత కార్మికుల స్థితిగతులపై అధ్యయనం	ఇంతవరకూ చేయలేదు
సలహాలు, సూచనల కోసం కమిటీ ఏర్పాటు	లేదు
కమిటీ నివేదిక ఆధారంగా విధి, విధానాల రూపకల్పన	లేదు
కార్మికుల సంక్షేమం కోసం భద్రతా నిధి ఏర్పాటు	లేదు
పోచంపల్లి, గద్వాల వంటి ఉత్పత్తులకు ప్రోత్సాహం	ఎలాంటి పురోగతి లేదు
టెక్స్‌టైల్స్ విస్తరణకు కృషి	ఎలాంటి చర్యల్లేవు
తగినంత పని, ఉపాధి కల్పిస్తాం	ఉన్న ఉపాధి తగ్గిపోయింది
వరంగల్, సిరిసిల్ల ప్రాంతాన్ని టెక్స్‌టైల్ జోన్‌గా ఏర్పాటు చేస్తాం	శంకుస్థాపనకే పరిమితం
చేనేత, జౌళిని విడదీసి, ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు	విడదీయలేదు
కో-ఆపటెక్స్ తరహాలో ప్రత్యేక సంస్థ ఏర్పాటు	ఏర్పాటు చేయలేదు
వస్త్రాల అమ్మకాలకు ప్రత్యేక మార్కెట్లు ఏర్పాటు	లేదు
పవర్‌లూమ్ కార్మికుల వ్యక్తిగత రుణాల మాఫీ	యాజమాన్యాలకే చేశారు
ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట ప్రత్యేక చేనేత మిషన్	ఏర్పాటు చేయలేదు

భూములు తీసుకుని అన్యాయం చేయొద్దు

- మీరే ఆధారం చూపాలే !
- జేసీకి అంకుసాపూర్ రైతుల మొర

నవతెలంగాణ-తంగళ్ళపల్లి




'రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడ్డాం. బీడు భూములు సాగులోకి తెచ్చాం. నీళ్లున్నప్పుడు పంటలు వేసుకున్నాం. ఈ భూములే మాకు జీవనాధారం. భూములు తీసుకుని మాకు అన్యాయం చేయొద్దు. మీరే మాకు ఆధారం చూపాలే' అంటూ రాజన్నసిరిసిల్ల జిల్లా అంకుసాపూర్ నిర్వాసితులు జేసీతో తమ మొరను చెప్పుకున్నారు. అంకుసాపూర్ శివారులో కాళేశ్వరం పదో ప్యాకేజీ కింద పునరావాస కాలనీ ఏర్పాటు పనులను గురువారం జేసీ యాస్మిన్‌బాషా పరిశీలించారు. అనంతగిరి నిర్వాసితుల కోసం పునరావాస కాలనీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంకుసాపూర్‌లో 50 ఎకరాల అసైన్డ్ స్థలాన్ని గుర్తించింది. ఆ స్థలంలో ఇప్పటికే కొందరు రైతులు సాగు చేసుకుంటున్నారు. జేసీ రాకను తెలుసుకున్న రైతులు ఆమెను కలిసి తమ బాధను చెప్పుకున్నారు. 1994లో ప్రభుత్వం తమకు ఈ భూములు ఇచ్చిందని అన్నారు. వ్యవసాయ రుణాలు తీసుకుని తాము పంట సాగు చేసుకుంటున్నామని చెప్పారు. 2007లో అప్పటి ప్రభుత్వం తమ భూములను తిరిగి తీసుకుందని తెలిపారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించామని గుర్తు చేశారు. ప్రస్తుతం పునరావాస కాలనీ కోసం భూములు తీసుకుంటే తామెలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కన్నీటి పర్యంతమైన ఓ మహిళా రైతు జేసీ కాళ్లపైపడి బోరున విలపించింది. ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు నివేదిస్తానని ఈ సందర్భంగా జేసీ బాధితులకు భరోసా ఇచ్చారు. జేసీ వెంట ఆర్డీవో పాండురంగా, తహసీల్దార్, అంజన్న, ఆర్ఐ సంతోష్, విఆర్వో అనిల్, అధికారులు ఉన్నారు.

గ్రామీణ బ్యాంకు కుంభకోణంలో

ఐదుగురు బ్యాంకు అధికారులను విచారిస్తున్న సీబీఐ

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

తాజాగా వెలుగు చూసిన తెలంగాణ గ్రామీణ బ్యాంకు కోట్లాది రూపాయల డిపాజిట్ల గల్లంతు కుంభకోణంలో ఐదుగురు బ్యాంకు అధికారులు, సిబ్బందిని సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినబాద్ అజీజ్‌నగర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్‌లో ఈ కుంభకోణం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఖాతాదారులకు చెందిన దాదాపు తొమ్మిది కోట్ల రూపాయల డిపాజిట్లు గత ఎనిమిదేండ్లలో దశల వారిగా గల్లంతు కావడం, దీంతో కష్టించి సంపాదించి నమ్మకంతో బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన అనేక మంది ఖాతాదారులు ఆందోలనకు దిగడంతో చివరికి బ్యాంకు ఉన్న తాధికారులు సీబీఐ లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారు. ఇందులో ప్రధానంగా తొలి దశలో పద కొండు మంది బ్యాంకు ఉద్యోగులు, మనేజర్లపై కేసులు నమోదు చేసిన సీబీఐ హైదరాబాద్ అధికారులు డీఐజీ చంద్రశేఖర్ నేతృత్వంలో దర్యాప్తును ముమ్మరం చేశారు. ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్న బ్యాంకు క్యాషియర్ జైపాల్‌రెడ్డి, ప్రస్తుత మేనేజర్ శ్రీనివాస్, స్వీపర్ శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు మరో ఇద్దరు గత బ్రాంచ్ మనేజర్లను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్టు తెలిసింది. ఖాతాదారులకు చెందిన లక్షల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిటర్లను అంచెలంచెలుగుఆ తమ ప్రైవేటు ఖాతాల్లోకి ఏ విధంగా వీరు మళ్లించారు. ఇందుకు 2010 లో స్కెచ్ గీసింది ఎవ్వరు మొదలైన కోణాలలో సీబీఐ దర్యాప్తు సాగుతున్నట్టు తెలిసింది. అయితే తొలి దశలో 11 మంది నిందితులుగా పేర్కొంటు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ అధికారులు ఇంకా నిందితులు తేలే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇంటి దొంగలు తమ బ్యాంకుకు వేసిన కోట్ల రూపాయల కన్నంలో ఏ మేరకు ఖాతాదారుల డబ్బులను వెనక్కి తీసుకు రాగలమనే కోణంలో సైతం దర్యాప్తు సాగుతున్నది. అయితే ఇప్పటికే గల్లంతైన తొమ్మిది కోట్ల రూపాయలలో చాలా వరకు నిందితులు స్వాహా చేసినట్టుగా సీబీఐకి సమాచారం ఉన్నట్టు తెలిసింది.



కనిపించని శత్రువు

శరీరంలోని అన్ని భాగాలు సమర్థవంతంగా పనిచేసినప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటారు. ప్రతి అంతర్భాగాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవల్సిన అవసరం ఎంతో ఉంది. ఈ వారం కిడ్నీలో వచ్చే కినల్ ఫెయిల్యూర్ గురించి తెలుసుకుందాం.

మనిషికి రెండు మూత్ర పిండాలు ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పదార్థాలు రక్తంలో ఉంచి, అవసరం లేని వ్యర్థాలను మూత్రంలోనికి పంపుతాయి. ఇంతే కాకుండా , ఇవి మనిషి ఎముకల నిర్వహణ, ఎరుపు రక్త కణాల ఉత్పత్తికి కూడా తోడ్పడతాయి.రక్తపోటును నియంత్రించడంలోకూడా కిడ్నీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందువల్ల కిడ్నీ సమస్య వచ్చినప్పుడు గుండె, రక్తనాళాలు, ఎముకలు, రక్తకణాలు, కూడా సమస్యలకు లోనవుతాయి.

కిడ్నీ సమస్య

మూత్ర పిండాలు ఏ కారణం చేతనైనా శరీరంలో మలినాలను వడగట్టలేక పోవడాన్ని వైద్య పరిభాషలో 'కినల్ ఫెయిల్యూర్' అంటారు. ఇందులో రెండు ముఖ్యమైన రకాలు ఉన్నాయి.

ఎకెఐ : అనగా త్వరితగతిన చెడిపోయిన మూత్ర పిండాలు

సి.కె.డి : అనగా క్రమంగా కొన్ని సంవత్సరాలల్లో చెడిపోయిన మూత్ర పిండాలు.

ఎకెఐ చాలా సందర్భాలల్లో సరియైన సమయంలో గుర్తించి చికిత్స చేస్తే కొలుకునే అవకాశం ఉంటుంది.

సికెడి అయిదు స్టేజీలుగా విభజించబడింది. ఇది కొన్ని సంవత్సరాల పాటు మెల్లగా పెరిగి ఆఖరి దశలో విషమిస్తుంది. అయితే ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఇది నాల్గవ స్టేజీ, లేదా అయిదవ స్టేజీలలోనే ఎక్కువగా రోగులకు వ్యాధి లక్షణాల ద్వారా తెలుస్తుంది. అందువల్ల సి.కె.డి వ్యాధి గ్రస్తులు ఎక్కువగా వ్యాధి ముదిరిన తరువాతే వైద్యుడిని సంప్రదిస్తారు.

కిడ్ని సమస్య ఎంత పెద్దది?

SEEK అనే వైద్య పరిశోధనలో 2013 నాటికి 17శాతం ప్రజలు ఏదో ఒక స్థాయిలో కిడ్నీ వ్యాధి బారీన పడ్డారని తేల్చింది.

భారతదేశంలో కిడ్నీ వ్యాధికి గల అతి పెద్ద కారణం- డయాబెటిస్. ప్రస్తుత గణాంకాల ప్రకారం, దాదాపు 7కోట్లకు పైగా షుగర్ వ్యాధిగ్రస్తులు ఉన్నారని అంచనా.

2030 నాటికి ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ మంది డయాబెటిస్ వ్యాధి గ్రస్తులు మన దేశంలో ఉంటారని అంచనా . హైదరాబాద్‌లో ఐఎంసిఆర్ జరిపిన పరిశోధనలో అంటే హైదరాబాద్‌లో ప్రతి ఆరుగురు వ్యక్తుల్లో ఒకరు డయాబెటిస్ భారీనపడుతున్నారు. దాదాపు 16.6శాతం మంది డయాబెటిస్ వ్యాధి గ్రస్తులున్నారని కనుగొన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తుల్లో దాదాపు సగం (48శాతం) మంది కిడ్నీ వ్యాధిని కలిగి ఉంటారని ఇటీవల పరిశోధనల్లో తేలింది.

మన దేశంలో మరో ముఖ్యమైన కిడ్నీ వ్యాధి కారకం- హై.బిపి

దాదాపు 33శాతం పట్టణ ప్రజలు, 24శాతం గ్రామీణ ప్రజలు హై.బి.పి తో బాధ పడుతున్నారు. అయితే హై.బి.పి ఉన్న వారిలో కూడా కేవలం 42శాతం పట్టణ ప్రజలు, కేవలం 25శాతంగ్రామీణ ప్రజలు తమకు హై.బి.పి ఉందని తెలుసుకున్నారు. ఇక సరియైన వైద్యం చేయించుకుంటున్న వారు మరీ తక్కువ మొత్తానికి షుగర్, బి.పి ని నియంత్రించగలిగితే కిడ్నీ వ్యాధులను సగానికి సగం తగ్గించవచ్చును.

సికేడి-ఆర్థిక ఇబ్బందులు: 2016లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ సంవత్సరానికి 2.2 లక్షల మంది డికెడిలోని ఆఖరి స్టేజి(డయాలసిస్ స్టేజీ) లోకి ప్రవేశిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి డయాలసిస్‌కు దాదాపు 2000 రూపాయలు ఖర్చు అనుకుంటే కిడ్నీ వ్యాధిగ్రస్తులందరికి డయాలసిస్ అందిస్తే ఒక సంవత్సరానికి 2,20.000x2000=4,224 కోట్ల రూపాయలు వచ్చే 12 సంవత్సరాలలో మన దేశ ఆరోగ్య బడ్జెట్‌ను (52,8000) కోట్లు డయాలసిస్ ఖర్చు దాటి వేయబోతుందన్న మాట.

కిడ్నీ వ్యాధి లక్షణాలు

- కాళ్ల వాపులు, మొహం వాపు
- మూత్రం తక్కువగా రావడం
- మూత్రంలో నురుగు, రక్తం,లేదా చీము రావడం (చీము)
- ఆకలి తగ్గడం, తరుచుగా వాంతులు రావడం
- బరువు తగ్గిపోవడం, ఎల్లపుడు అలసటగా ఉండటం

కిడ్నీ పరీక్షలు ఎప్పుడు చేయించుకోవాలి?

- మొదటి సారి హై.బి.పి లేదా షుగర్ గుర్తించినపుడు
- కిడ్నీలో /మూతత్రలో రాళ్లు పడినపుడు
- మూత్ర నాళానికి సంబంధించిన వ్యాధి కలిగినవారు
- కుటుంబంలో ఒకరికంటే ఎక్కువమంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లయితే వారికి వంశపారపర్యంగా సంక్రమించే కిడ్నీ వ్యాధులుంటాయి.

ప్రభుత్వం చేపట్టగలిగే చర్యలు

షుగర్, బి.పి.లను ఆరోగ్య విపత్తులుగా గుర్తించడం

సమాజంలో హై.బి.పి,షుగర్ కలిగిన వారిని గుర్తించి, వారికి చికిత్స అందిస్తే, కిడ్నీ సమస్య 40-50శాతం వరకు నివారించవచ్చు. ఇది ఏటా డయాలసిస్‌కు చేరే వారి సంఖ్యను గణనీయంగా తగ్గిస్తుంది. పైగా డయాలసిస్‌మీద మున్ముందు ప్రభుత్వానికి అయ్యే ఖర్చు నివారిస్తుంది.

ఈ రెంటినీ కనుక గుర్తించి చికిత్సను అందిస్తే గుండెజబ్బులను, పక్షవాతాలను కూడా గణణీయంగా తగ్గించవచ్చు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో వ్యవహరించి ఇదే కార్యక్రమాన్ని త్వరలో చేపట్టబోతుంది. ఇది ఎంతో శుభపరిణామం.

కిడ్నీ వ్యాధికి గల ముఖ్య కారణాలు

మన దేశంలో కిడ్నీ వ్యాధికి గల అతి పెద్ద కారణం - డయాలసిస్

డయాబెటిస్ మరియు హైబి.పి కలిపితే దాదాపు 40 -50 మందిలో కిడ్నీ వ్యాధికి కారకం.

క్రినిక్ గ్లోమరులో నెఫ్రైటిస్, ఇప్పటి వరకు కారణం కనుగొనని CKD-Uతో పాటు మూత్ర పిండాలలో రాళ్ళు, మితిమీరిన నొప్పి మాత్రల వాడకం, మూత్ర నాళాల వ్యాధులు కూడా కిడ్నీ ఫెయిల్యూర్‌కు కారకం.

ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానంలోని కిడ్నీ బాధితులు CKD-Uని కలిగి ఉన్నారు.

కిడ్నీ వ్యాధి నివారణ చర్యలు

కిడ్నీ వ్యాధి లేకుండా ఆరోగ్యంగా ఉన్నవారు నివారణకు తీసుకోవలసిన చర్యలు

1. రోజుకు 2,3 లీటర్ల నీళ్లు తాగాలి.
2. బి.పి షుగర్ కోసం సంవత్సరానికి ఒకసారి పరీక్ష చేయించుకోవాలి
3. హై.బి.పి, షుగర్ ఉన్నవారు సరియైన చికిత్స ద్వారా వాటిని అదుపులో ఉంచుకోవాలి.
4. శరీర బరువును మన ఎత్తుకు తగ్గట్లుగా ఉంచుకోవాలి.
5. రోజుకు కనీసం 15 నిముషాల పాటు వ్యాయామం చేయాలి
6. నాటు మందులకు దూరంగా ఉండాలి
7. నొప్పి మాత్రల మితిమీరిన వాడకం ఆపివేయాలి
8. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మందికి కిడ్నీ వ్యాధి ఉంటే వైద్య సలహా తీసుకోవడం మంచిది. వంశపారపర్యంగా కలిగే కిడ్నీ సమస్యలను ముందే పరీక్షలు చేయించుకోవడం ద్వారా నివారించవచ్చు.

గుండె జబ్బుకు- కిడ్నీ ఫెయిల్యూర్‌కు సంబంధం ఉందా?

గుండె, కిడ్నీ జోడు ఎద్దుల బండిలో ఎడ్ల వంటివి. ఒక ఎద్దు సరిగా పనిచేయనప్పుడు ఎలా అయితే మరొక ఎద్దుపైన శ్రమ పెరుగుతుందో, అదే విధంగా గుండెకు జబ్బుచేస్తే కిడ్నీకి, కిడ్నీకి జబ్బుచేస్తే గుండెకు జబ్బువస్తుంది. ఈ పరిణామాన్ని, వైద్య పరిభాషలో 'కార్డియోరీనల్ సింద్రోమ్' అంటారు.

డా॥బి.శ్రీకాంత్
ఎంబిబిఎస్ (ఎండి) (డిఎం)
నెఫ్రాలజిస్ట్
ఫోన్ :9000012798



మెగ్నీషియం మాయ!



అన్ని పోషకాలు సమపాళ్లలో ఉంటేనే ఆరోగ్యం. లేకపోతే ఏదో ఒక రూపంలో అనారోగ్యం బయటపడుతుంది. ముఖ్యంగా శరీరంలో మెగ్నీషియం తగ్గితే చాలా ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. శరీరంలో జరిగే 300 రకాల రసాయనిక చర్యల్లో దీనిపాత్ర ఉంటుంది. గుండె కొట్టుకోవడం నుండి కండరాలు, హార్మోన్ల పనితీరు వరకు మెగ్నీషియం పాత్ర ఉంటుంది.

మెగ్నీషియం తగ్గితే తలెత్తే సమస్యల్లో ముఖ్యమైనవి ఆకలి లేకపోవడం, తలతిరుగుడు, ఒత్తిడి, తిమ్మిర్లు, ఒళ్లు మొద్దుబారడం, నొప్పులు మొదలైపవి. ఈ సమస్యలు కనిపించినా చాలాసార్లు దాన్ని వైద్యులు మెగ్నీషియం కొరతగా గుర్తించలేరు.

ఆకుకూరలు, గింజలు, త ణ ధాన్యాలు, నట్స్, చేపలు, పెరుగు, అరటిపళ్లు, డార్క్ చాక్‌లెట్ మొదలైన పదార్థాల్లో మనకు మెగ్నీషియం ఎక్కువగా లభిస్తుంది.

మితిమీరిన మోతాదులో కాఫీ, ఆల్కహాల్, సోడా తీసుకోవడం వలన శరీరానికి తగిన స్థాయిలో మెగ్నీషియం అందదు. అలాగే కూల్‌డ్రింకులు ఎక్కువగా తాగే అలవాటున్నా ఇదే పరిస్థితి తలెత్తుతుంది. ఈ విషయాలను ఎన్నో అధ్యయనాలు నిరూపించాయి. ఆల్కహాల్ ఎక్కువగా తీసుకున్నపుడు శరీరం విటమిన్ డిని శోషించుకోలేదు. విటమిన్ డి లేకపోతే శరీరం మెగ్నీషియంను ఎక్కువగా తీసుకోలేదు. తీపి పదార్థాలను అతిగా తీసుకున్నా కిడ్నీల ద్వారా మెగ్నీషియం బయటకు పోతుంది. అయితే సప్లిమెంట్లు ఎక్కువైతే గుండెకు ప్రమాదం. అందుకే డాక్టర్ సలహా ప్రకారమే సప్లిమెంట్లు వాడాలి.

ఎక్కువగా తాగితే...!

మద్యంపై వచ్చే ఆదాయంతో ప్రభుత్వాలు నడుస్తున్నాయి. మత్తుకు బానిసలుగా మారిన మనుషులతో కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. ఈ సమస్య మన దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా మనుషులను మతిస్థిమితం తప్పేలా మద్యం చేస్తుందని కొన్ని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

2008 నుంచి 2013 మధ్య కాలంలో ఫ్రెంచ్ అధ్యయనం ద్వారా వెల్లడైన వాస్తవాలు తెలుసుకుంటే మత్తు వదులుతుంది. మద్యపానం అనేది ఎంత ప్రమాదకారకమో అర్థం అవుతుంది.

వయసుతో నిమిత్తం లేకుండా ఇప్పుడు మద్యం సేవించేవారంతా ఈ వ్యసనం కారణంగా మతిస్థిమితం కోల్పోతారట. ఆరు పదుల వయసు దాటేనాటికే వారు మానసికవైకల్యంతో బాధపడుతారని ఈ పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

ఆయా దేశాల వాతావరణ పరిస్థితులను బట్టి కొద్ది మోతాదులో తీసుకునే మద్యం ఆరోగ్యానికి మేలు చేస్తుందని కొన్ని అధ్యయనాలు చెప్పుతున్నా.. ఎక్కువ మోతాదులో తీసుకునే మద్యం మెదుడు కణాలపై తీవ్రప్రభావం చూపిస్తుందని హెచ్చరిస్తున్నారు.

ఈ తాజా అధ్యయనంలో మద్యం కారణంగా మెదడు పనితీరులో తీవ్రమార్పులతో పాటు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. 2008 నుంచి 2013 మధ్య కాలంలో పదిలక్షల మందిపై చేసిన పరిశోధనలను

ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్ జర్నల్ లో ప్రచురించారు. అధిక రక్తపోటు, డయాబెటిస్, బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటు వంటి ప్రాణాంతక అంశాల్లో మద్యపానం కీలకపాత్ర పోషించిందని, శరీరంలోని అధికస్థాయిలో ఉండే ఆల్కహల్ రక్తనాళాలను క్షీణింపచేస్తుందని స్పష్టమైంది.



జ్ఞాపకశక్తి పెంచేలా..!

'ఎంత చదివినా.. గుర్తుకు పెట్టుకోవడం కష్టమవుతుంది'..
'రాత్రంతా కష్టపడి సదువుకున్నా.. పొద్దున ఏదీ యాదీకి వస్తలే'
'నిన్న బండి తాళాలు ఎక్కడో పెట్టా.. ఇప్పుడు దొరకడం లేదు'
'పోయిన వారం బ్యాంకు పాస్‌బుక్ బీరువాలో పెట్టిన.. ఇప్పుడు చూస్తే కనిపిస్తలేదు' ఇలాంటి మాటలు ప్రతి ఇంట్లో సర్వసాధారణంగా వినిపిస్తుంటాయి. స్కూలు పిల్లల నుంచి రిటైర్డ్ అయిన వ్యక్తుల వరకు జ్ఞాపకశక్తి పెద్ద సమస్యగా మారింది. ఇక పరీక్షల సమయంలో పిల్లల పాట్లు ఎంత చెప్పినా తక్కువే. మరి జ్ఞాపకశక్తిని పెంచు కోవాలంటే ఏం చేయాలి అన్నది పెద్ద ప్రశ్న..



మరచిపోవడం అనేది సర్వ సాధారణం. అయితే బ్రెయిన్ పనితీరు మెరుగ్గా ఉన్నప్పుడు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మెదడులోని కణాలు క్షీణించడం ప్రారంభించినప్పుడు పెద్దవారిలో మాత్రమే కనిపించే ఈ మెమోరీ సమస్య ఇప్పుడు చిన్నవయ సువారిలోనూ కనిపిస్తుంది. మెదడు ఎప్పటికీ యాక్టీవ్‌గా ఉండాలన్నా.. జ్ఞాపకశక్తి పెరగాలన్నా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

పుస్తకాలతో కుస్తీతో పాటు : పరీక్షలంటే చాలు పిల్లలు ఎక్కువ సమయం పుస్తకాలతో కనిపిస్తారు. ఎంత చదివినా గుర్తుండడం లేదని బెంగపడుతారు. కేవలం పుస్తకాలతో కుస్తీ కాకుండా కొద్ది సమ యాన్ని మీకు నచ్చిన హాబీకి కేటాయించండి. పెయింటింగ్, మ్యూజిక్ వినడం వంటి స జనాత్మక హాబీలను డెవెలప్ చేసుకోవడం ద్వారా బ్రెయిన్ సెల్స్ ఎక్కువ కాలం యాక్టివ్ గా ఉంటాయి. అనేక రీసెర్చ్ స్టడీస్ ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. ఒకే పని ఎక్కువ సమయం చేయడం వల్ల మెదడు మొద్దుబారి పోతుంది. అలా కాకుండా క్రియేటివ్‌గా ఆలోచిస్తే బ్రెయిన్ సెల్స్ యాక్టివ్ గా పనిచేస్తూ మరింత షార్ప్ గా తయారవుతాయి. మెదడు ఉత్తేజంగా ఉంటే కొద్ది సేపు చదివినా గుర్తుంటుంది.

ఎక్సర్‌సైజ్ చేయండి: శారీరక వ్యాయామం చేస్తే మెదడుకు ఎంటి లాభం అనుకుంటున్నారా? శరీరానికే కాదు చురుకైన ఆలోచనలు రావాలంటే మెదడు కోసం కొన్ని ఎక్సర్‌సైజులు చేయాల్సిందే. శారీరక వ్యాయామాల ద్వారా శరీరం ఫిట్‌గా హెల్తీగా ఉంటుంది. అదే విధంగా, బ్రెయిన్ ఎక్సర్సైజ్‌ల వలన బ్రెయిన్ అనేది యాక్టివ్ గా షార్ప్ గా ఉంటుంది. పజిల్స్ సాల్వ్ చేయడం, సూడోకు, క్రాస్ వర్డ్స్, చెస్ వంటి బ్రెయిన్ గేమ్స్ ని తరచూ ఆడటం ద్వారా బ్రెయిన్ సెల్ డీజెనరేషన్ ప్రాసెస్‌ని అరి కట్టవచ్చు.


హెల్తీ డైట్ ద్వారా : హెల్తీ డైట్ ద్వారా అనేక వ్యాధులను అరికట్ట వచ్చు అని మనందరికీ తెలుసు. అయితే మెదడుకు చురు కుదనాన్ని ఇచ్చే కొన్ని ఆహార పదార్థాలను మన డైట్ లో చేర్చు కుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్న ఆహారపదార్థా లను ఎక్కువగా తీసుకోవాలి. ఇవి మెదడుని ఆరోగ్యంగా అలాగే యాక్టివ్ గా ఉంచేందుకు తోడ్ప డతాయి. ఫిష్, నెయ్యి, కొబ్బరి, అవొకాడో వంటివి ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభించే కొన్ని ఆహార పదార్థాలు.

అందరితో కలిసిమెలసి : స్నేహితు లతో, బంధువులతో ఎక్కువ సమ యా న్నిగడపడం కొందమందికి ఇష్టం. మరికొంత మంది.. ఎక్కువ సమయాన్ని ఒంటరిగా గడిపేందు కు ఆసక్తి చూపిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక పరిశోధ నల్లో ఒంటరిగా ఉండేందుకు ఆసక్తి చూపించే వారి కంటే అందరితో కలిసిమెలిసి ఉండేవారిలోనే బ్రెయిన్ సెల్స్ యాక్టివ్‌గా ఉన్నాయని. వారిలో మెదడు పనితీరు సవ్యంగా ఉంటుందని రీసెర్చ్ స్టడీస్ వెల్లడి స్తున్నాయి. కొత్త విషయాలను తెలుసు కోవడం, జోక్ వేయడం, స్పోటీవ్‌గా ఆలోచించడం వంటివి బ్రెయిన్ సెల్స్ ని ఎక్కువ కాలం యాక్టివ్ గా ఉంచుతాయి.

వీటిలో పాటు ఆహారంలో కొవ్వు పదార్థాలు తక్కువగా.. ఫైబర్, ప్రోటీన్స్ ఎక్కువగా తీసు కుంటూ పాజిటివ్‌థింకింగ్, క్రియేటివ్‌నెస్ పెంచుకుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

కీళ్ల నొప్పులు బాధిస్తుంటే..!



ప్రస్తుత జీవన విధానంలో వస్తున్న మార్పులు కొన్ని రకాల అనారోగ్యసమస్యలకు కారణం అవుతున్నాయి. వాటిలో అతి ముఖ్యమైన అనారోగ్య సమస్యగా కీళ్ల, కండరాల నొప్పులను చెప్పవచ్చు. కొన్ని దశాబ్దాల కిందట 60ఏండ్ల పై పడినవారిలో మాత్రమే వచ్చే కీళ్ల నొప్పులు ఇప్పుడు చిన్నవయసువారిని కూడా బాధ పెడుతు న్నాయి. కీళ్లలో వాపుతో మొదలై తీవ్రమైన నొప్పిగా మారే ఈ సమస్య నుంచి బయటపడేసేలా కొన్ని రకాల చిట్కాలు పాటించాలి. సహజ విధానాల ద్వారా నిదానంగా కీళ్ల నొప్పులను తగ్గించవచ్చు.

మనం తీసుకునే ఆహారంలో కొన్ని పదార్థాలు కండరాల నొప్పులకు కారణమవుతాయి. ఆరోగ్య నిపుణులు చెప్పే వివరాలను గమనిస్తే.. వాపు, మంట లాంటివి అనారోగ్య సమస్యలు జీర్ణకోశంలో మొదలవుతాయి. ఆర్థరైటిస్ (కీళ్ల నొప్పులు) తగ్గించే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకున్నప్పుడు నొప్పితో బాధపడుతారు. నొప్పికి కారణమయ్యే వాటిని గమనించాలి. వాటిని తీసుకోవడం మానేశాక కాస్త ఉపశమనంగా అనిపిస్తే మీకు ఏ ఆహారపదార్థాలు సరిపడటం లేదో తెలుసుకోవచ్చు.

ఫైబర్ ఎక్కువగా : కీళ్ల నొప్పులను తగ్గించేందుకు ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని కొన్ని పరిశోధనలు చెప్తున్నాయి. తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకునేవారిలో కీళ్ల సంబంధమైన సమస్యలు తక్కువగా ఉంటాయి. చక్కెర, ధాన్యాలు, నూనె, కొవ్వు పదార్థాలు వీలైనంత వరకు తక్కువగా తీసుకోవాలి. అంతేకాదు.. ఉప్పు వాడకాన్ని బాగా తగ్గించుకోవాలి.

ఒత్తిడికి దూరంగా : అనేక అనారోగ్యసమస్యలకు మూలకారణం ఒత్తిడి. కీళ్ల నొప్పులు ఉన్నవారిని గమనిస్తే వారు బాగా ఒత్తిడికి గురువుతున్నట్టు తెలుసుకోవచ్చు. మానసిక ఆందోళన చెందేవారిలో కీళ్ల నొప్పులు మరింత తీవ్రతరంగా కనిపిస్తాయి. పాజిటివ్ థింకింగ్‌ను పెంచుకోవడం ద్వారా కీళ్ల నొప్పుల తీవ్రతను తగ్గించుకోవచ్చు. ఇందుకోసం ధ్యానం, యోగా చేయాలి. మనసు ప్రశాంతంగా ఉంచుకోవడం ద్వారా చాలా సమస్యలను దూరం చేసుకోవచ్చు.

నొప్పిని నివారించే పసుపు : మనం రోజూ కూరల్లో రంగు కోసం ఉపయోగించే పసుపులో ఔషధగుణాలున్నాయి. దీనికి నొప్పిని తగ్గించే గుణం ఉంటుంది. మంటను తగ్గించడంతో పాటు శరీరంలో ఎక్కడైనా నొప్పి ఉంటే పసుపు వాడితే ఫలితం ఉంటుంది. కీళ్లనొప్పులు ఎక్కువగా ఉన్నచోట కొబ్బరినూనె, ఆలీవ్‌ఆయిల్‌లో పసుపు కలిపి మసాజ్ చేసుకుంటే చాలా వరకు ఉపశమనం లభిస్తుంది.

మర్దన: కండరాలు పట్టేడంతో కీళ్లనొప్పులు వస్తాయి. మారిన జీవనవిధానంలో ఎక్కువగా శరీరక శ్రమ లేకపోవడం.. గంటల తరబడి ఒకే భంగిమలో కూర్చోవడం మొదలైనవి కీళ్లనొప్పులకు కారణమవుతాయి. ఇలాంటి సందర్భాల్లో నొప్పిని కొంత వరకు తగ్గించి ఉపశమనాన్ని కలిగించడానికి మసాజ్ ఎంతో ఉపయోగపడుతుంది. నొప్పి ఉన్న చోట కొబ్బరినూనె, ఆలీవ్ ఆయల్‌తో మసాజ్ చేయాలి. నొప్పి ఎక్కువగా ఉంటే నిపుణులైన మసాజ్ థెరపిస్టులను సంప్రదించాలి. ఈ చిన్నచిన్న మార్పులతో, చిట్కాలతో కీళ్లనొప్పులు తగ్గక పోయినా....నొప్పుల తీవ్రత ఎక్కువగా ఉన్నా.. డాక్టరును సంప్రదించాలి.



ఏసీలో ఉన్నా.. నీళ్ల తాగాల్సిందే!

ఎండాకాలం అప్పుడే మొదలైంది. చాలామంది ఏసీలు కొత్తగా ఫిట్ చేసుకుంటున్నారు. కూలర్లు తీసుకుంటున్నారు. ఎక్కువగా ఏసీలో ఉంటే దాహం వేయదని.. తరచుగా నీళ్లు తాగాల్సిన అవసరం లేదన్న అపోహ ఉంది. ఇది నిజం కాదు.. ఏసీలో ఉండే వారు తప్పనిసరిగా ఎక్కువగా నీళ్లు తాగాలి. కారణం.. ఏసీలో ఉండటం ద్వారా శరీర ఉష్ణోగ్రత పెరిగి అనేక సమస్యలకు దారితీస్తుంది. దీన్ని నివారించాలంటే ఎక్కువగా నీళ్లు, ద్రవపదార్థాలు తీసుకోవాలి. గంటగంటకు నీళ్లు తాగాలి. ఎక్కువ సమయం ఏసీలో ఉండాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే శ్వాసకోశ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.



భారత క్రికెట్ సారథి ముంబయి


- 41 రంజీ టైటిళ్లు అందుకు నిదర్శనం
- దిగ్గజ క్రికెటర్ సచిన్ అభిప్రాయం

నవతెలంగాణ-ముంబయి

భారత క్రికెట్‌కు ముంబయి ఎల్లప్పుడూ సారథ్యం వహించదని, తిరుగులేని గణాంకాలే అందుకు రుజువులని దిగ్గజ క్రికెట్ సచిన్ టెండూల్కర్ అభిప్రాయపడ్డాడు. జాతీయ జట్టులోకీ గణనీయ సంఖ్యలో క్రికెటర్లను పంపిన ముంబయి, 41 సార్లు రంజీ చాంపియన్‌గా నిలిచిందని సచిన్ అన్నాడు. ముంబయి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముంబయి టీ20 లీగ్‌కు అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న సచిన్.. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడాడు. ' ముంబయి క్రికెట్‌కు ఈ టీ20 లీగ్ ఎంతో అవసరమని నేను నమ్ముతున్నాను. భారత క్రికెట్‌ను ముంబయి ఎల్లవేళలా నడిపించింది. గణాంకాలే ఇందుకు నిదర్శనం. ఈ లీగ్‌లో భాగమైనందుకు సంతోషిస్తున్నాను' అని సచిన్ తెలిపాడు. ముంబయి 41 రంజీ ట్రోఫీలు గెల్చుకున్నది. ఘన చరిత్ర ముంబయికి ఉంది. నాకు ఇంకా గుర్తుంది.. శివాజీ పార్క్‌లో పద్మాకర్ శివాల్కర్ సర్ వచ్చి నాకు బౌలింగ్ చేసేవాడు. నా కంటే ఆయన వయసు మూడింతలు ఎక్కువ. అయినా, ఆయన నాకు బంతులేసేవాడు. ఇది కేవలం ముంబయి క్రికెట్‌లోనే సాధ్యపడుతుంది. యువ క్రికెటర్లు సీనియర్లతో కలిసి ఆడితే ఆ అనుభూతి అమోఘం. వారు నేర్చుకోవడానికి, మరింత ముందుకెళ్లేందుకు ఎంతో దోహదం చేస్తుందని సచిన్ పేర్కొన్నాడు. అన్నట్టు ముంబయి నుంచి అజిత్ వాడేకర్, సునీల్ గవాస్కర్, చంద్రకాంత్ పండిట్, దిలీప్ వెంగ్‌సర్కార్, సంజయ్ మంజ్రేకర్, ప్రవీణ్ ఆమ్రే, వినోద్ కాంబ్లి, రవిశాస్త్రి సహా ప్రస్తుతం రోహిత్ శర్మ, అజింక్య రహానె, శ్రేయాశ్ అయ్యర్, శార్దూల్ ఠాకూర్‌లు భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన వారిలో ఉన్నారు.

ముందుంది స్వర్ణయుగం

స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్



న్యూఢిల్లీ : భారత బ్యాడ్మింటన్ ఇప్పుడిప్పుడే స్వర్ణయుగంలోకి అడుగు పెడుతోందని స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ అన్నాడు. కామన్వెల్త్ గేమ్స్, ఆసియాగేమ్స్‌లో భారత బ్యాడ్మింటన్ పురుషుల జట్టుకు సారథ్యం వహించనున్న శ్రీకాంత్.. నిరుడు ఒకే క్యాలెండర్ సీజన్‌లో నాల్గు సూపర్ సిరీస్ టైటిళ్లు సాధించి చరిత్ర సృష్టించాడు. ' భారత్‌కు ఐదారుగురు మంచి సింగిల్స్ ప్లేయర్స్ ఉన్నారు. మహిళల విభాగంలో సైనా, సింధులు గొప్పగా ఆడుతున్నారు. డబుల్స్ క్రీడాకారుల చేరికతో జట్టుగా మరింత బలమొచ్చింది' అని కిదాంబి అన్నాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో బ్యాడ్మింటన్ పవర్ హౌస్ చైనాతో పాటు భారత్ ఆటగాళ్లు సైతం టాప్-15లో చోటు సాధిస్తున్నారు. రానున్న కాలంలో బ్యాడ్మింటన్‌పై భారత్ ఆధిపత్యం చెలాయించటం లాంఛనమే!. ఒలింపిక్స్ పతకం సాధించటం అంతిమ లక్ష్యం. అలాగని 2020 ఒలింపిక్స్ గురించి పెద్దగా ఆలోచన లేదు. నంబర్ వన్ ర్యాంకర్ కావాలని అనుకోవటం లేదు. ప్రస్తుతం టైటిళ్లు సాధించటంపైనే దృష్టి సారిస్తున్నాను' అని శ్రీకాంత్ తెలిపాడు.

కెప్టెన్, కోచ్, బోర్డు ప్రెసిడెంట్ రాజీనామా



నైరోబీ : కెన్యా క్రికెట్‌లో మూకమ్మడి రాజీనామా ముసలం. వరల్డ్ క్రికెట్ లీగ్ రెండో డివిజన్ టోర్నీలో పేలవ ప్రదర్శన చేసిన కారణంగా కెన్యా క్రికెట్ జట్టు కెప్టెన్, కోచ్‌లతో పాటు ఆ దేశ బోర్డు అధ్యక్షుడు సైతం వైదొలిగాడు. ఆరు దేశాలు పాల్గొన్న ఈ టోర్నీలో కెన్యా అట్టడుగు స్థానంలో నిలిచింది. పేలవ ప్రదర్శనకు గానూ మూడో డివిజన్ టోర్నీకి దిగజారింది. ఇక యు.ఏ.ఈ చేతిలో 218 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైన కెన్యా టోర్నీ ఓటముల్లో మరో రికార్డుకు కారణమైంది!. కెప్టెన్ రాకెప్ పటేల్, కోచ్ థామస్ ఒడియో సహా ఆ దేశ క్రికెట్ బోర్డు తొలి మహిళా అధ్యక్షురాలు జాకీ జన్మోహ్మద్ రాజీనామా చేసింది. ' జాతీయ జట్టు పేలవ ప్రదర్శనకు బాధ్యత వహిస్తున్నాను. అందుకే పదవి నుంచి తప్పుకుంటున్నాను' అని జాకీ వెల్లడించింది. మరో 30 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించి కెన్యా క్రికెట్ బోర్డుకు కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు.

16,347.5 కోట్ల రూపాయలు. ఐదేండ్ల ఐపీఎల్ ప్రసార హక్కులకు స్టార్‌స్పోర్ట్స్ నెట్‌వర్క్ చెల్లించిన మొత్తం. సరిగ్గా ఆరు నెలల క్రీతం రికార్డు ఒప్పందంతో ప్రపంచ క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టించిన భారత క్రికెట్ బోర్డు.. తాజాగా మరో బంపర్ బొనంజా అందుకునేందుకు సిద్ధమవుతోంది. అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ ప్రసార హక్కుల కోసం బీసీసీఐ తాజాగా టెండర్లు ఆహ్వానించింది. ఐపీఎల్‌లో ప్రతి మ్యాచ్‌కు రూ. 55 కోట్లు పలికిన నేపథ్యంలో.. భారత క్రికెట్ జట్టు ఆడే మ్యాచులకు అంతే స్థాయిలో ఆశిస్తోంది.



మరో బంపర్ బొనంజా!

- ఈ వేలానికి ఐదేండ్ల బీసీసీఐ ప్రసార హక్కులు
- మార్చి 27న ఈ వేలం ప్రక్రియ

నవతెలంగాణ-ముంబయి

క్రికెట్ ప్రసార హక్కుల ఒప్పందాల్లో ఇంగ్లీష్ క్రికెట్‌దే ఇన్నాండ్లూ రికార్డు. అత్యధిక సంఖ్యలో వీక్షకులు, క్రికెట్ వీరాభిమానులున్నా భారత్, ఆస్ట్రేలియాలు ఇంగ్లాండ్ వెనకే నిలిచాయి. కానీ నిరుడు జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రసార హక్కులు (టెలివిజన్, డిజిటల్) రికార్డు స్థాయిలో ఏకంగా రూ. 16.347 కోట్లు పలికింది. దీంతో ఐపీఎల్‌లో సగటున ప్రతి మ్యాచ్‌కు రూ. 55 కోట్ల ఆదాయం కేవలం ప్రసార హక్కుల రూపంలోనే వచ్చినట్టు!. ఇదే సమయంలో 2012-2018 కాలానికి స్టార్‌స్పోర్ట్స్ నెట్‌వర్క్ రూ. 3851 కోట్లతో భారత క్రికెట్ ప్రసార హక్కులు దక్కించుకున్నది. ఈ సమయంలో టీమ్ ఇండియా 98 మ్యాచులు ఆడింది. 2012-14 వరకూ మ్యాచ్‌కు రూ. 32.2 కోట్లు చెల్లించిన ప్రసారదారు, 2014 నుంచి మ్యాచ్‌కు రూ. 43.20 కోట్లు చెల్లిస్తోంది. ఈ ఒప్పందం 2018, మార్చి 31తో ముగియనున్నది. దీంతో భారత క్రికెట్ (అంతర్జాతీయ, దేశవాళీ) ప్రసార హక్కుల ఈ వేలం కోసం బీసీసీఐ టెండర్లను ఆహ్వానించింది. ఈ మేరకు బీసీసీఐ ఓ ప్రకటన విడుదల చేసింది.

భలే డిమాండ్ : ఈ వేలంలో పాల్గొనేవారు సుమారు రూ. 6.5 లక్షలతో ఇన్విటేషన్ టు టెండర్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ వేలం ఆరంభమయ్యే ఐదు గంటల ముందు, అంటే మార్చి 27న ఉదయం 10 గంటలకు సైతం బిడ్ సమర్పించవచ్చు. ఇక ఐపీఎల్ ప్రసారహక్కుల తర్వాత భారత క్రికెట్ ప్రసార హక్కులు సైతం కొండెక్కాయని చెప్పవచ్చు. ప్రస్తుత టెండర్‌లోనూ ఐపీఎల్ మాదిరిగానే టెలివిజన్, డిజిటల్, గ్లోబల్ విభాగాల్లో బిడ్లు ఆహ్వానిస్తున్నారు. సాంకేతిక విప్లవం పుణ్యమా అని అందరి చేతుల్లోకి స్మార్ట్‌ఫోన్లు వచ్చేశాయి. ఈ పరిణామమే బీసీసీఐ పంట పండిస్తోంది. సంప్రదాయ ఆదాయ వనరు టెలివిజన్ తలదన్నే రీతిలో డిజిటల్ హక్కులకు డిమాండ్ పెరిగింది. ఇదే ప్రసార హక్కుల విలువ భారీగా పెరిగేందుకు కారణం. రానున్న ఐదేండ్ల కాలంలో ఐసీసీ వన్డే, టెస్టు చాంపియన్‌షిప్స్‌ల రూపంలో టీమ్ ఇండియా గణనీయంగా క్రికెట్ ఆడబోతున్నది. మ్యాచుల సంఖ్య పెరిగితే, ప్రసార హక్కుల విలువ కూడా అదే రీతిలో పెరుగుతుంది. దీంతో రానున్న ఐదేండ్ల కాలానికి బీసీసీఐ భారీ ఆఫర్‌ను అందుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నది. ఐపీఎల్‌కు పోటీపడినట్టే దిగ్గజ కంపెనీలు భారత క్రికెట్ ప్రసార హక్కుల కోసం ఆసక్తి కనబరుస్తున్నాయి. కాసుల లీగ్ ఐపీఎల్‌ను తలదన్నే ఆఫర్‌ను భారత్ క్రికెట్ దక్కించుకుంటుందా అనే ఆసక్తి అందరిలోనూ కనిపిస్తోంది.

కోహ్లిని చూసి నేర్చుకున్నా!



న్యూఢిల్లీ : ఆధునిక క్రికెట్లో విరాట్ కోహ్లి, స్టీవ్ స్మిత్, జో రూట్, కేన్ విలియమ్సన్‌లు బ్యాటింగ్ దిగ్గజాలుగా కీర్తించబడుతున్నారు. ప్రత్యర్థి జట్లపై వారి ఆధిపత్యం, సాధికారిక బ్యాటింగ్ శైలి వారిని ముందు వరుసలో నిలుపుతున్నాయి. అత్యుత్తమం అంటే వారి నుంచి నేర్చుకునేది బోలెడంత ఉంటుంది!. ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ సైతం అదే చేశాడు. వారితో పోటీపడుతూనే ఎంతో నేర్చుకున్నానని అతడు చెబుతున్నాడు. ' స్పిన్‌ను ఎలా ఆడాలో కోహ్లిని చూసి కొంత నేర్చుకున్నా. ఆఫ్‌సైడ్ బంతిని బాదే క్రమంలో అతడి చేతి కవళికల నుంచి తెలుసుకున్నా. దాన్ని నేర్చుకుని, ప్రయత్నించా. బంతి రివర్స్ అవుతున్నప్పుడు ఎలా ఆడాలో ఏబీ డివిలియర్స్‌ను చూసి అచ్చుగుద్దినట్టు కాపీ కొట్టాను. ఇలాగే విలియమ్సన్ విషయంలోనూ. వీరంతా ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాళ్లు. వారి నుంచి ఎంత నేర్చుకోగల్గితే అంత నేర్చేసుకోవాలి' అని స్మిత్ చెప్పాడు.

సెమీస్‌లో ఆంధ్ర

న్యూఢిల్లీ : హైదరాబాద్ నిరాశపరిచినా మరో తెలుగు జట్టు విజయ్ హజారే వన్డే టోర్నీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం ఢిల్లీతో జరిగిన క్వార్టర్స్‌లో దుమ్మురేపిన ఆంధ్రా సెమీస్‌కు చేరుకున్నది. పేసర్ డి. శివ కుమార్ (4/29), భార్గవ్ భట్ (3/28), బండారు అయ్యప్ప (2/30) నిప్పులు చెరగటంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 111 పరుగులకే కుప్పకూలింది. ఢిల్లీ జట్టులో రిషబ్ పంత్ (38) ఒక్కడే ఫర్వాలేదనిపించాడు. గంభీర్ (8), ఉన్ముక్త్‌చంద్ (4), నితీశ్ రానా (2)లు విఫలమయ్యారు. స్వల్ప ఛేదనలో అశ్విన్ హెబ్బర్ (38), రికీ భుయ్ (36), బి.సుమంత్ (25) రాణించటంతో నాల్గు వికెట్లు కోల్పోయి ఆంధ్రా లక్ష్యాన్ని చేరుకున్నది. మరో మ్యాచ్‌లో బరోడాపై సౌరాష్ట్ర గెలుపొందింది. ఆదివారం జరిగే సెమీస్‌లో సౌరాష్ట్రతో ఆంధ్రా తలపడనున్నది.

తుది అంకంలో బడ్జెట్ పద్దు..

సీఎం ఆమోదమే తరువాయి

- ఇప్పటికే అన్ని శాఖలతో భేటీ అయిన ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి
- నియోజకవర్గానికే పరిమితమవుతున్న ఈటల



ఫైల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్ పద్దు దాదాపు ఖరారైంది. ఇందుకు సంబంధించిన సమాలోచనలు, సమావేశాలు పూర్తి కావచ్చాయి. ఇక ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేయటమే తరువాయి. మరో రెండున్నర వారాల్లో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఇప్పటికే అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమాలోచనలు జరిపారు. తద్వారా ఆయా శాఖల నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. వాటిలో పలు మార్పులు, చేర్పులు చేశారు. అనంతరం వాటిని క్రోడీకరించి ప్రాథమికంగా పద్దును రూపొందించారు. ఇప్పుడిక ముఖ్యమంత్రి ఆమోదం కోసం ఎదురు చూస్తున్నామని అధికారిక వర్గాలు వివరించాయి. శాఖల వారీగా ఇప్పటి వరకూ రూపొందించిన ప్రతిపాదనలు, కేటాయింపులకు ముఖ్యమంత్రి ఓకే.. అంటే ఆ వెంటనే పద్దును ఫైనల్ చేస్తామని ఉన్నతాధికారు చెబుతున్నారు. ఏయే శాఖకు ఎన్నెన్ని నిధులు కేటాయించాలనే దానిపై ఇప్పటికే స్పష్టత వచ్చింది. కాకపోతే వీటికి సీఎం కూడా అంగీకరించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆర్థికశాఖ రూపొందించిన కేటాయింపుల జాబితాలో ఆయన మార్పులు, చేర్పులేమైనా చేస్తే.. పద్దును మరొకసారి మార్చాల్సి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు వివరించాయి.

మరోవైపు బడ్జెట్ రూపకల్పన ప్రక్రియలో ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు ఎలాంటి ప్రాధాన్యత, ప్రాముఖ్యత లేకపోవటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి బడ్జెట్‌కు ముందు వివిధ శాఖలతో ఆర్థిక మంత్రే భేటీ కావాల్సి ఉంటుంది. అన్ని శాఖలతో విడివిడిగాను, ఉమ్మడిగానూ ఆయన పలు దఫాలు సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. తద్వారా ఆయా శాఖలు సమర్పించే ప్రతిపాదనలను ఆయన పరిశీలించాలి. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణలకు అనుగుణంగా ప్రతిపాదనల్లో మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియలో ఆర్థిక మంత్రి క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ఆ తర్వాతే బడ్జెట్ పద్దు ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుతుంది. బడ్జెట్ రూపకల్పనకు నెల రోజుల ముందు నుంచి ఈ హడావుడి ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ఇదే ఆనవాయితీ కొనసాగుతూ వచ్చింది. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత ఆర్థిక మంత్రి పాత్ర నానాటికీ నామమాత్రమై పోవటం గమనార్హం. మధ్యంతర బడ్జెట్‌తో కలిపి ఇప్పటి వరకూ నాలుగు బడ్జెట్లను ప్రవేశపెట్టిన ఈటల.. మార్చిలో ఐదోసారి పద్దును ప్రతిపాదించబోతున్నారు. ఈ క్రమంలో గత రెండేండ్ల నుంచి ఆయన ప్రాధాన్యత క్రమక్రమంగా తగ్గిపోవటం గమనార్హం. గతంలో ఒకసారి బడ్జెట్‌కు సంబంధించిన ప్రక్రియ శరవేగంగా కొనసాగుతుండగా.. ఆర్థిక మంత్రి నగర పాలక సంస్థల ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇప్పుడు కూడా అదే తరహాలో తన సొంత నియోజకవర్గమైన హుజూరాబాద్‌లోనే ఆయన ఎక్కువ సమయం గడుపుతున్నారనే వాదన వినిపిస్తున్నది. బడ్జెట్ ప్రక్రియను మొత్తం సీఎమ్మే ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుండటంతో.. తన అవసరం పెద్దగా ఉండబోదనే అభిప్రాయంతో ఆయన ఉన్నట్టు సమాచారం. దీంతోపాటు వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో.. ఇప్పటి నుంచే కార్యకర్తలు, ఓటర్లతో ఆయన మమేకమవుతున్నారనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది.

బ్రిటీష్ పాలకులు వణికారు

కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర సదస్సులో ఉత్తమ్



మాట్లాడుతున్న కుంతియా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశ వ్యాప్తంగా బ్రిటీష్ పాలనను కాంగ్రెస్ సేవాదళ్ గడగడలాడించిందని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సేవాదళ్‌ను బలీయమైన శక్తిగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. ఈనెల 26న మొదలు పెట్టనున్న కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్సు యాత్రను సేవాదళ్ కార్యకర్తలు విజయవంతం చేయాలని విజ్ఞపి చేశారు. గురువారం ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ సేవాదళ్ విభాగం చైర్మెన్ కనుకుల జనార్థన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సెక్యులరిజం సిద్ధాంతాలే జీవనాడులుగా కాంగ్రెస్ సేవాదళ్ విభాగం పని చేస్తోందన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత దేశ నిర్మాణంలో తనదైన పాత్ర పోషించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రజలను చైతన్యపరుస్తోందన్నారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీకి అండగా ఉంటూ ప్రజల కష్టాల్లో భాగస్వాములు అవుతారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ఐక్యత, క్రమశిక్షణను పెంపొందిస్తూ పార్టీకి చేదోడు వాదోడుగా పని చేస్తోందన్నారు. బీజేపీ పాలకులు సంఘ పరివార్‌ను ముందు పెట్టి పరిపాలన చేస్తున్నారని చెప్పారు.

ఇటువంటి తరుణంలో కాంగ్రెస్‌కు బలమైన శక్తిగా సేవాదళ్ ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. 133 ఏండ్ల చరిత్రలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో గడ్డు పరిస్థితులను, ఒడిదుడుకులను ఎదుర్కొన్నదని చెప్పారు. పార్టీలో ఐక్యత, క్రమశిక్షణను పాటిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియా, సేవాదళ్ చైర్మెన్ కెకె పాండే, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క, మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి, ఎంపీ ఎంఏ ఖాన్, మాజీ ఎంపీ వి హనుమంతరావు, కిషాన్ సెల్ చైర్మెన్ కోదండరెడ్డి, టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి ఉన్నారు.

మైనార్టీ గురుకులంలో రోబోటిక్ ల్యాబ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో రోబోటిక్ ల్యాబ్ ఏర్పాటైంది. రాష్ట్రంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో తొలి రోబోటిక్ ల్యాబ్ ఇదే కావడం విశేషం. గురువారం హైదరాబాద్‌లోని సైదాబాద్‌లో ఉన్న తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎంఆర్ఈఐఎస్)లో రోబోటిక్ ల్యాబ్‌ను ఆ సంస్థ కార్యదర్శి బి షఫీయుల్లా ఆవిష్కరించారు. ఈ రోబోటిక్ ల్యాబ్ వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆయన అన్నారు. విద్యార్థుల మేధస్సు పెరిగేందుకు, మంచి భవిష్యత్తు ఉండేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఇంజినీరింగ్ విభాగంలో మెళకువలు వస్తాయన్నారు. రాష్ట్రంలో మైనార్టీ గురుకులాల్లో చదివే 50 వేల మంది విద్యార్థులకు ఈ ల్యాబ్ సౌకర్యం అందుబాటులోకి తెస్తామని చెప్పారు. విద్యార్థులకు అన్ని రంగాల్లో అవగాహన పెంచడం కోసం ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. మెకానికల్ ల్యాబ్, ప్లంబింగ్ ల్యాబ్, ఎలక్ట్రికల్ ల్యాబ్, కార్పెంటరీ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్ విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎకె ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 10న సీపీఎస్ జనజాతర

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ మార్చి 10న హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో సీపీఎస్ జనజాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్(టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో సీపీఎస్ విధానంపై సమీక్షించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. 1.26లక్షల సీపీఎస్, ఉద్యోగ, ఉపాధ్యాయుల సామాజిక భద్రత..ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. మార్చి 10న జరిగే కార్యక్రమంలో కుటుంబాలతో సహా సీపీఎస్ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు. జనజాతర ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హైదరాబాద్ నగర అధ్యక్షులు ఎన్ నరేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె పవన్ తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం అబిడ్స్‌లోని భీమాభవన్ వద్ద మధ్యాహ్నభోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వారు పేర్కొన్నారు.

27,28 తేదీల్లో టీఎన్‌జీఓ మహిళా క్రీడాపోటీలు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఈనెల 27,28 తేదీల్లో ఎల్‌బీస్టేడియంలో తెలంగాణ ఎన్‌జీఓ కేంద్ర సంఘం మహిళా విభాగం క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు. గురువారం క్రీడాపోటీలకు సంబంధించిన పోస్టర్‌ను సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఖోఖో, కబడ్డీ, బాడ్మింటన్, చెస్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, టెన్నీకాయిడ్, మ్యూజికల్ చైర్స్, వాటర్ పాట్ వాకింగ్ లెమన్ స్పూన్ తదితర 13 క్రీడావిభాగాల్లో 400 మంది ఉద్యోగులు పాల్గొంటారని ఆ సంఘం ప్రతినిధులు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం రాజేందర్, కన్వీనర్ ఆర్ విజయలక్ష్మి, చైర్‌పర్సన్ బి రేచల్, కో కన్వీనర్ మనోహర, ప్రతినిధులు వనజారెడ్డి, ఉమాదేవి, ప్రశాంతి పాల్గొన్నారు.

26న ఎంసెట్ కమిటీ సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎంసెట్-2018 కమిటీ సమావేశం ఈనెల 26న జరగనుంది. గురువారం తనను కలిసిన విలేకరులతో ఉన్నత విద్యా మండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.